సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 259

శనివారం 10-12-2022



'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బ్రెజిల్ గుండె పగిలింది

ఫిఫా వరల్డ్ కప్‌లో బ్రెజిల్ ఆట క్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. గత రన్నరప్ క్రొయేషియా పెనాల్టీలతో బ్రెజిల్‌ను మట్టి కరిపించింది. నిర్ణీత సమయంతో పాటు అదనపు సమయం కలిపిన తర్వాత ఇరు జట్లు ఒక్కో గోల్ చేసి 1–1తో సమంగా నిలిచాయి. దాంతో షూటౌట్‌లో 4–2 తేడాతో క్రొయేషియా గెలిచింది.

13లో



సీఎం పీఠం మా నేతకే..

హిమాచల్ సీఎం పీఠానికి పలువురు పోటీ పడుతున్నారు. శుక్రవారం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భేటీ అయినా ఏకాభిప్రాయం రాలేదు.

వివరాలు 6లో ▶



ఎర్రకోటపై గులాబీ జెండా

కొత్త రాజకీయ శక్తి ఆవిర్భవించినపుడు పాత శక్తులు విమర్శిస్తాయని, ఎర్రకోటపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని కేసీఆర్ అన్నారు.

వివరాలు 10లో ▶



'ఉమ్మడి స్మృతి'పై ప్రైవేట్ బిల్లు

విపక్షాల అభ్యంతరం మధ్య 'ఉమ్మడి పౌరస్మృతి'పై రాజ్యసభలో ప్రైవేట్ మెంబర్ బిల్లును బీజేపీ సభ్యుడు మీనా ప్రవేశపెట్టారు.

వివరాలు 6లో ▶



17 ఏళ్ల నిరీక్షణకు తెర

విద్యుత్ సంస్థల ఉద్యోగులకు శుభవార్త. 17 ఏళ్ల తరువాత ఒక సంస్థ నుంచి మరో సంస్థకు బదిలీ అయ్యే వెసులుబాటు వచ్చింది.

వివరాలు 2లో ▶



ఇక సర్కారీ స్కూళ్లలోనూ

సీబీఎస్‌ఈ

తొలి దశలో 1,000 పాఠశాలలకు అనుమతి

- ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే 8వ తరగతి నుంచి ఆరంభం
- దశల వారీగా అన్ని స్కూళ్లలోనూ సీబీఎస్‌ఈ విధానం
- విద్యార్థులకు రెండు భాషల్లో పాఠ్యపుస్తకాల పంపిణీ
- 83,466 మంది టీచర్లకు శిక్షణ కూడా పూర్తి
- రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) ప్రవేశానికి అడుగులు ముందుకు పడ్డాయి. మొదటి దశలో 1,000 ప్రభుత్వ స్కూళ్లకు సీబీఎస్‌ఈ బోర్డు అనుమతులిచ్చింది. దీంతో ఈ స్కూళ్లన్నిటిలో రాష్ట్ర ప్రభుత్వం 8వ తరగతి నుంచి సీబీఎస్‌ఈ విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ విద్యా సంవత్సరం నుంచే 8వ తరగతి విద్యార్థులంతా సీబీఎస్‌ఈ విధానంలో చదువుతారు. అత్యున్నత మూల్యాంకన, బోధనా విధానాలున్న సీబీఎస్‌ఈ విధానాన్ని రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లన్నిటిలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో అత్యధిక శాతం బడుగు, బలహీనవర్గాల పిల్లలే. వీరంతా ప్రపంచ స్థాయి ప్రమాణాలను అందిపుచ్చుకునేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పాఠశాల విద్యలో అనేక విప్లవాత్మక సంస్కరణలకు

మిగతా 2వ పేజీలో ▶



దూసుకొచ్చిన మాండూస్

- నేడు మహాబలిపురం వద్ద తీరం దాటనున్న తుపాను
- తమిళనాడుపై అధిక ప్రభావం
- ఆంధ్రప్రదేశ్‌లోని 6 జిల్లాలపై ఎఫెక్ట్
- నెల్లూరు, తిరుపతి, ప్రకాశం జిల్లాల్లో భారీ వర్షాలు.. ముందు జాగ్రత్త చర్యల్లో ప్రభుత్వ యంత్రాంగం

3లో



చంద్రబాబూ! మతిభ్రమించిందా?

టీడీపీ అధినేతపై వైఎస్సార్‌సీపీ బీసీ మంత్రుల ఫైర్

2లో



'మార్గదర్శి'తో జాగ్రత్త

- చిట్స్ వేస్తున్న వారికి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ అండ్ ఐజీ వీ రామకృష్ణ హెచ్చరిక
- మేము అడిగిన సమాచారం ఇవ్వనందునే సందేహాలు
- వివరాలు ఇవ్వకుండా సొంత సర్టిఫికేషన్ ఇచ్చుకుంటే సరిపోతుందా?.. నమ్మకం, అవమానం, నిప్పు వంటి పదాలతో మాకు పని లేదు..
- వాస్తవాలు, సమాచారం ఆధారంగానే పని చేస్తాం
- త్వరలో హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలోనూ ఆడిట్ నిర్వహిస్తాం



సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్ కంపెనీ చిట్స్ రిజిస్ట్రార్లకు రికార్డులు సమర్పించకుండా, అడిగిన సమాచారం ఇవ్వకుండా అడ్వర్టైజ్‌మెంట్ ఇవ్వడం ఏమిటని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ అండ్ ఐజీ వి రామకృష్ణ ప్రశ్నించారు. తాము అడిగిన సమాచారం వారు ఇచ్చి ఉంటే, అది తాము సంతృప్తి చెందేలా ఉంటే సంతోషించే వారిలో తానే ప్రథముడినని చెప్పారు. అలా జరగనందునే పలు సందేహాలొస్తున్నాయని, అందువల్ల చిట్స్ వేస్తున్న వారు జాగ్రత్తగా ఉండాలని

మిగతా 2వ పేజీలో ▶



క్లుప్తంగా...

జీ-20 సన్నాహకాలపై ప్రధాని వీడియో కాన్ఫరెన్స్





ప్రధాని మోదీతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం జగన్

సాక్షి, అమరావతి : జీ–20 సదస్సు సన్నాహకాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఢిల్లీ నుంచి వివిధ రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఎస్ కేఎస్ జవహర్ రెడ్డి, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య, రెవెన్యూ శాఖ(ఎకై ్సజ్, వాణిజ్య పన్నులు) స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి రేవు ముత్యాలరాజు, ముఖ్యమంత్రి సంయుక్త కార్యదర్శి నారాయణ భరత్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

రూ.244.83 కోట్లతో డోర్నాల-కుంట రహదారి అభివృద్ధి

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

సాక్షి, అమరావతి: శ్రీశైలం భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలో మరో రహదారి నిర్మాణానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ప్రకాశం జిల్లా డోర్నాల నుంచి కుంట జంక్షన్ వరకు ఉన్న రహదారిని రెండు లైన్ల రహదారిగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. గతిశక్తి ప్రాజెక్టులో భాగంగా 30 కి.మీ. ఈ రహదారిని రెండు లైన్లు(విత్ పావ్డ్ సోల్డర్స్)గా అభివృద్ధి చేయనున్నారు. అందుకోసం కేంద్ర రవాణా, జాతీయ రహదారుల అభివృద్ధి శాఖ రూ.244.83కోట్లతో ప్రణాళికను ఆమోదించింది. కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ శుక్రవారం ట్వీట్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు.

రేపు బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ రాక

కంచికచర్ల ఆర్బీకే, నందిగామ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ పరిశీలన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వినూత్న రీతిలో జరుగుతున్న వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలను అధ్యయనం చేసేందుకు బ్రిటన్ ప్రభుత్వ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ వైన్ ఓవెన్ ఈ నెల11వ తేదీన రాష్ట్రంలో పర్యటించనున్నారు. గారెత్ వైన్ ఓవెన్ తొలుత ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలోని ఆర్బీకే, ఆ తర్వాత నందిగామలోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌ను సందర్శిస్తారు. ఆర్బీకేలో వ్యవసాయ అనుబంధ విభాగాల ద్వారా అందిస్తున్న సేవలను, కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తారు. ఆర్బీకేకు అనుబంధంగా ఏర్పాటుచేసిన వైఎస్సార్ యంత్రసేవ కేంద్రం(సీహెచ్‌సీ)తో పాటు వైఎస్సార్ పశుసంచార ఆరోగ్య సేవారథాన్ని పరిశీలిస్తారు. రైతు ఉత్పత్తిదారులు, వ్యవసాయ సలహామండలి సభ్యులతో భేటీ అవుతారు. ఆ తర్వాత క్షేత్రస్థాయి సందర్శనకు వెళ్లి పొలంబడి ప్లాట్‌ను పరిశీలిస్తారు. అనంతరం నందిగామలోని ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్‌ను సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలను తెలుసుకుంటారు. రైతులతో ముఖాముఖిలో పాల్గొంటారు.

మైనారిటీల అభ్యున్నతికి కృషి చేయాలి

కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ కార్యదర్శి భాటియా సూచన

సాక్షి, అమరావతి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం అయ్యేలా.. మైనారిటీల అభ్యున్నతికి కృషి చేయాలని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ కార్యదర్శి ముఖ్మీత్ ఎస్.భాటియా అధికారులకు సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలోని మూడో బ్లాక్‌లో శుక్రవారం ఆయన రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు, జగనన్న విదేశీ విద్యా దీవెన, ఓవర్ సీస్ విద్యా స్కీమ్, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల ద్వారా మైనారిటీలకు జరుగుతున్న మేలు గురించి భాటియా అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఏపీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఏపీ స్టేట్ క్రిస్టియన్ మైనారిటీల కార్పొరేషన్, ఏపీ వక్ఫ్ బోర్డు ద్వారా చేస్తున్న కార్యక్రమాలపైన సమీక్షించారు. ప్రధాన మంత్రి జన్‌వికాస్ కార్యక్రమం (పీఎంజేవీకే) అమలు, మైనారిటీలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న స్కాలర్‌షిప్ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ జీసీ కిషోర్ కుమార్, వక్ఫ్ సర్వే కమిషనర్ షేక్ షరీన్ బేగం, క్రిస్టియన్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జె.ఎలీషా, వక్ఫ్ బోర్డు సీఈవో ఎల్.అబ్దుల్ ఖాదర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబూ! మతి భ్రమించిందా?

- సభకు వచ్చిన బీసీలంతా పార్టీ కార్యకర్తలే కదా?
- పార్టీ తరఫున వివిధ ఎన్నికల్లో గెలిచిన వారు కొందరు
- నామినేటెడ్ పదవులు పొందినవారు మరికొందరు
- వారిని సదస్సుకు రావాలని వారిని బెదిరించాల్సిన పని ఉందా?
- పెన్షన్లు, రేషన్ కార్డులు కత్తిరిస్తామని భయపెట్టాల్సిన అవసరం ఉందా?
- నీ మతిలేని మాటల్ని జనం వింటున్నారన్న ఇంగితం కూడా లేదా?
- టీడీపీ అధినేతపై వైఎస్సార్ కాంగ్రెస్ మంత్రులు, ఎంపీల ఫైర్

సాక్షి, అమరావతి : పెన్షన్లు కట్ చేస్తామని, రేషన్ కార్డులు తొలగిస్తామని భయపెట్టడం వల్లే 'జయహో బీసీ' సదస్సుకు అంతమంది వచ్చారంటూ విమర్శలు చేస్తున్న తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడిని ఏమనుకోవాలి? సదస్సుకు బీసీలు రాలేదని, అది విఫలమైందని ముందురోజు వ్యాఖ్యానించిన చంద్రబాబు... 24 గంటలు తిరిగేసరికల్లా మాటమార్చారు. భయపెట్టడం వల్లే వారంతా వచ్చారని మరో దుష్ప్రచారానికి ఒడిగట్టారు. అయినా అక్కడికి వచ్చిన బీసీలెవ్వరు? సామాన్య ప్రజానీకం కాదు కదా? అంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకులు. వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ ఎన్నికల్లో గెలిచిన వారు, నామినేటెడ్ పదవులు పొందినవారు మాత్రమే. అంటే... పార్టీ తరఫున పోటీ చేసి గెలవటమో, నామినేటెడ్ పదవిని పొందటమో జరిగినవారు. వీళ్లంతా పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలు. మరి వీళ్లని సభకు ఆహ్వానిస్తే చాలు కదా!. వాళ్లంతట వాళ్లే వస్తారు కదా? చంద్రబాబు చెప్పినట్లుగా సభకు హాజరు కాకపోతే పింఛన్లు కట్‌చేస్తామని, రేషన్ కార్డులు తొలగిస్తామని బెదిరించాల్సిన అవసరం ఉందా? అసలు చంద్రబాబు మతి ఉండే మాట్లాడుతున్నారా? ఈ మతిలేని మాటలపై శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ మంత్రులు, నాయకులు తీవ్రంగా విరుచుకుపడ్డారు. భారీ ఎత్తున జరిగిన బీసీ సదస్సును చూసి చంద్రబాబుకు కంగారు పుట్టిందని, అందుకే ఏదేదో మాట్లాడుతున్నారని విమర్శించారు. కొందరు మంత్రులు, ఎంపీలు ఏమన్నారంటే...



వైఎస్సార్‌సీపీ బీసీ ప్రజాప్రతినిధులు, ప్రతినిధులు వీరే

హోదా	బీసీలు
జిల్లా పార్టీ అధ్యక్షులు	9
ఎంపీలు(రాజ్యసభ,లోక్‌సభ)	10
ఎమ్మెల్సీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు	44
నియోజకవర్గాల సమన్వయకర్తలు	8
రాష్ట్ర అధికార ప్రతినిధులు	2
అనుబంధ విభాగాల రాష్ట్ర అధ్యక్షులు	8
జనరల్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌లు	32
కులాల కార్పొరేషన్ చైర్‌పర్సన్‌లు	56
జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌లు	6
జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్‌లు	12
మేయర్లు, డిప్యూటీ మేయర్లు	16
డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్‌పర్సన్‌లు	10
గ్రాంథాలయ చైర్‌పర్సన్‌లు	6
మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు	19
జనరల్ కార్పొరేషన్ డైరెక్టర్లు	135
బీసీ కార్పొరేషన్ డైరెక్టర్స్	667
కార్పొరేటర్లు	289
జెడ్పీటీసీ సభ్యులు	211
మున్సిపల్ చైర్‌పర్సన్‌లు,వైస్ చైర్‌పర్సన్‌లు	111
కౌన్సిలర్లు	841
ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు	760
ఎంపీటీసీ సభ్యులు	2,791
సర్పంచులు	3,985
పంచాయతీ వార్డు మెంబర్లు	59,872
ఏఎంసీ చైర్‌పర్సన్‌లు, డైరెక్టర్లు	433
పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు	2,990
డీసీసీబీ, డీసీఎంసీఎస్ డైరెక్టర్లు	56
ట్రస్టులు	1,466
ఓల్డ్ బీసీ స్టేట్ కమిటీ మెంబర్లు	214
ఓల్డ్ బీసీ కమిటీలు(రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయిదాకా)	7,429
మొత్తం	82,488

నియోజకవర్గాల పరిశీలకులు, ఇతర పదవులతో కలిపితే 85,000కు పైనే ఉన్నారు.

వచ్చిన వారంతా బీసీ ప్రజా ప్రతినిధులే



దేశ చరిత్రలోనే ఇటువంటి సభ ఎక్కడా, ఎప్పుడూ జరగలేదు. బస్సుల్లో వచ్చిన వారంతా పార్టీ నుంచి ఎన్నికైన బీసీ ప్రజా ప్రతినిధులే. తన 45 ఏళ్ల కెరీర్‌లో చంద్రబాబు ఇంత మంది బీసీలకు ఏనాడైనా పదవులు ఇచ్చాడా? తనను గెలిపిస్తే సీఎం జగన్ ప్రవేశపెట్టిన పథకాలన్నీ ఉంటాయని చంద్రబాబు చెప్పుకుని తిరుగుతున్నారు. అటువంటి బాబు ఒక లీడరా? 2024లో కుప్పంలో బీసీ చేతిలోనే బాబు ఓటమి ఖాయం. మేం విజయవాడలో నిర్వహించింది.. పార్టీ నుంచి ఎన్నికైన బీసీ ప్రతినిధుల బహిరంగ సభ. బీసీల సాధికారత సభ. పదవులు పొందిన 85 వేల మంది బీసీ వర్గాల వారు ఒక దగ్గర చేరి జయహో బీసీ అని తమ శక్తిని చాటారు. రియల్ లీడర్, సామాజిక సంస్కర్త అయిన వైఎస్ జగన్ ఏపీ సీఎంగా ఉన్నారని అందరికీ తెలిసేలా జయహో బీసీ సభ ద్వారా చాటి చెప్పాం. సీఎం జగన్ మాట్లాడుతుంటే.. అక్కడ ఉన్న వారంతా ముందుకు తోసుకువచ్చారు. దాన్ని పచ్చ మీడియా భూతద్దంలో చూపాలని ప్రయత్నం చేసింది. అక్కడ జనం లేరని చూపడం ద్వారా విషం కక్కాలని విఫల ప్రయత్నం చేసింది.

– చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి

బాబూ.. ఇదీ నా పథకం అని ఒక్కటి చెప్పండి



కులం, మతం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్క పేదవాడికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం ఇది. ఇదీ నా బ్రాండ్.. ఇదీ నా పథకం అని చంద్రబాబు ఒక్కటంటే ఒక్క సంక్షేమ పథకం గురించి చెప్పుకోగలరా? పైగా ఆయన అధికారంలోకి వస్తే ఇప్పుడున్న పథకాలన్నీ కొనసాగిస్తానని చెప్పుకుంటూ ఊరూరు తిరుగుతున్నారు. ఈయన ఒక లీడరా? ఆయన మాటల్లోనే జగన్ గొప్పతనం కనిపిస్తోంది. ఇంతకంటే మాకు ఏం కావాలి? వైఎస్సార్‌సీపీలో 37 విభాగాలు ఉన్నాయి. ఆ విభాగాలన్నింటితో పాటు వివిధ పదవులు పొందిన 85 వేల మంది మొన్న బీసీ సభకు వచ్చారు. సీఎం జగన్ వల్లే తామంతా పదవులు పొందామని ఘనంగా చాటారు. అధికారం కోసం ఏ గడ్డి తినడానికైనా చంద్రబాబు సిద్ధపడ్డారు. బీసీల ఓట్ల కోసం మళ్లీ గాలం వేసే ప్రయత్నం చేస్తున్నాడు. ఆ ప్రయత్నంలో భాగంగానే జయహో బీసీ మహాసభను అపహాస్యం చేస్తూ మాట్లాడుతున్నారు. మొన్నటి సభలో 85 వేల మంది ప్రజాప్రతినిధులు కళ్లెదుటే కనిపిస్తుంటే.. పచ్చ గ్యాంగ్‌తో తప్పుడు ప్రచారం చేయించారు. బాబు అండ్ కో ఎన్ని వేషాలు వేసినా బీసీలంతా సీఎం జగన్ వెంటే ఉంటారు.

– సీదిరి అప్పలరాజు, పశుసంవర్థక శాఖ మంత్రి

పొర్లు దండాలు పెట్టినా బాబును నమ్మరు



వార్డు వలంటీర్లు లబ్ధిదారులను బెదిరిస్తే బీసీ మహాసభకు జనం తరలివచ్చారంటూ చంద్రబాబు మాట్లాడడం అతని మానసిక దౌర్బల్యానికి, అజ్ఞానానికి నిదర్శనం. జయహో బీసీ సభకు వచ్చిన వారంతా మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు, కార్పొరేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, వార్డు మెంబర్లు ఇలా వివిధ పదవుల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు. పెన్షన్లు కత్తిరిస్తామని, రేషన్ కార్డులు తొలగిస్తామని ఇలాంటి వారిని ఎవరైనా బెదిరించడానికి అవకాశం ఉంటుందా? బీసీ వర్గాల్లో 85 వేల మందికి పదవులు ఇచ్చి గౌరవించి.. సీఎం జగన్ ఒక కొత్త నాయకత్వాన్ని తయారు చేశారు. దీన్ని చంద్రబాబు జీర్ణించుకోలేక దుష్ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఇలా పదవులు పొందిన బీసీలంతా ఓ సదస్సు నిర్వహించడం ఇదే ప్రథమం. ఇది విజయవంతం కావడంతో చంద్రబాబుకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. పిచ్చిపట్టినట్లు మాట్లాడుతున్నారు. చంద్రబాబు తన చివరి ఐదేళ్ల పదవీ కాలంలో రూ.19 వేల కోట్లు మాత్రమే బీసీల కోసం ఖర్చు చేస్తే.. సీఎం జగన్ మూడేళ్లలోనే ఏకంగా రూ.1.63 లక్షల కోట్లు ఖర్చు చేశారు. బీసీల తోలు తీస్తా.. తాట తీస్తా.. తోకలు కత్తిరిస్తా అని ఇష్టానుసారం మాట్లాడిన చంద్రబాబు.. పొర్లు దండాలు పెట్టినా ఎవరూ నమ్మరు.

– విడదల రజిని, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి

బాబూ.. బీసీ సంక్షేమంపై చర్చకు సిద్ధమా?



14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు బీసీలకు ఏం చేశారు.. మూడేళ్లలోనే సీఎం జగన్ ఏం చేశారనే అంశంపై చర్చకు చంద్రబాబు సిద్ధమా? ఆ 14 ఏళ్లలో ఒక్క బీసీకైనా రాజ్యసభ సీటు ఇచ్చారా? ప్రభుత్వంలో, పార్టీలో భాగస్వాములు చేయగలిగారా? దమ్ముంటే లిస్ట్ తీయండి. కేవలం మూడేళ్లలోనే మా లీడర్, సీఎం జగన్ 85 వేల మంది బీసీలను ప్రజాప్రతినిధులుగా తయారు చేశారు. జయహో జగన్ అని మొన్న బీసీ మహాసభలో కీర్తించారు. ఈ సక్సెస్‌ను చూసి.. చంద్రబాబుకు అసూయ, ద్వేషం పెరిగిపోయింది. అందుకే బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బకొట్టేలా, కించపరిచేలా మాట్లాడుతున్నారు. నా ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం బాబుకు, ఆయన బానిసలకు ఉందా? రాజ్యసభ సీటు ఆశ చూపి, వర్ల రామయ్యను మోసం చేసింది వాస్తవం కాదా? మా పథకాలను కొనసాగిస్తాననటే, మా జగనన్నకు జిందాబాద్ కొట్టినట్టే. బీసీల దెబ్బేంటో బాబుకు ఇంకోసారి రుచి చూపిస్తాం. పవన్ తన వాహనానికి వారాహి అని కాదు.. నారాహి అని పేరు పెట్టుకోవాలి. రాష్ట్రంలో త్రీ సైకోస్ (చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేశ్)లు వైఎస్సార్‌సీపీ జయహో బీసీ ట్రైలర్ చూసే తడుపుకుంటున్నారు. ఇక సినిమా చూస్తే చంద్రబాబుకు మూర్ఛ వస్తుంది.

– జోగి రమేష్, గృహ నిర్మాణ శాఖ మంత్రి

సీఎం జగన్ సారథ్యంలోనే బీసీలకు మేలు



జయహో బీసీ మహాసభ విజయవంతం కావటంతో బీసీలు టీడీపీకి పూర్తిగా దూరమయ్యారనే వాస్తవాన్ని చంద్రబాబు గ్రహించారు. అందుకే మతిభ్రమించి మాట్లాడుతున్నారు. మూడున్నరేళ్లుగా రాష్ట్రంలో బీసీలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అందలం ఎక్కారు. ఈ విషయంపై ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధం. రాజ్యసభ సీట్లను పారిశ్రామికవేత్తలకు కోట్ల రూపాయలకు అమ్ముకున్న ఘనుడు చంద్రబాబు. నమ్మిన వారిని ముంచటం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. నాడు కేంద్రంలో చక్రం తిప్పే స్థాయిలో ఉన్న చంద్రబాబు.. రాష్ట్రం నుంచి ఒక్క బీసీని కూడా రాజ్యసభకు పంపక పోవడం దుర్మార్గం. మూడున్నరేళ్లుగా బీసీల అభివృద్ధికి సీఎం జగన్ అహర్నిశలు పాటుపడ్డారు. నలుగురు బీసీలను రాజ్యసభకు పంపారు. వార్డు మెంబరు నుంచి రాజ్యసభ వరకు 85,000 మంది బీసీలకు వివిధ పదవులు కట్టబెట్టారు. జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాలని పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టడానికి కారణమైన ఏకైక ముఖ్యమంత్రి జగనే. అందుకే బీసీలంతా సీఎం జగన్ వెంట నడుస్తున్నారు.

– మోపిదేవి వెంకట రమణారావు, రాజ్యసభ సభ్యుడు

'మార్గదర్శి'తో జాగ్రత్త

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన హెచ్చరించారు. విజయవాడలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన చిట్‌ఫండ్ చట్టంపై చిట్స్ డిప్యూటీ, అసిస్టెంట్ రిజిస్ట్రార్లతో సదస్సు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మార్గదర్శి ఇచ్చిన అడ్వర్టైజ్‌మెంట్‌లో సమ్మతం, అవమానం, నిప్పు, అబద్ధాలు.. వంటి కొన్ని పదాలు వాడారని, వాటితో తమకు పని లేదన్నారు. నిజాలు, సమాచారం, అంకెలు ఆధారంగానే తాము పని చేస్తామని చెప్పారు. వాస్తవాలు చెప్పకుండా, సమాచారం ఇవ్వకుండా ఇలాంటి ప్రకటనలు ఇచ్చుకోవడం వల్ల ఉపయోగం లేదన్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్ కంపెనీ తనకు తానే సెల్ఫ్ సర్టిఫికేషన్ ఇచ్చుకుంటే సరిపోదని, తాము అడిగిన సమాచారం ఇవ్వాలని, బ్యాలెన్స్ షీట్లు సమర్పించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఐజీ ఇంకా ఏమన్నారంటే..

అది మా బాధ్యత..

- ఫిర్యాదు వస్తేనే తనిఖీలు చేయాలని లేదు. ప్రజల సొమ్ముకు రక్షణ కల్పించేందుకు మేము ఎప్పుడైనా తనిఖీలు చేయొచ్చు.. చేస్తాం కూడా. ప్రతి ఏడాది వారు వివరాలు సమర్పించాలి. మేము అడిగిన సమాచారం ఇవ్వనందునే ఇదంతా చెప్పాల్సి వస్తోంది. వారు సమాచారాన్ని ఇవ్వక పోవడం వల్లే సందేహించాల్సి వస్తోంది. తప్పులు జరిగాయని భావించాల్సి వస్తోంది. అందువల్ల చిట్‌లు వేస్తున్న వారు జాగ్రత్తగా ఉండక తప్పదు. ఒకవేళ ఫిర్యాదు వస్తే.. సీబీఐ, ఈడీ, పోలీసు వంటి సంస్థలు దర్యాప్తు చేస్తాయి.
- మార్గదర్శి కార్పొరేట్ కార్యాలయం హైదరాబాద్‌లో ఉంది కాబట్టి ఏపీకి సమాచారం ఇచ్చేది లేదని ప్రకటనలో పేర్కొంటే కుదరదు. ఏపీలో మార్గదర్శి కంపెనీ లక్ష మంది చందాదారులతో 2,345 చిట్లు నిర్వహిస్తోంది. వాటన్నింటినీ ఇక్కడి నుంచి నిర్వహిస్తూ బ్యాలెన్స్ షీట్లు ఎక్కడ ఇస్తారు? రిజిస్ట్రార్‌కి రికార్డులు ఇచ్చామని ప్రకటనలో పేర్కొన్నారు. ఆ లెక్కన వాటిని తెలంగాణ, కర్ణాటక అధికారులకు ఇచ్చారా?
- మార్గదర్శి యాజమాన్యం వారికి అనుకూలంగా నిబంధనలను చూపిస్తోంది. చిట్‌ఫండ్ చట్టంలోని సెక్షన్ 21ని చూపిస్తూ తమ ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉంది కాబట్టి ఏపీకి జవాబుదారీ కాదనడం సరికాదు. సెక్షన్ 19, 24లను కూడా వారు చదవాలి. ఇక్కడి కార్యకలాపాలకు మాకు బ్యాలెన్స్ షీట్లు ఇవ్వాల్సిందే.

ఫోర్‌మెన్స్‌కు అధికారాలు లేవంటే ఎలా?

- ఏపీలో మార్గదర్శి నిర్వహించే కార్యకలాపాలపై ఏదైనా సమస్య వస్తే తెలంగాణ, కర్ణాటక అధికారులు చూస్తారా? ఫోర్‌మెన్స్‌కు ఎటువంటి అధికారాలు లేవని చెబుతున్నారు. ఇది సరికాదు. అలాగైతే కొత్త చిట్స్‌కు అనుమతి ఇవ్వం. డిపాజిట్లు ఎక్కడున్నాయో, వాటిని ఎలా వినియోగిస్తున్నారో ఫోర్‌మెన్లకు తెలియాల్సిందే.
- ఎవరూ అడక్కుండానే చిట్‌ఫండ్ కంపెనీలు తమ కార్యకలాపాలు, బ్యాలెన్స్ షీట్ల వివరాలను చిట్స్ రిజిస్ట్రార్లకు ఇవ్వాలి. కానీ ఎనిమిదేళ్లుగా మార్గదర్శి రికార్డులను సమర్పించడం లేదు. అందువల్ల త్వరలో హైదరాబాద్‌లోని మార్గదర్శి ప్రధాన కార్యాలయంలో నిపుణులతో ఆడిట్ నిర్వహిస్తాం.
- అన్నీ సక్రమంగా నిర్వహిస్తుంటే ఎందుకు భయపడుతున్నట్లు? ఆ కంపెనీ పబ్లిక్ డొమైన్‌లో ఉంచిన డాక్యుమెంట్ ప్రకారం చిట్‌ఫండ్ నిధులు ఇతర సంస్థలకు మళ్లించినట్లు స్పష్టమైంది. మార్గదర్శి సహా రాష్ట్రంలోని 35 చిట్‌ఫండ్ కంపెనీల్లో మూడు విడతలుగా తనిఖీలు నిర్వహించాం. ఒక్క మార్గదర్శి తో తప్ప మిగిలిన కంపెనీలతో ఎటువంటి సమస్యా రాలేదు.

ఈ ప్రశ్నలకు బదులేదీ?

- చిట్స్ రిజిస్ట్రార్లకు రికార్డులు సమర్పించకుండా అడ్వర్టైజ్‌మెంట్ ఇవ్వడం ఏమిటి?
- అందులో మీకు అనుకూలంగా చెప్పుకుంటారా? మీకు మీరే సెల్ఫ్ సర్టిఫికేషనా?
- మీ కార్పొరేట్ కార్యాలయం హైదరాబాద్‌లో ఉంటే ఏపీలో రికార్డులు చూపరా?
- మీరు ఏపీలోనూ చిట్‌ఫండ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నది నిజం కాదా?
- ఏ రిజిస్ట్రార్‌కు బ్యాలెన్స్ షీట్లు ఇచ్చారు? కర్ణాటక రిజిస్ట్రార్‌కా.. లేక తెలంగాణ రిజిస్ట్రార్‌కా?
- ఎలాంటి అధికారాలు ఇవ్వకుండానే ఫోర్‌మెన్ (మేనేజర్ తరహా పోస్టు)లను నియమించారా?
- రాష్ట్ర విభజన తర్వాత నుంచి మీరు ఏపీలో రికార్డులు చూపక పోవడం నిజం కాదా?
- చిట్‌ఫండ్ నిధులు ఇతర సంస్థలకు మళ్లించడం నిజం కాదా?
- రాష్ట్రంలో 35 చిట్‌ఫండ్ కంపెనీల్లో మీరొక్కరే ఎందుకు సహకరించడం లేదు?
- అంతా సరిగ్గా ఉంటే ఎందుకు భయపడుతున్నారు?

17 ఏళ్ల నిరీక్షణకు తెర

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. దాదాపు పదిహేడేళ్ల తరువాత ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కోతో పాటు ఏపీ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లలోని ఉద్యోగులు ఒక సంస్థ నుంచి మరో సంస్థకు బదిలీ అయ్యే వెసులుబాటు కల్పించింది. 2005లో ఈ తరహా బదిలీలపై బ్యాన్ విధించడంతో ఇన్నాళ్లు ఏ సంస్థ పరిధిలోని వారు ఆ సంస్థ పరిధిలోనే బదిలీ అవుతున్నారు. అంటే ఏపీఈపీడీసీఎల్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగి ఆ సంస్థ పరిధిలోని జిల్లాల్లోనే బదిలీ అవుతారు. తాజా వెసులుబాటుతో ఆ సంస్థ ఉద్యోగి ఏపీఎస్పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్ పరిధిలోని జిల్లాలకు బదిలీని కోరవచ్చు. ఈ బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ఏపీ ట్రాన్స్‌కో హెచ్‌ఆర్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ చైర్మన్‌గా ఓ కమిటీని నియమిస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తాజాగా ఉత్తర్వులిచ్చారు. ఈ నెల 12లోగా సిబ్బంది తమ బదిలీ అభ్యర్థన దరఖాస్తులను హెచ్‌ఆర్ కమిటీకి అందించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం దరఖాస్తు ప్రతిపాదనలను పరిశీలించిన తరువాత కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి అందజేస్తుంది. అనంతరం ఉద్యోగుల బదిలీలు జరుగుతాయి.

ఇక సర్కారీ స్కూళ్లలోనూ సీబీఎస్‌ఈ

▶ మొదటి పేజీ తరువాయి

శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టింది. అన్ని రాష్ట్రాలకన్నా ముందుగా ఫౌండేషనల్ విద్యావిధానానికి బాటలు వేసింది. మరోవైపు సీబీఎస్‌ఈ విధానాన్ని ప్రభుత్వ స్కూళ్లలో అమలు చేస్తే విద్యార్థులు అత్యున్నత ప్రమాణాలు అందుకోగలుగుతారని కృతనిశ్చయంతో ఉంది. ఈ నేపథ్యంలో సీబీఎస్‌ఈ నిబంధనలకు అనుగుణంగా ఉన్న పాఠశాలలను ముందుగా గుర్తించింది. మొదటి దశలో మొత్తం 1,308 ప్రభుత్వ స్కూళ్లకు అనుమతుల కోసం సీబీఎస్‌ఈ బోర్డుకు ప్రతిపాదనలు పంపింది. ఈ స్కూళ్లలో 8వ తరగతి నుంచి సీబీఎస్‌ఈ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. వీటిలో జిల్లా పరిషత్ స్కూళ్లు 417, మునిసిపల్ స్కూళ్లు 71, ఏపీ గురుకుల విద్యా సంస్థలు 39, ఏపీ మోడల్ స్కూళ్లు 164, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు 352, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థలు 179, బీసీ గురుకుల సంక్షేమ విద్యా సంస్థలు 26, గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థలు 45, ఆశ్రమ్ స్కూళ్లు 15 ఉన్నాయి. వీటికి సీబీఎస్‌ఈ అనుమతుల కోసం రూ.5.88 కోట్లను విద్యా శాఖ సీబీఎస్‌ఈ బోర్డుకు చెల్లించింది. గుర్తింపునకు అవసరమైన పత్రాలను కూడా ఆన్‌లైన్‌లో సమర్పించింది. ఈ స్కూళ్లలో 1,229 స్కూళ్లకు అఫ్లియేషన్ నంబర్ వచ్చినా చివరకు 1,000 ప్రభుత్వ స్కూళ్లకు సీబీఎస్‌ఈ బోర్డు అనుమతులు ఇచ్చింది. దీంతో ఈ స్కూళ్లల్లో ఈ విద్యా సంవత్సరం నుంచే ఎనిమిదో తరగతి నుంచి సీబీఎస్‌ఈ విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఈ విద్యార్థులకు సీబీఎస్‌ఈ సిలబస్‌కు అనుగుణంగా పాఠ్యపుస్తకాలను కూడా పంపిణీ చేసింది. వీటిని తెలుగు, ఆంగ్లం రెండు భాషల్లో ఉండేలా మిర్రర్ ఇమేజ్‌లు రూపొందించి అందించింది.

జిల్లా	సీబీఎస్‌ఈ అనుబంధ పాఠశాలల సంఖ్య
శ్రీకాకుళం	64
విజయనగరం	64
పార్వతీపురం మన్యం	40
విశాఖపట్నం	19
అనకాపల్లి	41
అల్లూరి సీతారామరాజు	35
కాకినాడ	33
కోనసీమ	12
తూ.గోదావరి	15
ప.గోదావరి	16
ఏలూరు	34
కృష్ణా	9
ఎన్టీఆర్	27
గుంటూరు	11
బాపట్ల	21
పల్నాడు	66
ప్రకాశం	63
నెల్లూరు	40
చిత్తూరు	22
తిరుపతి	30
వైఎస్సార్	30
అన్నమయ్య	49
కర్నూలు	90
నంద్యాల	69
అనంతపురం	51
శ్రీసత్యసాయి	49

మిగతా స్కూళ్లకు చర్యలు వేగవంతం..

కాగా రాష్ట్రంలో మిగతా ప్రభుత్వ స్కూళ్లలోనూ సీబీఎస్‌ఈ విధానాన్ని దశలవారీగా అమల్లోకి తెచ్చేందుకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, పాఠశాల విద్య కమిషనర్ సురేష్‌కుమార్ తదితరులు చర్యలు వేగవంతం చేశారు. శుక్రవారం సీబీఎస్‌ఈ బోర్డు అధికారులతో వెబ్‌ఎక్స్ సమావేశంలో వీటిపై చర్చించారు. సీబీఎస్‌ఈ విధానానికి అనుగుణంగా సిద్ధం చేసేందుకు ఇప్పటికే రాష్ట్రంలో 83,466 మంది టీచర్లకు శిక్షణ కూడా ఇచ్చారు.

సీబీఎస్‌ఈ విధానంతో విద్యార్థులకు ప్రయోజనాలు ఇవే..

సీబీఎస్‌ఈ విధానం అమలుతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందని విద్యావేత్తలు, నిపుణులు చెబుతున్నారు.

- సీబీఎస్‌ఈ.. కేంద్ర ప్రభుత్వ సంస్థ. అత్యున్నత విద్యా విధానాలు అమలు చేస్తున్న సీబీఎస్‌ఈకి అంతర్జాతీయ స్థాయిలో పేరుంది.
- ఈ విద్యా విధానంలో చదివిన విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా మంచి గుర్తింపు లభిస్తోంది.
- దేశంలో ప్రముఖ విద్యా సంస్థలైన ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ఎయిమ్స్, జిప్‌మర్, సీఎంసీ వంటి సంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ, నీట్ వంటివి సీబీఎస్‌ఈ సిలబస్‌తోనే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాల దశ నుంచే సీబీఎస్‌ఈ విధానంలో చదివినవారు జాతీయ స్థాయి ప్రవేశపరీక్షల్లో మంచి ర్యాంకులు కొల్లగొడుతున్నారు.
- సీబీఎస్‌ఈ విధానం విద్యార్థుల్లో బలమైన పునాదులు వేస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ విధానంలో విద్యార్థి తన ఆసక్తిని అనుసరించి చదువులు కొనసాగించే స్వేచ్ఛ ఉంటుందని పేర్కొంటున్నారు. దీనివల్ల విద్యార్థులు ఒత్తిడికి లోనయ్యే పరిస్థితి ఉండదని వివరిస్తున్నారు.
- దేశవ్యాప్తంగా సీబీఎస్‌ఈ విధానం ఉండటం వల్ల విద్యార్థులు ఏ రాష్ట్రానికి వెళ్లినా ఇబ్బంది లేకుండా చదువులు కొనసాగించవచ్చు.
- సీబీఎస్‌ఈ విద్యావిషయక అంశాల్లోనే కాకుండా విద్యార్థి సమగ్రాభివృద్ధికి బాటలు వేసేలా ఉంటుందని విద్యావేత్తలు చెబుతున్నారు. అంతేకాకుండా సమస్యను తనంతట తాను పరిష్కరించుకోగలిగే సామర్థ్యాన్ని విద్యార్థుల్లో పెంపొందిస్తుందని స్పష్టం చేస్తున్నారు. అలాగే విద్యార్థులు తమంతట తాముగా చదువుకోగలిగే నైపుణ్యాలను కూడా అందిస్తుందని పేర్కొంటున్నారు.

సాయుధ దళాల సేవలు సదా స్ఫూర్తిదాయకం

- గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్
- ఘనంగా సాయుధ దళాల పతాక దినోత్సవం

సాక్షి, అమరావతి/మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సాయుధ దళాల సేవలు సదా స్ఫూర్తిదాయకమని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా విజయవాడలోని రాజ్‌భవన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ రక్షణతోపాటు ప్రకృతి విపత్తుల సమయంలో సాయుధ దళాలు నిరుపమాన సేవలందిస్తున్నాయన్నారు. సాయుధ దళాల సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల పట్ల ప్రభుత్వాలు, పౌరులు మరింత శ్రద్ధ వహించాలని తెలిపారు. హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వీర నారీమణులు ఐశ్వర్య, లక్ష్మి, సత్యకళ, మమతలతో పాటు నాయక్ సుభాన్ షేక్, గ్యాలంట్రీ అవార్డు గ్రహీత ఆంజనేయులు, రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న నిమ్మగడ్డ నాగభూషణంలను గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ సత్కరించి రూ.25 వేల చొప్పున నగదు పురస్కారాన్ని అందించారు. రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ వెంకటరెడ్డి గవర్నర్‌కు సాయుధ దళాల పతాక స్టిక్కర్‌ను అందించి విరాళాలు సేకరించారు. గవర్నర్ స్వయంగా రూ.లక్ష అందించారు. ఆయన పిలుపు మేరకు ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, చలసాని రాజేంద్ర ప్రసాద్ రూ.లక్ష చొప్పున, టి.భోగేశ్వరరావు తదితరులు రూ.5లక్షలు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా, హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్‌కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



సాయుధ దళాల పతాక దినోత్సవంలో ప్రసంగిస్తున్న గవర్నర్ హరిచందన్

విజ్ఞాన వ్యవస్థను పరిరక్షించుకోవాలి

భారతీయ సంప్రదాయ విజ్ఞాన వ్యవస్థను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు. భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్–ఆర్కిటెక్చర్ కళాశాలలో శుక్రవారం 'కౌశల్–2022' నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి కౌశల్ పోటీ పరీక్షలు వేదికగా అభివర్ణించారు. విద్యార్థులు శాస్త్ర విజ్ఞానం సముపార్జనతోనే దేశాన్ని అగ్రపథంలో నిలపగలరని చెప్పారు. స్వదేశీ స్ఫూర్తిని పెంపొందించడం ద్వారానే ఆత్మ నిర్భర్ భారత్ లక్ష్యాలు సాధించగలమని తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన భారతి మండలి అధ్యక్షుడు అవధాని, ఉపాధ్యక్షుడు కైలాసరావు, 'కౌశల్–2022' సమన్వయకర్త డి.చంద్రశేఖర్, విజ్ఞాన భారతి గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు కేఎస్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

15 క్రీడాంశాల్లో శాప్ లీగ్ రాష్ట్ర స్థాయి పోటీలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) రెండవ దశ రాష్ట్ర స్థాయిలో పోటీలను 15 క్రీడాంశాల్లో శుక్రవారం నుంచి జనవరి ఒకటో తేదీ వరకు నిర్వహించనుంది. ఇప్పటి వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించకుంటే వేగంగా పూర్తి చేయాలని ఆయా జిల్లా క్రీడాప్రాధికార సంస్థలను శాప్ ఆదేశించింది. శాప్ లీగ్‌లలో ప్రతిభ కనబరిచిన టాప్–10 క్రీడాకారుల నైపుణ్యాలకు పదును పెట్టేలా ప్రణాళికలు రూపొందించినట్లు శాప్ ఎండీ ఎస్.ప్రభాకరరెడ్డి తెలిపారు.

నేటి నుంచి రోల్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ, రోల్‌బాల్ క్రీడా సంఘం ఆధ్వర్యంలో శాప్ లీగ్‌లో భాగంగా ఈ నెల 10, 11 తేదీల్లో గుంటూరులోని బీఆర్ స్టేడియంలో అండర్–11 రోల్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వివరాలకు 91005 53717 నంబరులో సంప్రదించాలి.

క్రీడలతో ఆరోగ్య సమాజం

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి



బహుమతులు అందజేస్తున్న జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: క్రీడలు ఆరోగ్యకర సమాజానికి దోహదపడతాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలను తమ జీవితాల్లో భాగంగా చేసుకుని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు శుక్రవారం సచివాలయం ప్రాంగణంలో బహుమతులు ప్రదానం చేశారు. సీఎస్ మాట్లాడుతూ దేశంలో ఆరోగ్యకర వాతావరణాన్ని పెంపొందించేందుకు ఫిట్ ఇండియా క్యాంపెయిన్ పేరుతో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు ఉత్సాహం, అంకితభావంతో విధులను నిర్వర్తించేందుకు కూడా క్రీడలు ఉపయోగపడతాయన్నారు. యువజన, క్రీడా శాఖ ముఖ్య కార్యదర్శి వాణీమోహన్ పాల్గొన్నారు. సచివాలయం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు సీఎస్‌ను ఘనంగా సత్కరించారు.

ప్రజలు తగిన శాస్తి చేసినా టీడీపీకి బుద్ధి రాలేదు

బీజేపీ ఆంధ్రప్రదేశ్ శాఖ

సాక్షి, అమరావతి: 'గత అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీని టీడీపీ టార్గెట్ చేసింది. అంతేకాదు అధికారంలో ఉండి కేంద్రానికి, బీజేపీకి, ప్రధానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేశారు. అయితే ప్రజలు తగిన శాస్తి చేశారు. అయినా బుద్ధి రాలేదు. ప్రజలకోసం ఆ పార్టీకి తపనే లేదు' అంటూ బీజేపీ ఆంధ్రప్రదేశ్ శాఖ శుక్రవారం తెలుగుదేశం పార్టీపై విరుచుకుపడింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేటుకూరి సూర్యనారాయణ రాజు మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. టీడీపీ నేతలకు మాట్లాడటం చేతకాకపోతే నోరు మూసుకుని ఉండాలని పేర్కొన్నారు. టీడీపీ నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నోరు అదుపు చేసుకోవాలని సూచించారు.

'ఫ్యామిలీ డాక్టర్‌తో ఆరోగ్య సంరక్షణ'

సాక్షి, అమరావతి: ప్రజలకు మెరుగైన ఆరోగ్య సంరక్షణ కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టిందని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ట్రయల్ రన్ గత అక్టోబర్ 21న రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 4.71 లక్షల మందికి ఓపీ సేవలు అందించారని, 2.51 లక్షల మంది రక్తపోటు, 1.84 లక్షల మంది మధుమేహం రోగులను వైద్యులు పరీక్షించారని తెలిపారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలో 14 రకాల వైద్య పరీక్షలు, 67 రకాల మందులు అందుబాటులో ఉంచడం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్ రన్ సమర్థంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామానికి వెళ్లిన పీహెచ్‌సీ డాక్టర్ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విలేజ్ క్లినిక్‌లో ఓపీ సేవలు, మధ్యాహ్నం నుంచి గృహాలు, అంగన్‌వాడీ, పాఠశాలలను సందర్శిస్తున్నట్లు వివరించారు.

గంగిరెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసు నిందితుడు గంగిరెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ ఎస్.రవీంద్రభట్ ధర్మాసనం ముందుకొచ్చింది. ఈ కేసు వినాల్సిన అంశమని, క్రిస్మస్ సెలవుల అనంతరం చేపడతామంటూ ధర్మాసనం విచారణను జనవరి 3వ తేదీకి వాయిదా వేసింది.

బ్రహ్మానందరెడ్డి పిటిషన్ కొట్టివేత

వాన్‌పిక్ ప్రాజెక్టుకు సంబంధించి సీబీఐ తనపై నమోదుచేసిన కేసును రద్దుచేయాలంటూ ఇండియన్ రైల్వేస్ అకౌంట్స్ సర్వీస్ విశ్రాంత అధికారి బ్రహ్మానందరెడ్డి దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టు కొట్టేసింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలు సవాల్ చేస్తూ బ్రహ్మానందరెడ్డి పిటిషన్ దాఖలు చేశారు.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ బ్రాండింగ్‌పై ప్రత్యేక దృష్టి

ప్రతి శాఖ లెటర్ హెడ్స్‌పై గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీటింగ్ లోగో

- ఈ–మెయిల్ సంతకాల్లో కూడా లోగో ఉండేలా చర్యలు
- అన్ని ప్రభుత్వ శాఖలకు ఉత్తర్వులు
- మార్చి 3–4 తేదీల్లో విశాఖ వేదికగా అంతర్జాతీయ పెట్టుబడుల సమావేశం

Global Investors Summit 2023
Visakhapatnam
Advantage Andhra

సాక్షి, అమరావతి: విశాఖపట్నం వేదికగా మార్చి 3, 4 తేదీల్లో నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్) 2023కు బ్రాండింగ్ కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్ర పక్షి రామచిలుక విదేశీ పెట్టుబడులు(డాలర్లు) తీసుకువస్తున్న విధంగా రూపొందించిన జీఐఎస్ లోగోకు ప్రచారం కల్పించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా జీఐఎస్ సమావేశాలు ముగిసే వరకు అన్ని ప్రభుత్వ శాఖల లెటర్ హెడ్స్, ఈ మెయిల్ సిగ్నేచర్స్‌పైన, ప్రభుత్వ కార్యక్రమాల్లో తప్పనిసరిగా ఈ లోగో వాడాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్. కరికాల వలవన్ 'సాక్షి'కి తెలిపారు. ఇప్పటికే పరిశ్రమల శాఖకు చెందిన కీలక విభాగాలు జీఐఎస్ లోగో వినియోగిస్తుండగా, త్వరలోనే మిగిలిన శాఖల్లో కూడా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి ఈ సదస్సుకు భారీ ప్రచారాన్ని కల్పించనున్నట్లు చెప్పారు.

10 దేశాల్లో రోడ్ షోలు

విదేశీ పెట్టుబడులే లక్ష్యంగా 10 దేశాల్లో రోడ్ షోలు నిర్వహించడానికి రాష్ట్ర పరిశ్రమలు, పెట్టుబడుల శాఖ ప్రణాళికను సిద్ధం చేసింది. ఇందులో భాగంగా జపాన్, యూఏఈ దేశాల్లో పోర్టు ఆధారిత పెట్టుబడులను ఆకర్షించేలా ఏపీ మారిటైమ్ బోర్డు రోడ్‌షోలు నిర్వహించనుంది. ఇంధన రంగంలో పెట్టుబడుల కోసం జర్మనీ, దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాల్లో రోడ్‌షోలు నిర్వహించనున్నారు. అమెరికా, కెనడాల్లో ఐటీఈఎస్, పరిశ్రమలు, బ్రెజిల్, చిలీ దేశాల్లో పరిశ్రమలు, తైవాన్‌లో ఎలక్ట్రానిక్స్‌పై రోడ్‌షోలు నిర్వహిస్తారు.

జీ 20 సమావేశాల్లోనూ

రాష్ట్రంలో పెట్టుబడుల సదస్సు జరుగుతున్న సమయంలోనే భారత్ జీ 20 దేశాలకు నేతృత్వం వహిస్తూ పలు సమావేశాలను నిర్వహిస్తోంది. ఈ సమావేశాలను కూడా పెట్టుబడుల ఆకర్షణకు వినియోగించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికను సిద్ధంచేస్తోంది. జీ 20 దేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు బిజినెస్ 20 (బీ–20) పేరుతో ఒక ప్రత్యేక గ్రూపును ఏర్పాటు చేసుకున్నారు. ఈ గ్రూపు సమావేశాలను రాష్ట్రంలో నిర్వహించడం ద్వారా పెట్టుబడులను ఆకర్షించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

దూసుకొచ్చిన మాండూస్

- మహాబలిపురం వద్ద తీరం దాటనున్న తుపాను
- తమిళనాడుపై అధిక ప్రభావం
- ఏపీలోని 6 జిల్లాలపై ప్రభావం
- ముందు జాగ్రత్త చర్యల్లో ప్రభుత్వ యంత్రాంగం
- నేడు, రేపు పలుచోట్ల భారీ వర్షాలు



ప్రకాశం జిల్లా కొత్తపట్నం సముద్రతీరంలో ఎగసిపడుతున్న భారీ అలలు

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం/సాక్షి ప్రతినిధి, నెల్లూరు/ఒంగోలు అర్బన్/తిరుపతి అర్బన్/సాక్షి, చెన్నై: బంగాళాఖాతంలో ఏర్పడిన మాండూస్ తుపాను కలవరపెడుతోంది. శుక్రవారం తీవ్ర తుపాను నుంచి తుపానుగా బలహీనపడినా, దీని ప్రభావం ఎక్కువగానే ఉంది. తమిళనాడు రాష్ట్రంపై ఎక్కువగా ఉంది. 14 కిలోమీటర్ల వేగంతో తీరం వైపు కదులుతోంది. శుక్రవారం రాత్రి 9 గంటల సమయానికి తమిళనాడులోని మహాబలిపురానికి 80 కిలోమీటర్లు, చెన్నైకి 110 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. పుదుచ్చేరి, శ్రీహరికోట మధ్య మహాబలిపురం వద్ద శనివారం ఉదయంలోపు తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రత్యేక బులెటిన్‌లో తెలిపింది. తీరం దాటిన తర్వాత శనివారం మధ్యాహ్నానికి క్రమంగా వాయుగుండంగా మారి బలహీనపడుతుందని వెల్లడించింది. తుపాను ప్రభావం తమిళనాడులోని 15 జిల్లాలపై పడింది. భారీ వర్షం కారణంగా చెన్నై నుంచి 21 విమాన సేవలను రద్దు చేశారు.

6 జిల్లాలపై ప్రభావం.. అప్రమత్తమైన ప్రభుత్వం

ఈ తుపాను ఆంధ్రాలోని ఆరు జిల్లాలపై ప్రభావం చూపనుంది. ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లో భారీ వర్షాలు, ఈదురు గాలులు వీచే పరిస్థితి ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అప్రమత్తమైంది. సీఎం వైఎస్ జగన్ రెండు సార్లు తుపాను ముందు జాగ్రత్త చర్యలపై సమీక్ష నిర్వహించారు. తాడేపల్లిలోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి ఎప్పటికప్పుడు తుపాను కదలికలను రెవెన్యూ, విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు సమీక్షిస్తున్నారు. ఆరు జిల్లాల్లోని 210 మండలాల అధికారులను అప్రమత్తం చేశారు. సహాయక చర్యల కోసం మొత్తం 5 ఎన్డీఆర్ఎఫ్, 4 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలిపారు. ప్రకాశం జిల్లాలో 2, నెల్లూరు జిల్లాలో 3, తిరుపతి జిల్లాలో 2, చిత్తూరు జిల్లాలో 2 బృందాలను ఉంచామన్నారు.

నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు

తుపాను ప్రభావంతో నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. నెల్లూరు జిల్లాలో తీరం వెంబడి 150 మీటర్ల మేరకు సముద్రం చొచ్చుకువచ్చింది. నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం బ్రహ్మదేవంలో 10.3 సెంటీమీటర్ల అత్యధిక వర్షం కురిసింది. దక్షిణ కోస్తా, రాయలసీమలోని మిగిలిన జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. శని, ఆదివారాల్లో ఈ ఆరు జిల్లాల్లో పలుచోట్ల భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

నెల్లూరు జిల్లాలో టోల్‌ఫ్రీ నంబర్ 1077

నెల్లూరు జిల్లాలో తుపానుపై మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జిల్లా అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ప్రజలకు సహాయం చేయడానికి జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూంలో టోల్ ఫ్రీ నంబరు 1077 ఏర్పాటు చేశారు.

విద్యుత్ స్తంభాలు కూలినా, లైన్లు తెగినా..

టోల్ ఫ్రీ నంబరు 1912కు సమాచారం ఇవ్వాలి

తుపాను నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీలు ఆదేశాలు జారీచేశారు. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. చీఫ్ జనరల్ మేనేజర్లను నోడల్ ఆఫీసర్లుగా నియమించారు. విద్యుత్ అంతరాయాలను పర్యవేక్షించేందుకు డివిజన్లు, సర్కిళ్ల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేశారు. అధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేశారు. 24 గంటలూ అందుబాటులో ఉండాలని సూచించారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, లైన్లను వెంటనే పునరుద్ధరించేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, లైన్లు తెగిపోవడం లాంటి జరిగితే సమీపంలోని విద్యుత్ శాఖ సిబ్బందికి లేదా టోల్ ఫ్రీ నంబరు 1912కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

జాతీయ స్థాయిలో ఏపీ వైద్యశాఖకు రెండు అవార్డులు

నేడు వారణాసిలో అవార్డులు అందుకోనున్న మంత్రి రజిని

సాక్షి, అమరావతి: ప్రజారోగ్యం పట్ల చిత్తశుద్ధితో అడుగులు వేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో మరోసారి ప్రత్యేక గుర్తింపు లభించింది. రాష్ట్ర వైద్యశాఖకు జాతీయ స్థాయిలో రెండు అవార్డులు లభించాయి. పల్లె ప్రజలకు వైద్యసేవలు చేరువచేయడం కోసం నెలకొల్పిన డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల నిర్వహణ, వీటిలో టెలీ మెడిసిన్ వైద్యసేవలను అమలు చేస్తున్నందుకు గానూ యూనివర్సల్ హెల్త్ కవరేజ్(యూహెచ్‌సీ) డే సందర్భంగా కేంద్ర వైద్యశాఖ ప్రదానం చేస్తున్న అవార్డులకు రాష్ట్రం ఎంపికైంది. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో శని, ఆదివారాల్లో నిర్వహించనున్న యూహెచ్‌సీ డే వేడుకల్లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, అధికారులు పాల్గొని అవార్డులు స్వీకరించనున్నారు.

విలేజ్ క్లినిక్‌లతో వైద్యసేవలు చేరువ

గ్రామీణ ప్రజలకు వైద్యసేవలను చేరువచేయడం కోసం ప్రభుత్వం 10,032 డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను నెలకొల్పుతోంది. నాడు–నేడు కింద క్లినిక్‌లను రూ.1,692 కోట్లతో ఏర్పాటుచేస్తున్నారు. ఇప్పటికే 8,351 క్లినిక్‌లు ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నాయి. వీటిని ఆయుష్మాన్ భారత్ హెల్త్, వెల్నెస్ సెంటర్(ఏబీ–హెచ్‌డబ్ల్యూసీ)లుగా నిర్వహిస్తున్నారు. ఈ సేవలకు గానూ రాష్ట్ర వైద్యశాఖ అవార్డుకు ఎంపికైంది. దేశవ్యాప్తంగా ఏపీ సహా 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు అవార్డులు అందిస్తున్నారు. అవార్డుకు ఎంపికైన అన్ని రాష్ట్రాల్లో విలేజ్ క్లినిక్‌ల నిర్వహణలో ఏపీ అగ్రస్థానంలో ఉండటం విశేషం. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల ద్వారా రాష్ట్రంలోని గ్రామీణ ప్రజలకు 12రకాల వైద్యసేవలు, 14 రకాల వైద్యపరీక్షలు, 67రకాల మందులను అందిస్తున్నారు.

2.84కోట్ల మందికి టెలీ మెడిసిన్ సేవలు

అన్ని వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలో టెలీ మెడిసిన్ సేవలు అమలవుతున్నాయి. క్లినిక్‌కు వచ్చిన ప్రజలకు పీహెచ్‌సీ వైద్యుడు, స్పెషలిస్ట్ వైద్యుల కన్సల్టేషన్ అవసరమైతే టెలీ మెడిసిన్ ద్వారా కూడా అందుతున్నాయి. టెలీ మెడిసిన్ సేవల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 27 హబ్‌లను వైద్యశాఖ ఏర్పాటు చేసింది. వీటిలో జనరల్ మెడిసిన్, గైనిక్, పీడియాట్రిక్, ఇతర స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉంటారు. రాష్ట్రంలో 2019 నుంచి 2.84 కోట్ల టెలీ కన్సల్టేషన్‌లు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా 8 కోట్ల కన్సల్టేషన్‌లు నమోదు కాగా, ఏపీ నుంచి 2.84కోట్లు ఉండటం విశేషం. విలేజ్ క్లినిక్‌లలో టెలీ మెడిసిన్ సేవల్లో పెద్ద రాష్ట్రాల విభాగంలో మూడు రాష్ట్రాలకు అవార్డులు దక్కగా, అందులో ఏపీ ఒకటి కాగా, మిగిలినవి తమిళనాడు, తెలంగాణ ఉన్నాయి.

బాబును ప్రజలు నమ్మరు

803వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన నాయకులు



దీక్షలో పాల్గొన్న బహుజన నాయకులు

తాడికొండ: అధికారం కోసం మాయమాటలు చెబుతూ తిరుగుతున్న టీడీపీ అధినేత చంద్రబాబును ప్రజలు నమ్మే ప్రసక్తే లేదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 803వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ తన స్వార్థం కోసం బాబు ఎంతకైనా తెగిస్తాడన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, బి.శామ్యూల్, నూతక్కి జోషి, పులి దాసు, ఇ.ఆదాం, బేతపూడి సాంబయ్య పాల్గొన్నారు.

మీ పిల్లల ఉద్యోగాలకు నేనే కారణం

- వారి సంపాదనలో కొంత పార్టీ ఫండ్ ఇవ్వాలి
- మీరు, మీ పిల్లలు నన్ను మర్చిపోయారు
- రూ.16 లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చా.. ఐదు లక్షల ఉద్యోగాలిప్పించా
- బాపట్ల సభలో చంద్రబాబు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: 'నాలెడ్జ్ ఎకానమీలో మన పిల్లలు బాగా రాణిస్తున్నారు. ప్రతి గ్రామంలో పది మంది వరకూ ఐటీ ఉద్యోగాలు చేస్తున్నారు. ఎక్కువ ఆదాయం సంపాదిస్తున్నారు. అందుకు కారణం నేనా కాదా? నాకు పార్టీ ఫండ్ ఇవ్వాలా లేదా? కొంతైనా ప్రీమియం ఇవ్వాలి కదా? మీరు, మీ పిల్లలు మర్చిపోయారు.. భవిష్యత్‌లో మళ్లీ మీకు మంచి రోజులు రావాలంటే తెలుగుదేశాన్ని గెలిపించాలని ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు కోరారు. బాపట్లలో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. విభజన తర్వాత రాత్రింబవళ్లు పనిచేసి అమరావతి ప్రారంభించానన్నారు. అప్పుడు జగన్‌రెడ్డి కూడా అసెంబ్లీలో ఒప్పుకున్నాడన్నారు. ఈ విషయం చెప్పడానికి నిక్కర్లో నీళ్లు వస్తున్నాయా, ఉచ్చలు వస్తున్నాయా అంటూ చంద్రబాబు అవహేళన చేశారు. ప్రపంచంలో ఎక్కడా మూడు రాజధానులు విజయవంతం కాలేదన్నారు. ప్రస్తుతం నీళ్లున్నా పొలాలకు ఇవ్వడంలేదని.. అదే తానుంటే సెప్టెంబర్ నాటికి పంట వచ్చేలా చేసేవాడినని, డిసెంబర్‌లో వర్షాలు వచ్చినా ఇబ్బంది ఉండేది కాదన్నారు. పోలవరంపై పార్లమెంట్‌లో మంత్రి ఇది ఎప్పుడు పూర్తవుతుందో తెలియదని చెప్పాడన్నారు. అమరావతి పోవడం, పోలవరం పూర్తి చేయకపోవడం ఈ రాష్ట్రానికి పట్టిన ఐదేళ్ల శని అన్నారు. 2014లో తాను ప్రపంచమంతా తిరిగి రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చానని.. అదే జగన్ వచ్చాక ఉన్నవి వెళ్లిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. తాను ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు అమలుచేయకపోయినా మీకు కోపం రావడంలేదని ప్రజలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రూ.10 ఇచ్చి రూ.100 దోచేస్తున్నారని విమర్శించారు. బాపట్లలో ఎమ్మెల్యే అవినీతి, దందా పెరిగిపోయాయన్నారు.

ముస్లింలకు అండగా ఉంటా

అంతకుముందు.. గుంటూరు జిల్లా పొన్నూరులో జరిగిన మైనారిటీల ఆత్మీయ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముస్లింలకు అన్ని రకాలుగా అండగా ఉంటానన్నారు. 2014 తరువాత దుకాన్ మకాన్, దుల్హన్ పథకం తీసుకొచ్చామని, వీటన్నింటిని ఈ సీఎం వచ్చాక రద్దుచేశాడన్నారు. మంత్రి పదవులకు 10వ తరగతి చదువు అర్హత అవసరంలేదు.. సలహాదారులకు 10వ తరగతి అర్హత అవసరంలేదు, కానీ.. దుల్హన్ పథకానికి మాత్రం టెన్త్ చదువుకుని ఉండాలా అని చంద్రబాబు ప్రశ్నించారు. టీడీపీ వచ్చాక ఆంక్షల్లేకుండా దుల్హన్ పథకం తీసుకొస్తానన్నారు. అలాగే, ముస్లింల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో తానుపోరాడుతానని చంద్రబాబు హామీఇచ్చారు. ఆ తర్వాత టీడీపీ నియోజకవర్గ నేతలతోనూ చంద్రబాబు సమావేశమై హుషారుగా ఉండాలని కార్యకర్తలకు పిలుపిచ్చారు.

బాబు హయాంలో..ముస్లింల సంక్షేమం గాలికి..


- ఇచ్చిన హామీలను అడిగితే దేశద్రోహం కేసులు పెట్టించారు
- మైనారిటీలకు ఒక్క మంత్రి పదవీ ఇవ్వలేదు
- లోకేశ్ తరహాలో ఎమ్మెల్సీ ఎందుకివ్వలేదు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



కర్నూలు (రాజ్‌విహార్): చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ముస్లింల సంక్షేమాన్ని విస్మరించారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్‌ఖాన్ అన్నారు. నగరంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముస్లింల సమావేశంలో చంద్రబాబు మైనారిటీల సంక్షేమంపై అబద్ధాలు మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. గతంలో ఆయన అధికారంలోకి వచ్చేందుకు ఎన్నో హామీలు ఇచ్చి, వాటిని విస్మరించారన్నారు. వీటిని గుర్తుచేసిన నంద్యాల ముస్లింలపై గుంటూరు వేదికగా దేశద్రోహం కేసులు పెట్టించిన ఘనత ఆయనదే నన్నారు. అలాగే, నంద్యాల ఉపఎన్నిక పూర్తయ్యే వరకు ముస్లింలకు ఒక్క మంత్రి పదవి ఇవ్వలేదని గుర్తుచేశారు. తన కొడుకు లోకేశ్‌కు ఎమ్మెల్సీ ఇచ్చినట్లుగా ముస్లింలకు ఎందుకు ఇవ్వలేదని హఫీజ్‌ఖాన్ ప్రశ్నించారు. మూడేళ్లలో మైనారిటీ సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్ విద్య, ఆర్థిక, రాజకీయంగా, సామాజికంగా ఎన్నో అవకాశాలు కల్పించారని ఆయన తెలిపారు. కానీ, చంద్రబాబు పాలనలో అడుగడుగునా ముస్లింలు అన్యాయానికి గురయ్యారన్నారు. అదే సీఎం జగన్ అమ్మఒడి పథకం కింద ముస్లింలకు రూ.1,420 కోట్లు, విద్యాదీవెనలో రూ.780 కోట్లు తల్లుల ఖాతాలో జమచేశారని వెల్లడించారు. ఇక 5,350 వక్ఫ్ సంస్థల ఆస్తులను రీసర్వే చేయించామని, మీరెందుకు చేయలేదని ప్రశ్నించారు. ఎన్ని చెప్పినా చంద్రబాబును ముస్లింలు నమ్మే పరిస్థితిలో లేరని ఆయన స్పష్టంచేశారు.

ముస్లిం మైనార్టీల ద్రోహి చంద్రబాబు

రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషా



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల ద్రోహి టీడీపీ అధినేత చంద్రబాబు అని, ఇప్పుడు ఓట్ల కోసం కపట ప్రేమ ఒలకబోస్తున్నారని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషా ధ్వజమెత్తారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఏరోజూ ముస్లిం మైనార్టీ నాయకుల్ని దగ్గరకు తీసుకోలేదని మండిపడ్డారు. ఇమాం, మౌజమ్‌లను గౌరవించడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుందని, ప్రతి నెలా గౌరవ వేతనాలుగా ఇప్పటి వరకు రూ.248 కోట్లు ఇచ్చినట్టు తెలిపారు. సీఎం జగన్ ఉర్దూని రెండో అధికార భాషగా గుర్తిస్తూ చట్టం చేయడంతో ఉర్దూకు పూర్వ వైభవం వస్తోందన్నారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

బీసీల విద్య, సామాజిక గణన చేపట్టాలి

రాజ్యసభ

- రాజ్యసభలో ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి
- సెస్, సర్‌చార్జీల రూపంలో వసూలుచేసే రెవెన్యూ వాటాల ఆర్టికల్ సవరణ కోరుతూ మరో బిల్లు



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో వెనుకబడిన తరగతులకు (బీసీలకు) జనాభాకు తగినట్లుగా రిజర్వేషన్ కల్పించి వారి అభ్యున్నతి, సంక్షేమం న్యాయబద్ధంగా జరిగేలా చూడాలంటే బీసీల విద్య, సామాజిక గణన జరగాలని, దీనికి వీలు కల్పించేలా రాజ్యాంగ సవరణ చేపట్టి కొత్తగా ఆర్టికల్ 342–బి చేర్చాలని ప్రతిపాదిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి శుక్రవారం రాజ్యసభలో ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టారు. దీంతోపాటే కేంద్ర ప్రభుత్వం సుంకాలు, సర్‌చార్జీల రూపంలో వసూలు చేస్తున్న రెవెన్యూలో రాష్ట్రాలకు కూడా వాటా ఇచ్చేలా రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 270, 271, 280లను సవరించాలని కోరుతూ విజయసాయిరెడ్డి మరో రాజ్యాంగ (సవరణ) బిల్లును సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశజనాభా 68 కోట్లు ఉన్న సమయంలో బీసీల సంఖ్య 52 శాతం ఉన్నట్లుగా 1980లో మండల్ కమిషన్ నిర్ధారించిందని, ఇప్పుడు దేశజనాభా 138 కోట్లకు చేరినా ఇందులో బీసీల జనాభా ఎంత ఉందో కచ్చితంగా తెలియదని చెప్పారు. విద్య, సామాజికపరంగా బీసీల ప్రస్తుత స్థితిగతులు స్పష్టం కావాలంటే వెనుకబడిన కులాల గణన అనివార్యమని, అప్పుడే వారి అభ్యున్నతి, సంక్షేమం కోసం ప్రభుత్వం తదనుగుణంగా విధానాలకు రూపకల్పన చేసి వాటిని విజయవంతంగా అమలు చేయగలుగుతుందని పేర్కొన్నారు. అంతకుముందు జీరో అవర్‌లో బీసీ రిజర్వేషన్ల అంశంపై ఆయన మాట్లాడారు. వెనుకబడిన తరగతులకు జనాభా ప్రాతిపదికపై రిజర్వేషన్లు కల్పించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.

పీఎం గతిశక్తి కింద ఏపీకి రూ.202 కోట్లు

పీఎం గతిశక్తి కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.202 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ సహాయమంత్రి సోం ప్రకాష్ తెలిపారు. రాజ్యసభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు–2022 పేరుతో ముసాయిదా బిల్లును రూపొందించిందని, ప్రస్తుతం ఇది సంప్రదింపుల దశలో ఉందని ఆ శాఖ సహాయమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ చెప్పారు. విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిస్తూ డేటా ప్రొటెక్షన్ బిల్లులో వినియోగదారుల హక్కులు, విధులు, వారి వ్యక్తిగత సమాచార భద్రత, ఫిర్యాదు విధానం వంటి అంశాలను పొందుపరిచినట్లు తెలిపారు.

వ్యవసాయ రంగంలో సాంకేతికత

దేశంలో వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా సబ్–మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్ అమలు చేస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ, రైతుసంక్షేమశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ విద్యుత్తు లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వ్యవసాయ యాంత్రీకరణ పెంచడంతోపాటు రైతులు ప్రతికూల ఆర్థిక వ్యవస్థలను అధిగమించడానికి కస్టమ్ హైరింగ్ సెంటర్లను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కృషివిజ్ఞాన్ కేంద్రాల ద్వారా 2021–22లో 12,901 కార్యక్రమాలు నిర్వహించగా 12,83,923 మంది రైతులు పాల్గొన్నారని చెప్పారు. చేపల పెంపకం, ఆక్వాకల్చర్‌లో ఆంధ్రప్రదేశ్‌కు గణనీయమైన సామర్థ్యం ఉందని కేంద్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి పురుషోత్తం రూపాలా తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు ప్రశ్నకు మంత్రి బదులిస్తూ.. ఏపీలో ఐదు బ్రూడ్ బ్యాంకులు ఉన్నాయని చెప్పారు.

ఏపీలో టీబీ మరణాలు తగ్గుముఖం

లోక్‌సభ



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో టీబీ మరణాలు తగ్గుముఖం పడుతున్నట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయమంత్రి భారతి ప్రవీణ్ తెలిపారు. లోక్‌సభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఏడాది ముందు నోటిఫై చేసిన టీబీ కేసుల్లో 2020లో 3,585 మంది, 2021లో 2,490 మంది, 2022లో అక్టోబర్ వరకు 1,903 మంది మృతిచెందారని వివరించారు. 2022లో అక్టోబర్ వరకు 77,240 కేసులు నోటిఫై చేసినట్లు తెలిపారు.

2027కల్లా 1.43 బిలియన్లకు జనాభా



భారతీయ జనాభా 2027కల్లా 1.43 బిలియన్లకు చేరుకుంటుందని టెక్నికల్ గ్రూప్ ఆన్ పాపులేషన్ ప్రొజెక్షన్స్ (టీజీపీపీ) నివేదిక పేర్కొందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయమంత్రి భారతి ప్రవీణ్ తెలిపారు. జనాభా పెరుగుదల నియంత్రించడానికి ప్రభుత్వం చేపట్టిన ప్రయత్నాలు విజయవంతమవుతున్నాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

చైనాలో ఆక్వా రైతుల కేసులు పరిష్కరించండి



ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆక్వా రైతుల కేసులు చైనాలోని సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరగా పరిష్కారమయ్యేలా చూడాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రిని వైఎస్సార్‌సీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ఆక్వా ఎగుమతుల్లో ఏపీ వాటా 70 శాతంగా ఉందని, ప్రస్తుతం రాష్ట్రంలో పరిశ్రమ బాగా దెబ్బతిందని చెప్పారు. కోవిడ్ కారణంగా ప్రధాన దిగుమతి దేశమైన చైనా తిరస్కరణతో ఎగుమతులు తగ్గాయని తెలిపారు. దీంతోపాటు చైనా ప్రభుత్వ ఆడిట్ కారణంగానూ ఎగుమతులు నిలిచి ప్రాసెసింగ్ ప్లాంట్లు మూతపడ్డాయని పేర్కొన్నారు.

దరఖాస్తులు ఎక్కువైతే పాస్‌పోర్టు మేళాలు



దరఖాస్తులు ఎక్కువైనప్పుడల్లా పాస్‌పోర్టు మేళాలు నిర్వహిస్తున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ సహాయమంత్రి మురళీధరన్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ చింతా అనూరాధ ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు.

విశాఖ రైల్వేజోన్ హెడ్‌క్వార్టర్‌కు రూ.106.89 కోట్లు మంజూరు

విశాఖ కేంద్రంగా ఏర్పాటుకానున్న సౌత్‌కోస్ట్ రైల్వేజోన్ హెడ్‌క్వార్టర్ ఏర్పాటుకు సంబంధించి రూ.106.89 కోట్ల విలువైన పనికి నవంబర్ 11న మంజూరు తెలిపామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

విదేశాల్లో భారతీయ విద్యార్థుల రక్షణకు ప్రాధాన్యం

విదేశాల్లో విద్యార్థులు సహా భారతీయుల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ సహాయమంత్రి మురళీధరన్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు బీవీ సత్యవతి, గోరంట్ల మాధవ్ ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. అవాంఛనీయ సంఘటనలు ఏమైనా జరిగితే తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

హైకోర్టుల్లో 101 మంది మహిళా న్యాయమూర్తులు

హైకోర్టుల్లోని 1,108 మంది న్యాయమూర్తుల్లో 101 మంది మహిళలని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ చింతా అనూరాధ ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో నియామకాలు, రిజర్వేషన్ల విషయంలో కేంద్రం పాత్ర ఏమీ ఉండదని చెప్పారు.

విదేశాల్లో భారతీయ విద్యార్థుల రక్షణకు ప్రాధాన్యం

విదేశాల్లో విద్యార్థులు సహా భారతీయుల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ సహాయమంత్రి మురళీధరన్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు బీవీ సత్యవతి, గోరంట్ల మాధవ్ ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. అవాంఛనీయ సంఘటనలు ఏమైనా జరిగితే తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఆత్మ నాశనానికి దారి తీసే నరక ద్వారాలు మూడు – కామం, క్రోధం, లోభం. అందుచేత ఈ మూడింటిని త్యజించాలి.
– భగవద్గీత

సాక్షి

శనివారం, డిసెంబర్, 10

కొలీజియం కథ మొదటికి

పాత చందమామల్లో కనబడే బేతాళ కథల్లో పట్టువదలని విక్రమార్కుడి మాదిరిగా కేంద్ర ప్రభుత్వం కొలీజియం వ్యవస్థపై నిప్పులు చెరుగుతూనే ఉంది. సందర్భం వచ్చినప్పుడల్లా ఈ వ్యవస్థ ఎంత ఉత్తమమైనదో, ఎందుకు ఉత్తమమైనదో సుప్రీంకోర్టు చెబుతూ వస్తోంది. ఈసారి కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజుతోపాటు ఉపరాష్ట్రపతి స్థానంలో ఉన్న జగదీప్ ధన్‌కర్ సైతం విమర్శలకు దిగటమే కొత్త పరిణామం. జాతీయ న్యాయ నియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ) చట్టాన్ని గతంలో సుప్రీంకోర్టు కొట్టేయడాన్ని రాజ్యసభలోనూ, వెలుపలా కూడా ధన్‌కర్ నిశితంగా విమర్శించారు. అంతక్రితం కొలీజియం సిఫార్సుల ఆమోదంలో కేంద్రం జాప్యం చేయటంపై వెల్లువెత్తుతున్న ప్రశ్నలకు రిజిజు ఆగ్రహం వ్యక్తంచేశారు. అలాగైతే మావద్దకు ఫైళ్లు పంపొద్దని, మీరే అన్నీ చేసుకోండని జవాబిచ్చారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు ఇలా వ్యాఖ్యానించటం తగునా అని సుప్రీంకోర్టు ధర్మాసనం గట్టిగానే ప్రశ్నించింది. మా మనోభావాన్ని తెలియజేయండంటూ అటార్నీ జనరల్‌కూ, సొలిసిటర్ జనరల్‌కూ ఆదేశాలిచ్చింది. కేంద్రం, న్యాయవ్యవస్థలమధ్య ఘర్షణ పదునెక్కిందనటానికి ఈ పరిణామాలు తార్కాణం. తాజాగా కొలీజియం సిఫార్సులను కేంద్రం తరచు విడగొట్టి ఆమోదించటంవల్ల తలెత్తుతున్న ఇబ్బందుల్ని ధర్మాసనం ప్రస్తావించింది. ఈ అలవాటు మానుకోవాలని సూచించింది.

ఎన్‌జేఏసీ చట్టం, అందుకోసం కేంద్రం చేసిన 99వ రాజ్యాంగ సవరణ చెల్లుబాటుకావని అయిదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం 2015 అక్టోబర్‌లో తీర్పునిచ్చింది. ఈ రెండు చర్యలూ రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే ప్రయత్నాలుగా పరిగణించింది. ఈ తీర్పుపై అప్పీల్‌కు కూడా అనుమతించలేదు. ఎన్‌జేఏసీ చట్టాన్నీ, రాజ్యాంగ సవరణనూ పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించింది. 20 శాసనసభలు సైతం వాటికి ఆమోదం తెలిపాయి. ప్రజల సమష్టి మనోగతాన్ని తెలియజేసే ఈ చర్యలను సుప్రీంకోర్టు తోసిపుచ్చడమేమిటన్న ప్రశ్నలు అప్పట్లో తలెత్తాయి. ఏ చట్టమైనా, రాజ్యాంగ సవరణ అయినా న్యాయసమీక్షకు లోబడే ఉంటుంది గనుక అక్కడితో ఆ ప్రస్తావన ముగియాలి. మరింత పకడ్బందీ నిబంధనలతో చట్టం తీసుకొస్తే తప్ప కొలీజియం వ్యవస్థ సిఫార్సులకు కేంద్రం లోబడి ఉండాల్సిందే. కానీ ఎప్పటికప్పుడు కేంద్రం తన ఆధిక్యతను ప్రదర్శించుకోవటానికి ప్రయత్నిస్తూనే వస్తోంది. దాని సిఫార్సులపై నిర్ణయం తీసుకోవటంలో జాప్యం చేయటం లేదా కొన్నిటిని మాత్రమే అంగీకరించి, మరికొన్నిటిపై మౌనం పాటించటం రివాజైంది. ప్రభుత్వాలు చేసే చట్టాలు నచ్చినా నచ్చకపోయినా పౌరులందరూ పాటించి తీరాల్సిందే. వాటిని రద్దు చేయాలని పోరాడటం, ప్రభుత్వాలను ఒప్పించటం ఒక పద్ధతి. సాగుచట్టాల విషయంలో రైతాంగం చేసింది అదే. న్యాయవ్యవస్థ తీసుకునే నిర్ణయాలూ, తీర్పులూ కూడా చట్టాలతో సమానం. వాటిపై అభ్యంతరం ఉంటే అప్పీల్‌కు వెళ్లటం ఒక్కటే మార్గం. ప్రభుత్వాలైతే కొత్త చట్టాలను తీసుకొచ్చే అవకాశం ఉంటుంది. వీటిని విడనాడి కొలీజియం సిఫార్సులపై సాచివేత ధోరణి అవలంబించటం, ప్రశ్నిస్తే విరుచుకుపడటం సరైంది కాదు. మొన్న సెప్టెంబర్ నెలాఖరున జమ్మూ కశ్మీర్ లద్దాఖ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ పంకజ్ మిత్తల్‌ను రాజస్థాన్ హైకోర్టుకూ, ఒరిస్సా హైకోర్టు చీఫ్ జస్టిస్ మురళీధర్‌ను మద్రాస్ హైకోర్టుకూ బదిలీ చేయాలని కొలీజియం సిఫార్సు చేస్తే ఒక్క మిత్తల్‌ను మాత్రమే కేంద్రం బదిలీ చేసి ఊరుకుంది. జస్టిస్ మురళీధర్ విషయంలో ఇంతవరకూ ఉలుకూ పలుకూ లేదు. అందరూ చట్టాలను గౌరవించేలా, దేశంలో చట్టబద్ధ పాలన సజావుగా సాగేలా చూడాల్సిన ప్రభుత్వాలే అందుకు విరుద్ధమైన పోకడలకు పోరాదు.

అయితే ఇరుపక్షాలూ తమ అధికారాల గురించే పట్టుబడుతున్నాయి తప్ప న్యాయమూర్తుల నియామకాలు పారదర్శకంగా ఉండేందుకు ఏం చేయాలన్న చర్చకు పోవటం లేదు. కొలీజియం వ్యవస్థ ఎలా విఫలమైందో 1993లో ఆ విధానానికి పునాది వేసిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ వర్మ పలుమార్లు చెప్పారు. ఎవర్ని ఎందుకు నియమించారో, నియమించలేదో ఏనాడూ కొలీజియం చెప్పిన పాపాన పోలేదు. ఒకసారి నియామకం పూర్తయి, పూర్తిస్థాయి న్యాయమూర్తిగా మారాక వారు ప్రశ్నార్థకమైన తీర్పులు వెలువరించినా, వారి ప్రవర్తన ఎలా వున్నా, ఏవిధమైన ఆరోపణలొచ్చినా అదే పదవిలో కొనసాగుతున్నారు. నియామకాల్లో అణగారిన వర్గాలకూ, మహిళలకూ పెద్దగా చోటుండటం లేదు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ సైతం దీన్ని అంగీకరించారు. సుప్రీంకోర్టు కొట్టేసిన ఎన్‌జేఏసీ చట్టంలోనూ ఎన్నో లోపాలున్నాయి. కొలీజియం స్థానంలో అది రావటం వల్ల పెద్దగా ఒరిగేదేమీ ఉండదు. అమెరికాలో మాదిరి న్యాయమూర్తులుగా నియమించదల్చుకున్న వారి పేర్లు, వారి అర్హతలూ, ప్రత్యేకతలూ వెల్లడించటం... వారిపై సాధారణ పౌరులు సైతం తమ అభిప్రాయాలు వెల్లడించటానికి, చర్చించటానికి అవకాశమీయటం అవసరం. అది వచ్చేలోపు కనీసం కొలీజియం తన నిర్ణయాలకు గల కారణాలేమిటో సాధారణ పౌరులకు విశదపరచాలి. అప్పుడు కేంద్రం జాప్యం చేయటంలోని ఉచితానుచితాలను ప్రజలు నిర్ణయించుకుంటారు. అలాగే ఏ కారణంతో జాప్యం చేస్తున్నారో లేదా తిరస్కరిస్తున్నారో కేంద్రం చెప్పాలి. అంతేతప్ప వ్యవస్థల మధ్య ఎడతెగకుండా వివాదం సాగటం, చివరకు నిర్ణయరాహిత్యమే రాజ్యమేలటం ప్రజాస్వామ్య వ్యవస్థకు శ్రేయస్కరం కాదు.

చైనాలో అశాంతికి మూలం?

విశ్లేషణ



జయదేవ రణడే

కోవిడ్ అంక్షలకు వ్యతిరేకంగా చైనా విద్యార్థులు, కార్మికుల నిరసనలకు దారితీసిన అసంతృప్తికి మూలం ఎక్కడుంది? పట్టణ, గ్రామీణ నిరుద్యోగిత పెరుగుతోంది. కేంద్ర ప్రభుత్వ, ప్రాదేశిక ప్రభుత్వాలకు చెందిన ఉద్యోగుల వేతనాల్లో 30 శాతం కోత విధించారు. పైగా సంప్రదాయానికి విరుద్ధంగా షీ జిన్‌పింగ్ అధికార బాధ్యతలను మూడోసారి స్వీకరించడం చైనా కమ్యూనిస్ట్ పార్టీ కేడర్లో చాలామందిని కలతపెట్టింది. వాస్తవానికి చైనాలో తలెత్తే ప్రజా నిరసనలు ఒక్కసారిగా వేగం పుంజుకుని రాజకీయ నాయకత్వాన్ని భయపెడుతుంటాయి. చైనా వ్యతిరేక శక్తులు మరోసారి సాంస్కృతిక విప్లవాన్ని ప్రేరేపించే అవకాశముందని చైనా కమ్యూనిస్టు పార్టీ భీతిల్లుతోంది. అందుకే నిరసనకారులపై చర్యలు తీసుకోవడం తప్పకపోవచ్చు.

అధికారంలో ఉన్న షీ జిన్‌పింగ్‌కు అత్యంత చెడ్డ కాలంలో చైనా మాజీ అధ్యక్షుడు జియాంగ్ జెమిన్ మృతి (నవంబర్ 30) సంభవించి ఉండకూడదు. నాయకుల అంత్యక్రియలు చైనాలో భారీ ప్రదర్శనల భూకంప కేంద్రాలుగా మారుతుంటాయి. మూడోసారి చైనా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన ప్రారంభ కాలంలోనే జీరో కోవిడ్ విధానం జిన్‌పింగ్ తలకు గట్టిగా చుట్టుకుంది. ఉరుంక్వీ పట్టణంలోని ఒక భవనంలో అగ్నిప్రమాదం కారణంగా 10 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన రోజుల వ్యవధిలోనే కఠినమైన జీరో కోవిడ్ విధానానికి వ్యతిరేకంగా తీవ్ర నిరసనలకు దారితీసింది. కనీసం పది నగరాల్లో చెలరేగిన నిరసన ప్రదర్శనల్లో విద్యార్థులు, పౌరులు, కార్మికులు వేగంగా భాగమైపోయారు. జిన్‌పింగ్‌ను వ్యతిరేకిస్తున్న శక్తులు ఈ నిరసన ప్రదర్శనలను మరింత రెచ్చగొట్టి ఉండవచ్చని అంచనా.

చైనా ఆర్థిక వ్యవస్థ కూడా మందగమనంలోకి వెళుతోంది. జీవన వ్యయం వేగంగా పెరుగుతోంది. పట్టణ, గ్రామీణ నిరుద్యోగిత క్రమంగా పెరుగుతోంది. పట్టభద్రుల్లో నిరుద్యోగం ఇప్పటికే 20 శాతానికి చేరుకుంది. అదృష్టవశాత్తూ ఉద్యోగాలు దొరికినవారు గతంలోకంటే సగం వేతనాలు మాత్రమే పొందు తున్నారు. దీంతో ప్రజలకు నేరుగానే ఆర్థిక వ్యవస్థ తాలూకు బాధలు అనుభవంలోకి వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ, ప్రాదేశిక ప్రభుత్వాలకు చెందిన ఉద్యోగుల వేతనాల్లో 30 శాతం కోత విధించారు. ఇప్పటికే వీరికి చెల్లించిన బోనస్‌లను కూడా వెనక్కు తీసుకున్నారు. అయినప్పటికీ ఆర్థిక సంస్కరణల దిశగా, చైనా ప్రైవేట్ ఆంత్రప్రెన్యూర్లకు సహకరించడానికి జిన్‌పింగ్ ఏమాత్రం సుముఖంగా లేరు. చైనాలో 80 శాతం ఉద్యోగాలను, 90 శాతం రెవెన్యూను ప్రైవేట్ ఆంత్రప్రెన్యూర్లే కల్పిస్తున్నారు. అయినా ఈ వాస్తవానికి భిన్నంగా 20వ పార్టీ కాంగ్రెస్ ఆమోదించిన వర్క్ రిపోర్ట్ 'ఉమ్మడి శ్రేయస్సు' గురించి మాట్లాడింది.

జెంగ్‌జౌలోని ఫాక్స్‌కాన్ కంపెనీకి చెందిన అతిపెద్ద ఐఫోన్ ప్లాంట్ నిరసనకారుల ప్రధాన కేంద్రంగా నిలిచింది. వేతనాలు చెల్లించకపోవడంపై, కోవిడ్ –19 లాక్‌డౌన్ ఆంక్షలపై ఆగ్రహించిన కార్మికులు నవంబర్ 23న నిరసనలు ప్రారంభించి తమను అణిచివేయడానికి వచ్చిన పోలీసులతో తలపడ్డారు. పరిశ్రమలో కోవిడ్ మహమ్మారి విజృంభించడంతో బయటి ప్రపంచం నుంచి కార్మికులను వేరుపర్చాలన్న విఫలయత్నం జరిగింది. అయితే ప్లాంట్‌లోని రెండు లక్షలమందిని బయటకు రాకుండా కట్టడి చేసిన యంత్రాంగం కార్మికులకు తగిన తిండి, నీరు సరఫరా చేయడంలో విఫలమైంది. దీనికి తోడుగా కార్మికులకు అధిక వేతనాలు చెల్లిస్తామని చేసిన వాగ్దానాన్ని కంపెనీ విస్మరించడంతో పరిస్థితులు విషమించాయి. 'ప్రతి కార్మికుడి ఆరోగ్యానికి, భద్రతకు హామీ ఇవ్వడానికి' నిబద్ధత పాటించడంతో ఐఫోన్ 14 వెర్షన్ మొబైళ్లను వినియోగదారులకు అందించడంలో జాప్యం జరగవచ్చని కంపెనీ ప్రకటించింది.



ఈ నిరసన ప్రదర్శనల గురించిన వార్తలను చైనా అధికారిక మీడియా తొక్కిపట్టింది. నవంబర్ 28 వరకు చైనా డెయిలీ, గ్లోబల్ టైమ్స్ పత్రికలు ఏ వార్తలనూ ప్రచురించలేదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం చైనాలోని విభిన్న ప్రాంతాలలో జరుగుతున్న నిరసనల గురించి పౌరులు పంపుతున్న వార్తలు వెల్లువలా పోస్ట్ అయ్యాయి. చైనా సైనిక దళాలు, ట్యాంకులు, ట్రక్కుల మోహరింపు వార్తలు కూడా సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు వచ్చాయి. బీజింగ్‌లోని ప్రతిష్ఠాత్మక త్సింగువా యూనివర్సిటీతో సహా ఎందరో విద్యార్థులు ఈ నిరసనల్లో పాల్గొన్నారు.

ఉహాన్, ఉరుంక్వి, కోర్లా, చెంగ్డు, నాంజింగ్, జెంగ్‌జౌ, చోంగ్‌క్వింగ్, గ్వాంగ్‌జౌ, షాంఘై నగరాల్లో నిరసనలు ఊపందుకున్నాయి. ప్రజా సమూహాలు 'షీ జిన్‌పింగ్ డౌన్‌డౌన్', 'చైనా కమ్యూనిస్టు పార్టీ వెళ్లిపో' అంటూ నినదించాయి. నవంబర్ 27న రాత్రి 1.30 గంటల సమయంలో కూడా బీజింగ్‌లోని హైదియన్ జిల్లాలో జనం పోలీసులతో తలపడ్డారు. చైనాలోని 79 ప్రాదేశిక విద్యా సంస్థల విద్యార్థులు నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారని హాంకాంగ్ కేంద్రంగా పనిచేసే ఇనీషియం మీడియా అంచనా వేసింది. నవంబర్ 27 రాత్రి నుంచే భద్రతా బలగాలు నిరసనకారులను అరెస్టు చేయడం ప్రారంభించాయి.

జిన్‌పింగ్ అధికార బాధ్యతలను మూడోసారి స్వీకరించడం (డెంగ్ జియావోపింగ్ మరణం తర్వాత ఇలా జరగడం ఇదే మొదటిసారి) చైనా కమ్యూనిస్ట్ పార్టీ కేడర్లో చాలామందిని కలతపెట్టింది. పైగా, పొలిట్ బ్యూరో స్టాండింగ్ కమిటీ, కేంద్ర మిలిటరీ కమిషన్‌ను తన విశ్వాసపాత్రులతో జిన్‌పింగ్ నింపివేశారు. పొలిట్ బ్యూరో లేదా పొలిట్ బ్యూరో స్టాండింగ్ కమిటీకి అభ్యర్థులను ఎంపిక చేస్తున్నప్పుడు గతాచరణకు భిన్నంగా సీనియర్ కేడర్లను జిన్‌పింగ్ సంప్రదించలేదని అధికారిక మీడియా పేర్కొంది. దీంతో రిటైర్ అయినప్పటికీ ప్రభావ శీలురైన కార్యకర్తలు జిన్‌పింగ్ పట్ల అసంతృప్తితో ఉన్నారు. 20వ పార్టీ కాంగ్రెస్ చివరి రోజున చైనా మాజీ అధ్యక్షుడు హు జింటావోను తొలగించడం ఈ ఆచరణను ప్రతిబింబించింది.

పొలిట్ బ్యూరోకు ప్రమోట్ చేయదగిన, పొలిట్ బ్యూరోలో కొనసాగాల్సిన కేడర్ల వయోపరమైన అర్హతకి సంబంధించి దశాబ్దాలపాటు కొనసాగిన సంప్రదాయాన్ని కూడా జిన్‌పింగ్ విస్మరించారు. 72 సంవత్సరాల జియాంగ్ యూక్సియాను పొలిట్ బ్యూరోలో కొనసాగించడం, రిటైర్మెంట్ వయస్సు రానప్పటికీ హూ చున్హువాను తొలగించడం, జనరల్ హె వెయిదాంగును తగిన అర్హత లేనప్పటికీ పొలిట్ బ్యూరోలోకి ప్రమోట్ చేయడం గట్టి ఉదాహరణలు.

ఈ అశాంతికి పార్టీ అంతర్గత అసంతృప్తి కారణమని జియాంగ్ జెమిన్ మద్దతుదారులు చెబుతున్నారు. 2013 నుంచి వీరిని జిన్‌పింగ్ సంస్థాగతంగానే లక్ష్యం చేసుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు నాయకుడు లేకుండా పోయిన వీరు గణనీయ సంఖ్యలో ఉన్న ప్రభావశీలురైన జిన్‌పింగ్ వ్యతిరేక వర్గంలో కలిసిపోగలరు. జియాంగ్ జెమిన్‌కు లాంఛనప్రాయమైన అంత్యక్రియలను నిర్వహించకూడదని తీసుకున్న నిర్ణయం కూడా గత సంప్రదాయం నుంచి పక్కకు పోవడమే. అది ప్రజా నిరసనలను మరింతగా పెంచుతుందని జిన్‌పింగ్ భయపడి ఉంటారని ఇది సూచిస్తోంది. 1989లో నాటి పార్టీ ప్రధాన కార్యదర్శి మృతి సందర్భంగా ఏం జరిగిందో ఆయనకు బాగా తెలుసు.

చైనాలో నిరసనలు ఒక్కసారిగా వేగం పుంజుకుని రాజకీయ నాయకత్వాన్ని భయపెడుతుంటాయి. దీన్ని గుర్తించింది కాబట్టే, చైనా అధికారిక వార్తా సంస్థ జిన్హువా... (విదేశీ) వ్యతిరేక శక్తుల చొరబాటు, సామాజిక వ్యవస్థను విచ్ఛిన్నపర్చే చట్టవిరుద్ధ చర్యలను కఠినంగా అణచివేయాలని సెంట్రల్ పొలిటికల్ అండ్ లీగల్ అఫైర్స్ కమిషన్ నిర్ణయించిందని రాసింది. ఇకపోతే చైనా సైబర్ స్పేస్ యంత్రాంగం సోషల్ మీడియాను నియంత్రించడానికి తరచుగా ఆదేశాలు జారీ చేస్తూ వచ్చింది. ఇంటర్నెట్‌లో దేన్నయినా లైక్ చేస్తే అది నేరపూరితమైన చర్య అవుతుందని సూచించే చట్టాన్ని కూడా అది రూపొందించింది. చైనా నాయకత్వం తాజా నిరసనలకు కారణాలను, నిరసనకారులను గుర్తించి దర్యాప్తు చేసే 'చిన్న నాయకత్వ బృందాల'ను ఏర్పర్చింది.

చైనా వ్యతిరేక విదేశీ శక్తులు మరోసారి సాంస్కృతిక విప్లవాన్ని ప్రేరేపించే అవకాశముందని చైనా కమ్యూనిస్టు పార్టీ భీతిల్లుతోంది. నిరసనకారులపై చర్యలు తీసుకోవడం తప్పకపోవచ్చు. గతంలో తియనాన్మెన్ ఘటనలు చూపినట్లుగా, ఏ వ్యతిరేకతనైనా 'తరువాతి 25 సంవత్సరాలపాటు' అలాంటిది తలెత్తకుండా అణిచివేయాలని చైనా కమ్యూనిస్టు పార్టీ విశ్వసిస్తోంది. పార్టీలోని ప్రత్యర్థులు తనను అధికారంలోంచి దింపడానికి ప్రయత్నిస్తున్నారని అనుమానిస్తే మాత్రం జిన్‌పింగ్ కచ్చితంగా సహించరు!

వ్యాసకర్త అధ్యక్షుడు,
సెంటర్ ఫర్ చైనా ఎనాలిసిస్ అండ్ స్ట్రాటెజీ
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మీరనేది ఏంటి?



కాంగ్రెస్‌కు రాహుల్ గాంధీ భారంగా తయారయ్యాడనీ, ఓట్లు తేలేకపోతున్నాడనీ అనేవాళ్లే – ఆయన గుజరాత్‌లో కాంగ్రెస్ ప్రచారం కోసం భారత్ జోడో యాత్రను ఆపి వుండవలసిందని అంటున్నారు. ఏదో ఒకటి ఎంచుకోండి యార్!

– అనింద్యో చక్రవర్తి, జర్నలిస్ట్

విధ్వంసకర స్పందన



బాబ్రీ మసీదు విధ్వంసానికి ఇది 30వ సంవత్సరం. అది జరిగినప్పుడు దానికి ప్రతిస్పందనగా నేను మూకను నడిపి, మా ప్రాంతంలోని (పాకిస్తాన్) స్థానిక హిందూ ఆలయాన్ని ధ్వంసం చేయడంలో పాల్గొన్నానని చెప్పడానికి పశ్చాత్తాప పడుతున్నాను. అప్పుడు వారి కళ్లల్లో కనబడిన బాధను నేను ఇప్పటికీ మరిచిపోలేను. అల్లా నన్ను క్షమించుగాక!

– నూర్ దహ్రీ, రచయిత

సత్వర న్యాయం జరగాలి



పదేళ్లకు పైగా పెండింగులో ఉన్న సివిల్, క్రిమినల్ కేసుల సంఖ్య: సుప్రీంకోర్టు– 11,049. హైకోర్టులు– 12,52,305. జిల్లా, సబార్డినేట్ కోర్టులు– 34,17,994. న్యాయం ఆలస్యమైతే, న్యాయం జరగనట్టే. ఈ ఆలస్యం కూడా ఒక కారణం చట్టానికి బయట న్యాయం కోసం ప్రయత్నించడానికి.

– రమణ్‌దీప్ సింగ్ మాన్, రైతు ఇంజినీర్

మాకెందుకు ఇబ్బంది?



ట్రాన్స్ మహిళలు... మహిళలు కాదు. చెప్పాలంటే బయోలాజికల్ మహిళలను ఇది తీవ్రంగా ఇబ్బంది పెడుతుంది. అలాగే బయోలాజికల్ మహిళలకు 'సిస్' (సిస్‌జెండర్– పుట్టినప్పుడూ ఇప్పుడూ ఒకే లింగం అని!) అని వాడటం మరింత గాయపరుస్తుంది. మీ వాస్తవికతనూ, లేబుల్స్‌నూ మా మీద రుద్దకండి. మేము మహిళలం!

– లయా హెలిపెర్న్, దుబాయ్ రచయిత్రి

స్వేచ్ఛపై నిషేధం




హిజాబ్‌ను నిషేధించాలని డెన్మార్క్ ప్రతిపాదించింది. ఇది ముస్లింల స్వేచ్ఛను నిరాకరించడమే. ఇది జుట్టును కప్పుకొనే నన్స్, కన్జర్వేటివ్ యూదులకూ వర్తిస్తుందా?

– హెంద్ ఫైజల్ అల్ ఖసీమీ, యూఏఈ యువరాణి

'కలం భాస్వరం' కొత్త పుస్తకం

వివిధ దినపత్రికలలో వివిధ హోదాల్లో పనిచేసి సంపాదకులుగా జనమెరిగిన వారు కల్లూరి భాస్కరం. వారి స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరుకు దగ్గరలోని ప్రక్కిలంక. పుస్తకం అంటే ఆయనకు ప్రాణం. ఆయన రచనల తీవ్రతను బట్టి 'కలం భాస్వరం' అని కూడా ఆయనను పిలుస్తుంటారు. భాస్కరం కలం నుంచి ధారావాహికంగా వెలువడిన వ్యాస పరంపరే నేడు ఆవిష్కృతమవుతున్న పుస్తకం 'గాంధీత్వ నుంచి హిందుత్వ దాకా'.

కాలికస్పృహ, మరికొన్ని సాహిత్య వ్యాసాలు, కౌంటర్‌వ్యూ (ఆంధ్రప్రభలో కాలమ్), అవతల ('వార్త'లో రాజకీయ, సామాజిక వ్యాసాలు), గ్లోబల్ సందర్భంలో నగ్నముని కొయ్యగుర్రం, మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు ఆంగ్లరచన 'ది ఇన్‌సైడర్' తెలుగు అనువాదం 'లోపలి మనిషి', గాంధీ గురించి రాజ్ మోహన్ గాంధీ ఆంగ్ల రచనకు తెలుగు అనువాదం 'మోహన్ దాస్', కేంద్ర మాజీ మంత్రి ఎస్. జైపాల్‌రెడ్డి రచించిన 'టెన్ ఐడియాలజీస్'కు తెలుగు అనువాదం 'పది భావజాలాలు' వీరి ముద్రిత రచనలు. సారంగ వెబ్ మ్యాగజైన్‌లో ధారావాహికంగా రచించిన మహాభారత ఆధారిత వ్యాసాలు, ట్రాయ్‌లో తవ్వకాలు జరిపిన హైన్‌రిక్ ష్లీమన్ జీవితకథ, కౌంటర్‌వ్యూ రెండో భాగం, కథలు, మరికొన్ని రాజకీయ, సాహిత్య వ్యాసాలు వీరి సాహిత్య కృషికి నిదర్శనాలు. వీరి తాజా రచన (హెచ్‌బీటీ ప్రచురణ) 'మంత్ర కవాటం తెరిస్తే మహాభారతం మన చరిత్రే'. మరి కొన్ని ముద్రణ స్థితిలో ఉన్నాయి.



గతాన్ని తెలుసుకోవడానికి సాయపడే ప్రాచీన మానవ జెనెటిక్స్ రంగంలోని పది మంది ముఖ్యులలో ఒకడిగా 2015లో 'నేచర్' మ్యాగజైన్ గుర్తించిన వాడు హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో జెనెటిక్స్ విభాగంలో ప్రొఫెసర్ డేవిడ్ రైక్. గతాన్ని తెలుసుకోవడానికి సాయపడే ప్రాచీన మానవ డీఎన్ఏ విశ్లేషణ చేసిన పుస్తకాన్ని రాశారాయన. దానిని ఆసాంతం చదివిన భాస్కరం. అటువంటి క్లిష్టమైన పుస్తకాన్ని అర్థం చేసుకోవడానికి డేవిడ్ రైక్రా రాసిన 'హు వియ్ ఆర్ అండ్ హౌ వియ్ గాట్ హియర్' అనే పుస్తకం రెండోసారి అధ్యయనం చేసి, ఆకళింపుజేసుకుని ముఖ్యమనుకున్న భాగాలను తెలుగులోకి అనువదించుకుంటూ నోట్స్ రాసుకున్నారు. ఇటీవలే భాస్కరం ఫేస్‌బుక్ మాధ్యమంలో ధారావాహికంగా ఆ విశేషాలను అందించారు.

పుస్తకాలను గురించి ఆయన 'మనం జీవితాంతం పుస్తకంతో ఉంటాం సరే. మన జీవితం అంతం తర్వాత కూడా పుస్తకం ఉంటుంది' అంటారు. అలాగే... 'మనం పుస్తకంతో కలసి ప్రయాణం చేస్తాం. మన ప్రయాణం ఆగిపోయినా పుస్తకం ప్రయాణం ఇంకా కొనసాగుతూనే ఉంటుంది. ఒక తరం నుంచి ఇంకోతరానికి వారసత్వంగా అందుతూ ఉంటుంది'... అనేది భాస్కరం విశ్వాసం. వయసు పెరిగే కొద్దీ పుస్తకాల మీద అభిరుచి మారుతూ ఉంటుందని ఆయన అంటారు. మనం బాల్య, యవ్వనాల్లో ఏ పుస్తకాలను పక్కన పెట్టేశామో, అవే పుస్తకాలు మన టేబుల్ మీదికి వస్తాయనీ, పేజీలు తెరవకుండానే పుస్తకం మన జీవిత దశల గురించిన పాఠాలు చెబుతుందని అంటారాయన.

– నందిరాజు రాధాకృష్ణ I 98481 28215

(నేడు హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో కల్లూరి భాస్కరం రచన 'గాంధీత్వ నుంచి హిందుత్వ దాకా' ఆవిష్కరణ)

వైఫల్యం ప్రజాస్వామ్యానిదా? దాని వ్యక్తీకరణదా?

సందర్భం



డి. పాపారావు

కొద్ది రోజుల క్రితం 'ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రసీ ఎలక్టోరల్ అసిస్టెన్స్' (ఐడియా) అనే సంస్థ విడుదల చేసిన నివేదిక ప్రజాస్వామ్యం తీవ్ర ఒత్తిడిలో ఉందనీ, పతనం వైపు పయనిస్తున్నదనీ ఆందోళన వ్యక్తం చేసింది. 173 దేశాలలో ఈ సంస్థ సర్వే చేయగా అందులో 104 దేశాలలో ప్రజాస్వామ్య వ్యవస్థలు ఉన్నాయి. వీటిలో 52 దేశాల్లో ప్రజాస్వామ్య విలువలు పతనం అయ్యాయని వివరించింది. భారత్, అమెరికా వంటి పెద్ద దేశాల్లో కూడా ఈ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఆ సంస్థ పేర్కొంది. అలాగే, అనేక 'ప్రజాస్వామ్య' దేశాలలో రోజు రోజుకూ పాలకుల నిరంకుశత్వం పెరిగిపోతుండడంతో ప్రజలకు ఎన్నికల వ్యవస్థపై నమ్మకం పోతోందని నివేదిక పేర్కొంది.

కాగా, కరోనా అనంతర కాలంలో అమెరికాలో ఎన్నికల వ్యవస్థపై విశ్వాసం సడలిందంటూ, ఈ సంస్థ వివరించింది. నిజానికి, ప్రపంచంలో నేడు చాలా దేశాల పాలకులు కరోనా ముందరా... కరోనా తర్వాత అంటూ... అటు ఆర్థిక... ఇటు రాజకీయ పరిణామాలు కూడా వివరిస్తూ ఉండడం మనం చూస్తున్నాం. మన దేశంలో కూడా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నేతలు అనేక మంది కరోనా అనంతర కాలంలో ఆర్థిక పరిస్థితులు దెబ్బ తిన్నాయని పేర్కొనడాన్ని... మనం చూస్తూనే ఉన్నాం.

కానీ, వాస్తవంలో కరోనా... దాని తాలూకు లాక్‌డౌన్‌లు మన దేశంలో మొదలయ్యింది 2020 మార్చి చివరిలో. కాగా, దేశంలో స్థూల ఆర్థిక వృద్ధి రేటు (జీడీపీ) పతనం కావడం 2018 లోని జనవరి – మార్చి త్రైమాసికం నుంచే మొదలయ్యింది. కేవలం కరోనా... లాక్‌డౌన్‌ల వలన ఈ పతనం మరింత తీవ్రతరం అయ్యింది. అంతే! అలాగే, అమెరికాలో కూడా ప్రజానీకానికి ఆ దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల సందేహాలు కేవలం కరోన అనంతర కాలపు, ఎన్నికలతోనే ఏర్పడినవి కాదు. నిజానికి, 2020లో అమెరికాను కరోనా కెరటం తాకక ముందు నుంచే అమెరికా ప్రజలకు... తమ దేశంలో నడుస్తోంది కార్పొరేట్ స్వామ్యమనీ... అది ప్రజాస్వామ్యం కాదనే అభిప్రాయం ఉందని ప్రఖ్యాత సర్వే సంస్థ 'ప్యూ' గతంలోనే అనేకానేక దఫాలు నివేదికలను సమర్పించి ఉంది. కాబట్టి, ప్రతి చెడునూ కేవలం కరోనా అనంతర పరిణామంగా చెప్పజూడటం సమస్య మూలాలలోకి వెళ్ళడాన్ని తిరస్కరించడం లేదా పలాయన వాదం!

ప్రస్తుతం ఇక్కడ చర్చించవలసింది... అసలు, ప్రజాస్వామ్య భావనకు ఒక ఆలోచనగా కాలం చెల్లడం... లేదా అది అంతరించిపోవడం సాధ్యమేనా అన్నది? వాస్తవంలో ఒక భావనగా లేదా ఆలోచనగా ప్రజాస్వామ్యం అనేది ఒకానొక దేశంలోని ఆర్థిక, రాజకీయ, సామాజిక... అంశాలకు సంబంధించిన అంతిమ నిర్ణయాలు అన్నింటినీ, ఆ దేశం తాలూకు ప్రజానీకంలోని మెజారిటీ అభిప్రాయానికి అనుగుణంగా తీసుకోవడంగానే ఉంటుంది. ఈ విషయంలో ఎవ్వరికీ భిన్నాభిప్రాయం ఉండే అవకాశం లేదు. కాగా, మరి నేడు చిక్కుల్లో పడింది అని చెప్పబడుతోన్నది ఈ ప్రజాస్వామ్య భావనేనా? కాదన్నది నిర్వివాదం. ఎందుకంటే, ఈ 'ఐడియా' సర్వే ప్రకారమే ఎటువంటి ఎన్నికల అవక తవకలూ జరగని దేశాలలో కూడా రాజకీయ విభజనలు తీవ్రతరం కావడం ప్రజాస్వామ్యంపై విశ్వాసం క్షీణించడాలూ జరుగుతున్నాయి. మరి ఇప్పుడు ఈ సమస్య తాలూకు అసలు మూలాలు ఎక్కడ ఉన్నాయి?



'ప్యూ' సంస్థ ప్రకారమే ప్రజాస్వామ్యం పట్ల ఈ అసంతృప్తికి కారణాలుగా ఆర్థిక పనితీరు, న్యాయబద్ధమైన పరిపాలన వంటి అంశాలు ప్రధానంగా ఉన్నాయి. కాబట్టి సమస్యను ఈ కోణం నుంచి పరిశీలిస్తే మనకు 'ప్రజాస్వామ్య వైఫల్యం' తాలూకు అసలు మూలం అర్థం అవుతుంది. నిజానికి, ప్రపంచంలో ప్రజాస్వామ్యం అనే భావనకు ఏకైక ప్రాతినిధ్య రూపం అంటూ ఒక్కటి మాత్రమే లేదు. ఈ కారణం చేతనే గతంలోనే మార్క్సిస్టు సిద్ధాంత కారులు బూర్జువా ప్రజాస్వామ్యం, కార్మికవర్గ ప్రజా స్వామ్యం అంటూ... విభజనలు చేసి ఉన్నారు. బూర్జువా ప్రజాస్వామ్యం అంటే అది ప్రైవేటు ఆస్తి సమాజం తాలూకూ... అలాగే లాభార్జనే పరమావధిగా నడిచే వ్యవస్థ తాలూకూ పరిపాలనా వ్యక్తీకరణ. ఈ వ్యవస్థలో పాలకవర్గంగా భూస్వామ్య లేదా పెట్టుబడిదారీ వర్గాలు ఉంటాయి. ఇక, కార్మికవర్గం ప్రజాస్వామ్యంలో పెట్టుబడి దారులకూ, వారి ప్రయోజనాలకూ భిన్నమైన లేదా వ్యతిరేకమైన పాలన ఉంటుంది అనేది మార్క్సిజం తాలూకు సూత్రీకరణ.

అయితే సామాజిక ఎదుగుదలకు అవకాశాలు ఉన్నంతకాలం పెట్టుబడిదారీ వ్యవస్థను ప్రజలు ఆమోదించగలరు. తీవ్రస్థాయి అసమానతలు లేనిదిగా ఉన్నంత కాలం ఈ వ్యవస్థ మనుగడ సాగించగలదు. కాగా, నేడు ప్రపంచంలోని దరిదాపు పెట్టుబడిదారీ దేశాలు అన్నింటిలోనూ పైన పేర్కొన్న దానికి భిన్నమైన స్థితిగతులు నెలకొంటున్నాయి. అమెరికా, భారత దేశంతో సహా ప్రపంచంలోని అనేక పెట్టు బడిదారీ దేశాలలో సామాన్య ప్రజలకు ఉన్నత స్థాయికి ఎదగగలిగేందుకు అవకాశాలు దరిదాపుగా క్షీణించి పోతున్నాయి. సామాజిక ఎదుగుదలకు అవసరమైన విద్యావకాశాలు నేడు కొద్దిమంది ధనవంతులకే పరిమితం అయిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే సామాన్యుల సామాజిక, ఆర్థిక ఎదుగుదలలకు మూసుకుపోతోన్న మార్గాల గురించి వెలువడిన 'ది బ్రోకెన్ ల్యాడర్' అనే పుస్తకాన్ని పేర్కొనవచ్చు.

మరో పక్కన, కొద్దిమంది కార్పొరేట్లకు అనుకూలమైన ప్రభుత్వాల విధానాల వలన దెబ్బతిని పోయిన... పోతోన్న చిన్న పరిశ్రమలూ, వ్యాపారాలూ కూడా, వ్యవస్థలో కేంద్రీకృతమై పోతోన్న సంపద గురించిన కథను చెబుతున్నాయి. గత అనేక దశాబ్దాలుగా జరుగుతోన్న ఈ పరిణామం... 2016 లోని పెద్ద నోట్ల రద్దు... 2017లో అమలులోకి వచ్చిన జీఎస్టీ, 2020 కరోనా కాలంలోని ప్రభుత్వ విధానాల వలన మన దేశంలో మరింత వేగం పుంజుకుంది. ఫలితంగా చిన్నా చితకా వ్యాపారుల వ్యాపారం బడా కార్పొరేట్ సంస్థలకూ, వ్యాపారులకు బదలాయించబడింది. అదీ కథ!

ఇక మరో ప్రక్కన 2008 ఫైనాన్స్ సంక్షోభం, 2020 అనంతరం కరోనా కాలంలోనూ అమెరికాతో సహా ధనిక దేశాలు ఇచ్చిన ఆర్థిక ఉద్దీపన పథకాలు కూడా ఆర్థిక అసమానతలను పెంచేశాయి. ఈ పెట్టుబడిదారీ, ధనిక వర్గ అనుకూల నయా ఉదారవాద సంస్కరణల మార్గం నుంచి విడివడి... సంపదను సృష్టించే ప్రజానీకానికే దానిని దక్కేలా చేయగల విధానాలను అనుసరించగల ప్రత్యామ్నాయం వైపు ప్రయాణం చేయడం ఇందుకు పరిష్కార మార్గం. కాబట్టి ప్రస్తుతం ఇక్కడ విఫలమయ్యింది ప్రజాస్వామ్యం కాదు. సంపద కేంద్రీకరణకు కారణమైన పెట్టుబడిదారి ప్రజాస్వామ్యం మాత్రమే! కాబట్టి వైఫల్యం ప్రస్తుత ఆర్థిక నమూనాలో ఉంది. దానిని మార్చనంత కాలం మెజారిటీ ప్రజల అభీష్టానికి వ్యక్తీకరణ అయిన రాజకీయ ప్రజాస్వామ్యం, దానికదిగా... విడిగా సమర్థవంతంగా పని చేయలేదు!

వ్యాసకర్త ఆర్థిక రంగ నిపుణులు
మొబైల్: 98661 79615

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.విదియ ఉ.11.24 వరకు, తదుపరి తదియ **నక్షత్రం:** ఆరుద్ర సా.4.14 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** తె.5.30 నుండి 7.14 వరకు (తెల్లవారితే ఆదివారం), **దుర్ముహూర్తం:** ఉ.6.24 నుండి 7.51 వరకు, **అమృతఘడియలు:** లేవు. ; **రాహుకాలం :** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం :** ప.1.30 నుండి 3.00 వరకు ; **సూర్యోదయం** 6.23 ; **సూర్యాస్తమయం** 5.22.

క్లుప్తంగా...

స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేసుల్లో రికార్డుల మోత

ఉక్కునగరం (గాజువాక): స్టీల్ ప్లాంట్ గోదావరి, కృష్ణా బ్లాస్ట్ ఫర్నేస్‌లు హాట్ మెటల్ ఉత్పత్తిలో మరో రికార్డును సొంతం చేసుకున్నాయి. గురువారం రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు సంయుక్తంగా 16,200 టన్నులు హాట్ మెటల్ ఉత్పత్తి చేయడం ద్వారా సరికొత్త రికార్డును సృష్టించాయి. తద్వారా బుధవారం రెండు ఫర్నేస్‌లు సాధించిన 15,700 టన్నుల హాట్‌మెటల్ ఉత్పత్తి రికార్డును అధిగమించాయి. అదే విధంగా కృష్ణా బ్లాస్ట్ ఫర్నేస్ శుక్రవారం 8,500 టన్నులు హాట్ మెటల్ ఉత్పత్తి చేసి అంతకు ముందు రెండు రోజుల ఉత్పత్తి రికార్డులు 8,030, 8100 టన్నుల రికార్డులను అధిగమించింది. ఈ సందర్భంగా సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎ.కె.సక్సేనాలు ఉద్యోగులను అభినందించారు.

'వారాహి' రంగులో మార్పులు చేస్తాం: నాదెండ్ల

సాక్షి, విశాఖపట్నం: పవన్‌కళ్యాణ్ ఎన్నికల ప్రచార రథం 'వారాహి'కి నియమాలకనుగుణంగా రంగులో మార్పులు చేస్తామని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ చెప్పారు. విశాఖలోని పౌర గ్రంథాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారాహి రంగుపై ఓ విలేకరి ప్రశ్నించగా.. ఆయన పైవిధంగా స్పందించారు. జనసేన, టీడీపీల పొత్తు గురించి సమయం వచ్చినప్పుడు చెబుతామన్నారు. జనవరి 12న శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో యువశక్తి పేరిట యూత్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇటీవల ప్రమాదాల్లో మరణించిన ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఇద్దరు జనసేన కార్యకర్తల కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. మీడియా సమావేశంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకరరావు, పీఏసీ సభ్యుడు కోన తాతారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భూతప్పల ఉత్సవం


భక్తులపై నడుచుకుంటూ వస్తున్న భూతప్ప

మడకశిర: శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం భక్తరపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి, జిల్లేడుగుంట శ్రీఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా భూతప్పల ఉత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మహిళలు, పురుషులు తడి దుస్తులతో రోడ్డుపై బోర్లా పడుకుని భూతప్పల కాలి స్పర్శ కోసం తపించారు. దేవతా విగ్రహాలను పూజారి ఇంటి నుంచి ఆలయానికి తీసుకురాగా.. ఆ సమయంలో భూతప్పల అలంకారులు రోడ్డుపై బోర్లా పడుకుని ఉన్న భక్తులను కాళ్లతో తొక్కుతూ ముందుకు సాగారు.

బీఎస్-3 వాహనాల కేసుల్లో చార్జిషీట్లు దాఖలు

తాడిపత్రి: బీఎస్-3 వాహనాలను బీఎస్-4గా చూపి అక్రమంగా విక్రయించిన వ్యవహారంలో అనంతపురం జిల్లా తాడిపత్రి టీడీపీ మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి అండ్ కోపై నమోదైన కేసులకు సంబంధించి 23 కేసుల్లో పోలీసులు చార్జి షీట్లు దాఖలు చేశారు. సుప్రీం కోర్టు నిషేధించిన బీఎస్-3 విభాగానికి చెందిన 154 లారీలు, బస్సులను జేసీ ప్రభాకర్‌రెడ్డి అండ్ కో.. జటాధర ఇండస్ట్రీస్, దాని అధినేత సి.గోపాల్‌రెడ్డి, ఇతరుల పేరిట స్క్రాప్(తుక్కు) కింద కొనడమే కాకుండా, వాటిని నకిలీ పత్రాలతో బీఎస్-4గా చూపి వివిధ రాష్ట్రాల్లో విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఈ వ్యవహారంపై 2020 జూన్‌లో పలు కేసులు నమోదయ్యాయి. జేసీ ప్రభాకర్‌రెడ్డితో పాటు ఆయన తనయుడు జేసీ అస్మిత్‌రెడ్డిలను అప్పట్లో పోలీసులు అరెస్ట్ చేశారు కూడా. తాడిపత్రిలో నమోదైన 23 కేసులకు సంబంధించి స్థానిక కోర్టులో కొన్ని రోజులుగా సాగుతున్న చార్జిషీట్ల ప్రక్రియ శుక్రవారం ముగిసింది. ఇదే వ్యవహారంలో మరో పది కేసులు ఇతర ప్రాంతాల్లో నమోదై ఉన్నాయి.

మూల విరాట్టును మరో చోటుకు మార్చడానికి వీల్లేదు

- శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించిన మూలవిరాట్టును మార్చడం . దర్మశాస్త్రాలకు విరుద్ధం
- మత విశ్వాసాలకు, ఆచార సంప్రదాయాలకు రాజ్యాంగ రక్షణ ఉంది
- సీజే నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం కీలక తీర్పు
- మహంకాళి అమ్మవారి విగ్రహాన్ని మరో చోటుకు మార్చొద్దని అధికారులకు ఆదేశం



సాక్షి, అమరావతి: దేవాలయాల్లో ప్రతిష్ఠించిన విగ్రహాలను మరో చోటుకు మార్చే విషయంలో హైకోర్టు శుక్రవారం కీలక తీర్పు వెలువరించింది. వేద, మంత్రబద్ధంగా, మతపరమైన ఆచార, సంప్రాదాయాలను అనుసరించి ప్రతిష్ఠించిన విగ్రహాన్ని (మూల విరాట్టు) మరో చోటుకు మార్చడానికి వీల్లేదని చెప్పింది. ఇలా మార్చడం ధర్మ శాస్త్రాలకు, హిందూ మత విశ్వాసాలకు, ఆచార సంప్రదాయాలకు విరుద్ధమని స్పష్టం చేసింది. ఆచార వ్యవహారాలు, విశ్వాసాలు తదితరాలకు విఘాతం కలిగించడం రాజ్యాంగ ఉల్లంఘన కిందకే వస్తుందని తెలిపింది. మతపరమైన విశ్వాసాలు, ఆచారాలకు రాజ్యాంగపరమైన రక్షణ ఉందని గుర్తు చేసింది. గుంటూరు జిల్లా నర్సరావుపేట మండలం ఇస్సప్పాళెం గ్రామంలో ఉన్న ప్రముఖ దేవస్థానం శ్రీ మహంకాళి అమ్మ దేవాలయంలోని అమ్మవారి విగ్రహాన్ని దేవస్థానం పునర్నిర్మాణం పేరుతో మరో చోటుకు తరలించడాన్ని చట్ట విరుద్ధంగా ప్రకటించింది. అమ్మవారి విగ్రహంతో పాటు అక్కడే ఉన్న గుంజి చుక్కమ్మ ప్రతిమను కూడా మరో చోటకు మార్చకూడదని దేవదాయ శాఖ కమిషనర్, ఇతర అధికారులను ఆదేశించింది. విగ్రహాన్ని మరో చోటుకు మార్చడాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాన్ని కొట్టేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది.

ఇస్సప్పాళెంలో 1976లో శాస్త్రోక్తంగా నిర్మించిన శ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయం భక్తుల విశ్వాసంతో బాగా అభివృద్ధి చెందింది. ఆలయం అభివృద్ధికి ఎంతో తోడ్పడిన గుంజి చుక్కమ్మ ప్రతిమను కూడా ఇక్కడ ఉంచారు. దేవాలయాన్ని విస్తరించాలని అధికారులు ప్రతిపాదించారు. వెనుక ఉన్న స్థలంలో రాతితో ఆలయాన్ని నిర్మించి అందులోకి అమ్మవారి విగ్రహాన్ని మార్చాలని ప్రతిపాదించారు. చుక్కమ్మ ప్రతిమను కూడా మార్చేందుకు సిద్ధమయ్యారు. దీనిని సవాలు చేస్తూ దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తలు యల్లంటి రేణుక, దారా నవనీతాబాయి 2021లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దేవాలయాల నిర్వహణ చూస్తున్న అరవపల్లి వేదాద్రి నర్సింహారావు పునర్నిర్మాణ పనులు ఆపకుండా అధికారులను ఆదేశించాలంటూ ఓ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు వ్యాజ్యాలపై సింగిల్ జడ్జి జస్టిస్ రఘునందన్‌రావు విచారణ జరిపారు. రేణుక, నవనీతబాయి పిటిషన్‌ను కొట్టేశారు. ఈ తీర్పును సవాలు చేస్తూ రేణుక, నవనీతబాయి ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలుచేశారు. ఆగమ నిబంధనలకు అనుగుణంగానే విగ్రహాన్ని మరో చోటుకు మారుస్తున్నామని అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. దేవస్థానం కూలిపోయే దశలో ఉన్నందున పునర్నిర్మాణం చేపట్టామన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం శుక్రవారం తీర్పునిచ్చింది.

ఆ కారణాలకు ధర్మశాస్త్రాల ఆమోదం లేదు

'అనిశ్చిత పరిస్థితులు తలెత్తినప్పుడు దేవస్థాన జీర్ణోద్ధరణ, విగ్రహ పునఃప్రతిష్ఠ గురించి ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. శాస్త్రోక్తంగా అత్యంత క్లిష్టమైన అన్ని విధి విధానాలను పూర్తి చేసి విగ్రహ ప్రతిష్ఠ చేసినప్పుడు దానిని మరో చోటుకు మార్చడానికి వీల్లేదు. అలా మారిస్తే కొత్త దేవాలయాన్ని నిర్మించడం కిందకే వస్తుంది. మహంకాళి అమ్మవారి విగ్రహాన్ని మార్చేందుకు అధికారులు చెప్పిన కారణాలు శాస్త్రాలు నిర్దేశించిన అనిశ్చిత పరిస్థితుల కిందకు రావు. దేవాలయ నిర్మాణం బలహీనంగా ఉందని చెప్పేందుకు ఓ ప్రైవేటు ఆర్కిటెక్ట్ ఇచ్చిన నివేదిక తప్ప ఇతర ఆధారాలేవీ లేవు. అది కూడా ఇప్పటికిప్పుడు ముప్పు ఉందని చెప్పలేదు. భక్తుల విశ్వాసం ప్రకారం ఈ అమ్మవారు చాలా శక్తివంతురాలు. కాబట్టి విగ్రహాన్ని మరో చోటుకి మార్చడం భక్తుల మనోభావాలను దెబ్బతియ్యడమే అవుతుంది' అని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది.

36 ప్రధాన ఆలయాల్లో మాస్టర్‌ప్లాన్ అమలు

- రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి కొట్టు సత్యనారాయణ


ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, పక్కన ప్రభుత్వవిప్ ఉదయభాను

పెనుగంచిప్రోలు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 36 ప్రధాన ఆలయాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల నిమిత్తం మాస్టర్ ప్లాన్ అమలుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖామంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ ఆలయం వద్ద రూ.14.50 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుతో కలిసి శంకుస్థాపన చేశారు. సభలో ఆయన మాట్లాడుతూ గత చంద్రబాబు ప్రభుత్వంలో రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధి పట్టించుకోక పోగా, ఆలయాలను పడగొట్టడమే కాకుండా..పబ్లిసిటీ పిచ్చితో గోదావరి పుష్కరాల్లో భక్తుల ప్రాణాలను బలిగొన్న విషయాలను మరువలేమని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత దేవాలయాలను తీర్చిదిద్దడంతో పాటు వాటి ఆలనా, పాలనపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. గ్రామ గ్రామానా ఆలయాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ఏడాదిలో 1,450 ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని వివరించారు. గతంలో ధూపదీప నైవేద్యాల కోసం 1,561 ఆలయాలు ఎంపిక చేయగా.. కొత్తగా మరో 5 వేల ఆలయాలను ఎంపిక చేశామని తెలిపారు. ఆలయాల కల్యాణకట్టలో పనిచేస్తున్న నాయిబ్రాహ్మణుల సమస్యకు సీఎం సంపూర్ణ న్యాయం చేస్తారన్నారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు బ్లాక్ చైన్ టెక్నాలజీపై శిక్షణ

- బెంగళూరు కంపెనీతో నూజివీడు ట్రిపుల్ ఐటీ ఒప్పందం
- విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ స్కిల్స్ పెంపొందించడమే లక్ష్యం


ఒప్పందం కుదుర్చుకుంటున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ జీవీఆర్ శ్రీనివాసరావు, కంపెనీ సీఈవో చల్లా ఓబుళపతి

నూజివీడు: తమ విద్యార్థుల్లో సాఫ్ట్‌వేర్ స్కిల్స్‌ను పెంపొందించడమే లక్ష్యంగా నూజివీడు ట్రిపుల్ ఐటీ ముందడుగు వేస్తోంది. ఇందులో భాగంగా బెంగళూరుకు చెందిన స్ట్రాహ్యాట్ ప్రైవేటు కంపెనీతో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జి.వి.ఆర్.శ్రీనివాసరావు, స్ట్రాహ్యాట్ కంపెనీ సీఈవో చల్లా ఓబుళపతి ఒప్పంద పత్రాలపై శుక్రవారం సంతకాలు చేశారు. ఈ ఒప్పందంలో భాగంగా కంపెనీ బ్లాక్ చైన్ టెక్నాలజీకి సంబంధించిన అప్లికేషన్‌లపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వనుంది. ఈ ఒప్పందం మూడేళ్ల పాటు అమలులో ఉంటుంది. ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరానికి చెందిన విద్యార్థులు దీనికి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. రిజిస్టర్ అయిన విద్యార్థులందరికీ మూడు నెలల పాటు బ్లాక్ చైన్ టెక్నాలజీపై శిక్షణ అందిస్తారు. అంతేగాక బ్లాక్‌చైన్ రంగంలో అవకాశాలపై అవగాహన పెంచేందుకు కంపెనీ శిక్షణ సమయంలో విద్యార్థులకు వర్క్‌షాప్‌లు, హ్యాక్‌థాన్‌లు నిర్వహిస్తారు. శిక్షణ అనంతరం 25 మంది విద్యార్థులను ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక చేస్తారు. ఏడాది పాటు ఉండే ఇంటర్న్‌షిప్ కాలంలో నెలకు రూ.25 వేల స్టైఫండ్‌ను అందజేస్తారు. ఆ తర్వాత వారికి పరీక్ష నిర్వహించి అందులో ఉత్తీర్ణులైనవారికి ఏడాదికి రూ.12 లక్షల ప్యాకేజీతో కంపెనీలో ప్లేస్‌మెంట్ ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో అకడమిక్స్ డీన్ లక్ష్మణ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వాసు, ఫైనాన్స్ అధికారి నాగార్జునదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇక డిజి-లాకర్ ద్వారా టెన్త్ సర్టిఫికెట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని విద్యార్థులు, ఇతర అభ్యర్థులకు శుభవార్త. కీలకమైన ఎస్ఎస్‌సీ (టెన్త్) సర్టిఫికెట్లు ఇకపై డిజి-లాకర్ (డిజిటల్ లాకర్) ద్వారా అందుబాటులోకి రానున్నాయి. తొలిసారిగా రాష్ట్రం ఎస్ఎస్‌సీ బోర్డు (ప్రభుత్వ పరీక్షల డైరక్టరేట్) డిజి-లాకర్ ద్వారా సర్టిఫికెట్లను అభ్యర్థులకు అందుబాటులోకి తెచ్చింది. కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ఏర్పాటుచేసిన డిజి-లాకర్‌లోకి ఎస్ఎస్‌సీ బోర్డు అనుసంధానమైందని డైరక్టర్ డి.దేవానందరెడ్డి తెలిపారు. 2017 నుంచి 2022 వరకు ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్లు డిజి-లాకర్ ద్వారా అభ్యర్థులకు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. అభ్యర్థులు డిజిలాకర్‌కు సైన్ అప్ అయి ముఖ్యమైన పత్రాలు, సర్టిఫికెట్లను పొందవచ్చని ఆయన వివరించారు.

కాలేజీలు అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రగతి సాధించాలి

రాష్ట్ర ఉన్నత విద్య మండలి ఉపాధ్యక్షుడు ఆచార్య కె.రామమోహనరావు

ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు) : రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలకు అనుబంధంగా పనిచేస్తున్న కళాశాలలు అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రగతి సాధించాలని రాష్ట్ర ఉన్నత విద్య మండలి ఉపాధ్యక్షుడు ఆచార్య కె.రామమోహనరావు అన్నారు. ఏయూ సెనేట్ మందిరంలో శుక్రవారం ఉన్నత విద్య మండలి, ఏయూ సంయుక్తంగా నిర్వహించిన 'లీవరేజింగ్ లింక్డిన్ ఇన్ టు డెవలప్ ఏ కెరియర్ ఆఫ్ చాయిస్' సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య కె.రామమోహనరావు మాట్లాడుతూ అంతర్జాతీయ విద్య విపణిలో మనకంటూ ఒక గుర్తింపును, ప్రత్యేకతను సంతరించుకునే విధంగా పనిచేయాలని సూచించారు. నిరంతరం జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, మన నైపుణ్యాలకు తగిన ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి లింక్డిన్ ఒక ప్రభావంతమైన సాధనంగా నిలుస్తుందని వివరించారు. దీనిపై ప్రిన్సిపాల్స్ సంపూర్ణ అవగాహన కలిగి ఉంటూ, విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, లింక్డిన్ లెర్నింగ్ సీఎస్ఎం దీప్ రస్తోగి, అభిషేక్ కోహ్లి, ఉన్నత విద్య మండలి అకడమిక్ ఆఫీసర్ ఎస్.మాధ్యూ తదితరులు ప్రసంగించారు. అనంతరం లింక్డిన్ ప్రతినిధులు ప్రిన్సిపాల్స్‌కు అవగాహన తరగతులు నిర్వహించారు.

మొక్క ఒకటి.. కాయలు 1200

- ఏపుగా ఎదిగిన మినుము మొక్క
- ఒకే మొక్క నుంచి 750 గ్రాముల దిగుబడి


11.5 అడుగుల ఎత్తు ఉన్న మినప మొక్క

కంకిపాడు: సాధారణంగా మినప మొక్కలు అడుగు నుంచి రెండడుగులు పెరుగుతాయి. మరీ పెరిగితే గరిష్ఠంగా నాలుగు అడుగుల వరకు పెరుగుతాయి. కృష్ణాజిల్లా కంకిపాడు మండలం మంతెన గ్రామంలో మాత్రం ఏకంగా 11.5 అడుగుల పొడవు పెరిగింది. గ్రామ నివాసి పటాకుల శ్రీనివాసరావు ఇంటి పెరట్లో కూరగాయ మొక్కలతో పాటు వేసిన మినప మొక్కల్లో ఇదొకటి. దీని నుంచి 1200 కాయలు వచ్చాయి. ఈ ఒక్క మొక్క నుంచి కోసిన కాయలను ఒలవగా వచ్చిన మినప గింజల బరువు 750 గ్రాములు ఉంది. ఎలాంటి ఎరువులు వేయలేదని, కొత్తగా పోసిన నల్లమట్టిలో మొక్కలు నాటి, సేంద్రియ ఎరువు వాడానని శ్రీనివాసరావు తెలిపారు.

2,025 మంది హృద్రోగ బాధిత పిల్లలకు పునర్జన్మ

ఇండియన్ మాజీ క్రికెటర్ గవాస్కర్


గవాస్కర్ ఆటోగ్రాఫ్ చేసిన బ్యాట్‌ను సొంతం చేసుకున్న రోటరీ సభ్యుడు పవన్ అగర్వాల్

కొమ్మాది (భీమిలి): హృద్రోగంతో పుట్టిన పిల్లలకు ఆపరేషన్ చేయించడం ద్వారా రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్, రాయపూర్‌లోని శ్రీ సత్యసాయి సంజీవని ఆస్పత్రి పిల్లలకు సెకెండ్ ఇన్నింగ్స్ (పునర్జన్మ) ప్రసాదించి ప్రాణదాతలుగా నిలుస్తున్నట్లు ఇండియన్ మాజీ క్రికెటర్, పద్మభూషణ్ అవార్డు గ్రహీత సునీల్ గవాస్కర్ చెప్పారు. విశాఖపట్నం రిషికొండలోని రాడిసన్ బ్లూలో ఇంటర్నేషనల్ రోటరీ క్లబ్‌లో విశాఖ విస్తా - 2022 పేరుతో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఉత్సవానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హృద్రోగంతో పుట్టిన 2,025 మంది పిల్లలకు రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి సంజీవని ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్స చేయించి ప్రాణదానం చేయించడం ఎంతో అభినందించదగిన విషయమన్నారు. ఓప్లీ దిల్ - నో బిల్ అని చమత్కరించారు. ఆపరేషన్ అనంతరం చిన్నారుల తల్లిదండ్రుల ముఖంలో కనిపించే ఆనందం చూసినప్పుడు డబుల్ సెంచరీ కొట్టినంత ఆనందం కలిగినట్లు చెప్పారు. తమ కుటుంబం 50 ఏళ్లగా శ్రీసత్యసాయి భక్తిలో ఉన్నట్లు తెలిపారు. క్రికెటర్‌గా, కామెంటేటర్‌గా విజయవంతమైన కెరీర్ అనుభవిస్తున్నానని, మూడో ఇన్నింగ్స్ హృద్రోగ పిల్లలకు సేవచేయడమేనని చెప్పారు. రోటరీ క్లబ్‌తో పార్టనర్ షిప్ జీవితాంతం ఉంటుందన్నారు. అనంతరం సునీల్ గవాస్కర్‌కు రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ జెన్నిఫర్ జోన్స్, రోటరీ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ కిషోర్‌కుమార్, రోటరీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మహేష్ కలసి రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందజేశారు.

ఒక సంతకం.. 35 ఆపరేషన్లు

విస్తా - 2022లో భాగంగా నిర్వహించిన ఈ ఉత్సవ్‌లో సునీల్ గవాస్కర్ ఆటోగ్రాఫ్ చేసిన బ్యాట్‌ను వేలంలో రోటరీ సభ్యుడు పవన్ అగర్వాల్ దక్కించుకున్నారు. హృద్రోగంతో బాధపడుతున్న 35 మంది చిన్నారులకు ఆపరేషన్ నిమిత్తం ఈ డబ్బును ఉపయోగించనున్నట్లు తెలిపారు. పద్మభూషణ్ అవార్డు గ్రహీత రఘునాథ్ మసిల్‌కర్ తదితరులు పాల్గొన్నారు.

ఐయూఎన్ఎస్ సభ్యుడిగా డాక్టర్ భానుప్రకాశ్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) శాస్త్రవేత్త, బయో కెమిస్ట్రీ విభాగ అధ్యక్షుడు డాక్టర్ జి.భానుప్రకాశ్ రెడ్డి పోషక శాస్త్రాల అంతర్జాతీయ సమాఖ్య (ఐయూఎన్ఎస్) సభ్యుడిగా ఎన్నికయ్యారు. తన పరిశోధనలతో పోషక శాస్త్రాల అభివృద్ధికి భానుప్రకాశ్ రెడ్డి చేసిన సేవలకు గుర్తింపుగా ఆయనకు ఈ గుర్తింపు లభించింది. ఎన్ఐఎన్‌లో పాతికేళ్లుగా పని చేస్తున్న డాక్టర్ రెడ్డి అసాంక్రమిక ఆరోగ్య సమస్యల్లో కణస్థాయి పోషకాలపై పలు పరిశోధనలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు పలు అంతర్జాతీయ జర్నల్స్‌లో 190 వరకు పరిశోధన పత్రాలను ప్రచురించారు.

నేటి నుంచి ఈఏపీసెట్ బైపీసీ విభాగం కౌన్సెలింగ్

- 12 నుంచి 15 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- 13 నుంచి 16 వరకు ఆప్షన్ల నమోదు
- 19న సీట్ల కేటాయింపు



షెడ్యూల్ ఇలా..

ప్రాసెసింగ్ ఫీజు	డిసెంబర్ 10 నుంచి 12 వరకు
సర్టిఫికెట్ల పరిశీలన	12 నుంచి 15 వరకు
ఆప్షన్ల నమోదు	13 నుంచి 16 వరకు
ఆప్షన్ల సవరణ	16
సీట్ల కేటాయింపు	19
సెల్ఫ్ రిపోర్టింగ్, కాలేజీల్లో చేరిక	20 నుంచి 23 వరకు

అందుబాటులో ఉన్న సీట్లు ఇలా..

కోర్సు	వర్సిటీ సీట్లు	ప్రైవేటు సీట్లు
ఇంజనీరింగ్	45	70
ఫార్మసీ	610	8,270
ఫార్మ్‌డీ	66	1,414

సాక్షి, అమరావతి: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్-2022లోని బైపీసీ విభాగం విద్యార్థులకు అడ్మిషన్ల కౌన్సెలింగ్ శనివారం నుంచి ప్రారంభం కానుంది. బైపీసీ విభాగంలో కన్వీనర్ కోటాలో 10,475 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఎంపీసీ విభాగంలో లెఫ్ట్ ఓవర్ సీట్లు 5,096 కాగా కన్వీనర్ కోటా సీట్లు 5,379 ఉన్నాయి. ఇంజనీరింగ్‌లో 115, ఫార్మసీలో 8,880, ఫార్మ్‌డీలో 1,480 సీట్లు ఉన్నాయని కన్వీనర్ నాగరాణి వివరించారు. బీఈ, బీటెక్ కోర్సులకు సంబంధించి బయోటెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఇతర వివరాలకు https://sche.ap.gov.in చూడొచ్చు.

కాగా ఏపీ ఈఏపీసెట్ ఎంపీసీ విభాగం అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయింది. ఎంపీసీ విభాగంలో కన్వీనర్ కోటాలో 1,13,403 సీట్లు ఉండగా 90,100 సీట్లు భర్తీ అయ్యాయి. 23,303 సీట్లు మిగిలాయి. ప్రభుత్వ వర్సిటీలు, ప్రైవేటు కాలేజీల్లోనే కాకుండా ప్రైవేటు వర్సిటీల్లోనూ విద్యార్థులకు సీట్లు కేటాయించారు. ప్రైవేటు వర్సిటీల్లోని 3,867 సీట్లకు గాను 3,578 సీట్లు భర్తీ అయ్యాయి.

లోన్ యాప్ ప్రధాన నిందితుల అరెస్టు

- చండీగఢ్ జైలులో ఉన్న పర్వేజ్ ఆలం, అర్జున్ సైన్
- పీటీ వారెంట్‌తో విశాఖకు తీసుకొచ్చిన సైబర్ పోలీసులు
- అమాయకులను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేసినట్టు అంగీకారం
- రాష్ట్రంలో 40 వరకు కేసుల్లో నిందితులుగా గుర్తింపు

దొండపర్తి (విశాఖ దక్షిణ): లోన్ యాప్ కేసులో ప్రధాన సూత్రధారులు ఇద్దరిని విశాఖ సైబర్ క్రైం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇదే తరహా కేసుల్లో అరెస్టయి చండీగఢ్ మోడల్ జైలులో ఉన్న పర్వేజ్ ఆలం, అర్జున్ సైన్‌లను పీటీ వారెంట్‌పై విశాఖకు తీసుకొచ్చి విచారించారు. వీరు రాష్ట్రంలో పలు స్టేషన్లలో నమోదైన 40 వరకు లోన్ యాప్ కేసుల్లో నిందితులుగా పోలీసులు గుర్తించారు. విశాఖ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో నమోదైన లోన్ యాప్ కేసు దర్యాప్తు నిమిత్తం ఇన్‌స్పెక్టర్ భవానిప్రసాద్ కొద్ది రోజుల క్రితం తన సిబ్బందితో ఢిల్లీ వెళ్లి రాహుల్ మెహత, అభిషేక్ కుమార్‌లను అరెస్టు చేశారు. వారిని విచారించగా.. పర్వేజ్ ఆలం, అర్జున్ సైన్‌లు ప్రధాన సూత్రధారులని తేలింది. వారిద్దరూ అప్పటికే ఇదే తరహా కేసులో అరెస్టై చండీగఢ్ జైలులో ఉన్నట్లు తెలుసుకున్నారు. వారిని విచారించేందుకు సైబర్ పోలీసులు విశాఖ మొదటి ఏసీఎంఎం కోర్టు ద్వారా చండీగఢ్ జైలుకు పీటీ వారెంట్ ఫైల్ చేశారు. విశాఖ సైబర్ క్రైం పోలీసులు అక్కడకు వెళ్లి స్థానిక కోర్టులో ఇద్దరినీ హాజరుపరిచి విశాఖకు తీసుకువచ్చారు. విచారణలో పర్వేజ్ ఆలం వాస్తవాలను పోలీసులకు వివరించాడు. అమాయకులను బెదిరించి డబ్బులు వసూలు చేసినట్టు అంగీకరించాడు.

రికవరీ ఏజెంట్ నుంచి లీడర్‌గా ఎదిగి

ఏ1 అయిన పర్వేజ్ ఆలంకు 2019లో యులీజక్రి నుంచి డింగ్‌టాక్ అనే మెసేజ్ ద్వారా జాబ్ ఆఫర్ వచ్చింది. ముందు రికవరీ ఏజెంట్‌గా చేరి 5 ఐడీలతో లోన్ రికవరీ చేయడం ప్రారంభించాడు. 2020 మార్చిలో యులీజక్రీ ఇండియా నుంచి చైనా వెళ్లిపోయాడు. జక్రీ చైనాలో నడిపే పీసీ ఫైనాన్స్ అనే ఆన్‌లైన్ లోన్ అప్లికేషన్ వ్యవస్థలో పర్వేజ్ ఆలం సీనియర్ టీం లీడర్ స్థాయికి చేరుకొని సుమారు 60 లోన్ ఐడీలు ఆపరేట్ చేశాడు. పర్వేజ్ కింద ఉండే ఏడుగురు ఏజెంట్లలో అర్జున్ సైన్ ఒకడు. రికవరీ ఏజెంట్‌గా అర్జున్ సైన్ అమాయక ప్రజలను అసభ్యకర పదజాలంతో ఇబ్బందులు కలిగిస్తూ బాధితుల కుటుంబ సభ్యులకు, స్నేహితులకు అసభ్యకరమైన ఫోటోలను పంపుతూ బెదిరిస్తూ వారి నుంచి ఎక్కువ మొత్తంలో డబ్బులు రాబట్టేవాడు. ఏపీలోని విశాఖపట్నం, కృష్ణా జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో, తెలంగాణలోను వీరు చాలా మంది అమాయకులను బెదిరించి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు తెలుసుకున్నారు. విచారణలో వెల్లడైన విషయాల ప్రకారం ఇన్‌స్పెక్టర్ భవానిప్రసాద్ ఏపీలో పలు పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించారు. పర్వేజ్ ఆలం, అర్జున్ సైన్‌లను శుక్రవారం అరెస్టు చేశారు.

క్లుప్తంగా...

మా దృష్టిలో ఉంది

వీసా ఆలస్యంపై అమెరికా

వాషింగ్టన్: అమెరికా వీసా అపాయింట్‌మెంట్లకు భారత్‌లో విపరీతమైన డిమాండ్, చాంతాడంత వెయిటింగ్ నెలకొన్న ఉన్న విషయం తమ దృష్టిలో ఉందని వైట్‌హౌస్ పేర్కొంది. కొన్ని వీసా అపాయింట్‌మెంట్లకు ఏకంగా మూడేళ్ల దాకా వెయిటింగ్ ఉండటం తెలిసిందే. ''ఈ విపరీతమైన డిమాండ్‌ను తట్టుకునేందుకు, వెయిటింగ్‌కు తెర దించేందుకు ఎంతగానో ప్రయత్నిస్తున్నాం. రెట్టింపు సంఖ్యలో సిబ్బందిని నియమించుంటున్నాం'' అని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ జీన్ పియరీ మీడియాకు తెలిపారు. భారతీయుల వీసా ప్రాసెసింగ్ కాలావధి రెండు నుంచి నాలుగు వారాలకు మించకుండా ఉండేలా చూడాలని అధ్యక్షుడు జో బైడెన్‌కు ప్రెసిడెన్షియల్ కమిషన్ తాజాగా సిఫార్సు చేయడం తెలిసిందే.

ఇండోనేసియా బొగ్గు గని ప్రమాదంలో 10 మంది మృతి

జకార్తా: ఇండోనేసియా పశ్చిమ సుమత్రా ప్రావిన్స్‌లోని బొగ్గు గనిలో జరిగిన పేలుడులో 10 మంది కార్మికులు మరణించారు. మరో నలుగురిని సహాయ బృందం కాపాడింది. ఒక ప్రైవేటు కంపెనీకి చెందిన గనిలో ప్రమాదకరమైన మిథేన్ వంటి వాయువుల కారణంగానే పేలుడు సంభవించిందని అధికారులు వెల్లడించారు. విషవాయువులు పీల్చడం వల్ల కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. 800 అడుగుల పొడవున్న గని కావడంతో సహాయ చర్యలు కాస్త సంక్లిష్టంగా మారాయి. మరణించిన వారిలో ఎక్కువ మందికి కాలిన గాయాలతో పాటు ఊపిరి సమస్యలు తలెత్తడంతో ప్రాణాలు కోల్పోయారని స్థానిక అధికారులు చెప్పారు.

కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆప్‌లోకి

న్యూఢిల్లీ: ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఫలితాలు వెలువడిన కొద్ది రోజులకే కాంగ్రెస్‌కు షాక్ తగిలింది. కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ ఉపాధ్యక్షుడు అలీ మెహది, పార్టీ నుంచి కొత్తగా ఎన్నికైన ఇద్దరు కౌన్సిలర్లు సబిలా బేగం, నాజియా ఖాటూన్ శుక్రవారం ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పనితీరు నచ్చడం వల్లే వాళ్లు తాము ఆప్‌లో చేరాని నిర్ణయించుకున్నామని అలీ మెహది చెప్పారు. రాజధాని అభివృద్ధిలో తామూ భాగస్వామ్యులమవుతామన్నారు. కార్పొరేషన్ ఎన్నికలకు ఫిరాయింపుల నిరోధక చట్టం వర్తించదని ఆయన గుర్తు చేశారు.

త్రివిధ దళాల్లో 1.35 లక్షల సిబ్బంది కొరత

న్యూఢిల్లీ: త్రివిధ దళాలు 1.35 లక్షల మేర సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ శుక్రవారం లోక్‌సభలో వెల్లడించారు. భారత సైన్యంలో ప్రస్తుతం 1.18 లక్షల ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ 30 నాటికి భారత నావికాదళం(సెయిలర్స్)లో 11,587 మంది సిబ్బంది తక్కువగా ఉన్నారని చెప్పారు. సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. నవంబర్ 1 నాటికి వైమానిక దళంలో(ఎయిర్‌మెన్, నాన్–కాంబాటంట్) 5,819 మంది సిబ్బంది తక్కువగా ఉన్నారని వెల్లడించారు. జవాన్ల స్థాయిలో అన్ని నియామకాలను అగ్నిపథ్ పథకం కిందనే చేపడుతున్నట్లు చెప్పారు. ఆర్మీలో 40,000 పోస్టులు, నావికాదళంలో 3,000 పోస్టులు, ఎయిర్‌ఫోర్స్‌లో 3,000 పోస్టుల భర్తీకి ప్రకటన జారీ చేశామన్నారు. త్రివిధ దళాల్లో ప్రతిఏటా సగటున 60,000 ఖాళీలు ఏర్పడుతున్నాయని అజయ్ భట్ వెల్లడించారు.

వరుడి ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి...

రాజస్తాన్‌లో ఏడుగురి మృతి

జోద్‌పూర్: వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన బంధుమిత్రులతో కళకళలాడుతున్న ఇంట్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. వంట గ్యాస్ సిలిండర్ పేలడంతో ఏడుగురు మృత్యువాత పడ్డారు. 52 మంది గాయాలపాలయ్యారు. వీరిలో కొందరికి 80 శాతానికి పైగా గాయాలయ్యాయి. రాజస్తాన్ రాష్ట్రం జోద్‌పూర్ జిల్లా భూంగ్రా గ్రామంలో వరుడు సురేంద్ర సింగ్ ఇంట్లో గురువారం మధ్యాహ్నం ఈ సంఘటన జరిగింది. పేలుడు ధాటికి పెళ్లివారి ఇల్లు కొంతభాగం కూలిపోయిందని పోలీసులు చెప్పారు.

రాక్షసబల్లుల రారాజు



డస్‌ప్లెటొసరస్. మనకు ఇప్పటిదాకా తెలిసిన రాక్షసబల్లుల్లో అతి భయంకరమైన టీ రెక్స్ (టైరనోసార్ రెక్స్)లో కొత్త జాతి. టీ రెక్స్‌ను కూడా తలదన్నేంతటి భారీ శరీరం, కళ్ల పక్కగా మొలుచుకొచ్చిన కొమ్ములతో భీతిగొలిపేలా ఉండేదట. రాక్షసబల్లులకు రాజుగా చెప్పదగ్గ ఈ జీవి 7.6 కోట్ల ఏళ్ల కింద ఉత్తర అమెరికాలో స్వేచ్ఛావిహారం చేసేదట. మోంటానాకు ఈశాన్య ప్రాంతంలో దొరికిన పుర్రెలు తదితరాల శిలాజాల ఆధారంగా దీని ఉనికిని సైంటిస్టులు తాజాగా నిర్ధారించారు. ఇది బహుశా టీ రెక్స్‌కు అత్యంత పూర్వీకురాలు అయ్యుండొచ్చని వారంటున్నారు. పాత, కొత్త టీ రెక్స్ జాతుల మధ్య దీన్ని మిస్సింగ్ లింక్‌గా అభివర్ణిస్తున్నారు. ఏకంగా 12 మీటర్ల పొడవు, 4 మీటర్ల ఎత్తుండే టీ రెక్స్‌లు 6.8 కోట్ల నుంచి 6.6 కోట్ల ఏళ్ల క్రితం దాకా జీవించాయని చెబుతారు.

సూసైడ్ బాంబర్లుగా శునకాలు!

రష్యా వింత యోచన

మాస్కో: ఉక్రెయిన్‌పై యుద్ధంలో లక్ష మందికిపైగా సైనికుల్ని కోల్పోయిన రష్యా ఇక వీధి కుక్కలను కదనరంగంలోకి దించనుందా? వాటిని ఆత్మాహుతి బాంబర్లుగా మార్చి పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి ఉక్రెయిన్‌లో విధ్వంసానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోందా? రష్యా కమ్యూనిస్ట్ పార్టీ డిప్యూటీ చీఫ్ విక్టోర్ మకరోవ్ ప్రతిపాదనకు అంగీకారం లభిస్తే అదే జరిగేలా కన్పిస్తోంది. ''జంతువులను, ముఖ్యంగా వీధి కుక్కలను ఆత్మాహుతి బాంబర్లుగా మార్చి ఉక్రెయిన్ యుద్ధ ట్యాంకులను ఎక్కడికక్కడ పేల్చేయాలి. అప్పుడు మనకు సైనిక నష్టం తగ్గడమే గాక రష్యాలో వీధి కుక్కల సమస్య కూడా తీరిపోతుంది'' అంటూ ఆయన విచిత్ర ప్రతిపాదన చేశారు. అయితే ఇంతకన్నా చెత్త ఐడియా మరొకటి ఉండదంటూ సొంత పార్టీలోనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదేమీ కొత్త కాన్సెప్ట్ కాదు. రెండో ప్రపంచ యుద్ధ వేళ సోవియట్ యూనియన్ ఇలాగే ఆర్మీ జాగిలాల ద్వారా కనీసం 300కు పైగా జర్మనీ యుద్ధ ట్యాంకులను ధ్వంసం చేసింది! కానీ బాంబులను యుద్ధ ట్యాంకులపైకి విసిరేలా కుక్కలకు శిక్షణ శ్రమతో కూడిందే! ఇక కుక్కలను యుద్ధభూమికి పంపడమంటే రష్యా ఓటమిని ఒప్పుకున్నట్టేనంటూ అమెరికా తదితర దేశాలు ఎద్దేవా చేస్తున్నాయి. రష్యా సైనిక శక్తి నిండుకుంటోంది గనుకే ఇలాంటి ఆలోచనలు చేస్తోందంటూ వ్యంగ్య బాణాలు విసురుతున్నాయి!!



ఇంతకీ.. గెలిచింది ఎవరు!

దేశవ్యాప్త ఆదరణ ఏ పార్టీకీ లేదు
- మూడు రాష్ట్రాల తీర్పు చెప్పిందదే
- మోదీ ప్రభకూ పరిమితులున్నాయి
- కాంగ్రెస్‌కూ మురిసిపోవడానికేమీ లేదు
- ఆప్‌కూ అసలు సత్తా ఎంతో తెలిసొచ్చింది

ఎస్.రాజమహేంద్రారెడ్డి

మూడు రాష్ట్రాలు. మూడు ఎన్నికలు. మూడు పార్టీలు. మూడు విభిన్న తీర్పులు. మూడు ముక్కల్లో తాజాగా ముగిసిన గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సారాంశమిదే. దేశం మొత్తాన్నీ తనవైపు తిప్పుకునే సమ్మోహన శక్తి ఏ పార్టీకీ లేదని ఈ ఫలితాలు స్పష్టం చేశాయి. దేశాన్ని పాలిస్తున్న బీజేపీకి గానీ, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌కు గానీ, బీజేపీకి పోటీగా ఎదగాలని కలలుగంటున్న ఆప్‌కు గానీ అవి ఊహించుకుంటున్నంత బలం లేదని తేలిపోయింది. ఈ మూడు పార్టీలు ఎక్కడ గెలవాలన్నా, ఇంకేదో వాటికి అసంకల్పితంగా సహాయపడుతోంది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓ పార్టీగా నెగ్గలేదు. మోదీ ప్రధానిగా ఉండటం వల్ల మాత్రమే రికార్డు విజయాన్ని సాధించగలిగింది. ప్రధాని గుజరాతీ కావడం వల్లే ఆ రాష్ట్ర ప్రజలు ప్రభుత్వ వ్యతిరేకతను ఆసాంతం పక్కకు నెట్టేసి బీజేపీని అక్కున చేర్చుకున్నారు. ఇక హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచినా అది సొంత చరిష్మాతో అసలే కాదు. పాలక పక్షమైన బీజేపీపై గూడుకట్టుకుని ఉన్న వ్యతిరేకతను కాంగ్రెస్‌కు ఓటేయడం ద్వారా జనం బహిర్గతం చేశారు. ఇక ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ ఓటర్లు ఇలాగే స్పందించడంతో ఎంసీడీపై 15 ఏళ్ల బీజేపీ పెత్తనానికి తెర పడింది. అక్కడ కాంగ్రెస్ కన్నా ఆప్ మెరుగని ఓటర్లు భావించడంతో ఎంసీడీ కేజ్రీవాల్ పార్టీ వశమైంది. ఈ మూడు రాష్ట్రాల్లోనూ గెలిచిన పార్టీలకు సొంత బలానికి మించి అదనపు బలం వ్యతిరేక ఓటు ద్వారానో, ప్రాంతీయాభిమానం రూపేణో సమకూరింది. ఆ లెక్కన వాటివి అసంపూర్ణ విజయాలు మాత్రమే! గెలవలేదు, గెలిచామనిపించాయి!! మోదీ మ్యాజిక్‌ను నమ్ముకుని 2024లో ఏకంగా 400 ఎంపీ స్థానాలు కొల్లగొడతామని కలలుగంటున్న బీజేపీ పైకి ఏం చెబుతున్నా ఈ మూడు ఎన్నికల్లో సదరు మ్యాజిక్ ఒకే రాష్ట్రానికి, అదీ ఆయన స్వరాష్ట్రానికి మాత్రమే పరిమితమైందన్న వాస్తవం మింగుడుపడటం లేదు. తన మ్యాజిక్‌కూ పరిమితులున్నాయని మోదీకి కూడా ఈసరికే అర్థమై ఉంటుంది. కలెగూరగంప లాంటి తాజా ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎవరి పరిమితులేమిటో చూద్దాం...



ఆప్... అప్పుడే కాదు!



బీజేపీకి కంచుకోట అయిన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌ను బద్దలు కొట్టి 15 ఏళ్ల ఏకఛత్రాధిపత్యానికి తెర దించిన ఆమ్ ఆద్మీ పార్టీ గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం పూర్తిగా చతికిలపడింది. భారీ పథకాలు, తాయిలాలతో అట్టహాసంగా రాష్ట్ర ఎన్నికల బరిలో దిగిన ఆప్.. 'పహలే ఆప్' అంటూ ఏమాత్రం పోటీనివ్వకుండా బీజేపీకి దారిచ్చింది! పైగా కాంగ్రెస్ ఓట్లను భారీగా చీల్చి బీజేపీకి రికార్డు సంఖ్యలో స్థానాలు కట్టబెట్టింది. గుజరాత్‌లో సాధించిన ఓట్ల శాతం సాయంతో జాతీయ పార్టీ గుర్తింపు దక్కనుండటమే ఆప్‌కు ఏకైక ఊరట. బీజేపీకి ప్రత్యామ్నాయం తామేనంటూ పదేపదే చీపురు ఝళిపిస్తున్న ఆప్ నిజంగా ఆ స్థాయికి చేరాలంటే మరింత సమయం తప్పదని ఈ ఫలితాలు తేల్చి చెప్పాయి. ఇక హిమాచల్ ఎన్నికల్లోనైతే ఆప్ సోదిలో కూడా లేకుండానే పోయింది. ఓడినా అనుభవం దక్కిందని తృప్తి పడటమే ఆ పార్టీకి చివరికి మిగిలింది!

మోదీ.. తగ్గుతున్న మేజిక్



గుజరాత్‌ను సుదీర్ఘకాలం పాలించిన ముఖ్యమంత్రి. ప్రస్తుతం దేశాన్నేలుతున్న ప్రధాని. ప్రపంచ దృష్టిలో విశ్వగురు. అత్యధిక ప్రజాదరణ ఉన్న నేత. బీజేపీకి పెద్ద దిక్కు. ఒకరకంగా పార్టీకి ప్రస్తుతతం అన్నీ ఆయనే! ఎంతగా అంటే... బీజేపీ అంటే మోదీ, మోదీ అంటే బీజేపీ అనేంతగా!! వరుసగా రెండోసారి ప్రధాని పదవి చేపట్టాక మోదీ ద్విగుణీకృత ఆకర్షణ శక్తితో వెలిగిపోయినా ఆ శక్తి రాను రానూ సన్నగిల్లుతున్నట్టు కన్పిస్తోంది. తాజా ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే అది కొట్టొచ్చినట్టు కన్పిస్తుంది. ఒకవిధంగా మోదీ గ్రాఫ్ తగ్గడం నోట్ల రద్దు నిర్ణయంతోనే మొదలైంది. తర్వాత బడా కార్పొరేట్ దిగ్గజాల భారీ రుణాలను గుండుగుత్తగా మాఫీ చేయడం మొదలుకుని ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ దాకా ఆయన గ్రాఫ్ పడిపోతూనే ఉంది. మెజారిటీ లేని రాష్ట్రాల్లో బేరసారాలతో రాష్ట్ర ప్రభుత్వాలను బీజేపీ వశం చేయడం సాధారణ పౌరులకు కూడా మింగుడుపడని అంశం. ఎంసీడీలోనూ, హిమాచల్‌ప్రదేశ్‌లోనూ బీజేపీ అధికారాన్ని నిలబెట్టుకుని ఉంటే మోదీ గాలికి తిరుగులేదని బహుశా నిరూపితమయ్యేదేమో. కానీ జరిగింది మరొకటి. గుజరాత్‌లోనూ ఎన్నడూ లేనంతటి మెజారిటీ సాధించడం కచ్చితంగా మోదీకి ప్లస్ పాయింటే. అయితే అది మోదీ స్వరాష్ట్రం కావడం వల్లే ఆ ఘనత సాధ్యమైంది. ఆయన్ను తమ రాష్ట్ర ముద్దుబిడ్డగా గుజరాత్ ఓటర్లు భావించబట్టే ఆ స్థాయిలో అందలమెక్కించారు. మోదీ కాక మరో రాష్ట్ర నేత ఎవరైనా ప్రధానిగా ఉన్నట్టయితే గుజరాత్ ఫలితం మరోలా ఉండేదేమో! ఊహాజనితమే అయినా ఇది చర్చనీయాంశమే! గుజరాత్‌లో గెలిచింది నిస్సందేహంగా మోదీ మాత్రమే. బీజేపీ కేవలం ఆయన వెంట నడిచింది. అంతే! అదే సమయంలో ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో, హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో పాటు మోదీ కూడా ఓడారన్నది కాదనలేని వాస్తవం!


బీజేపీ.. మోదీపైనే భారం



కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీగా అన్ని రాష్ట్రాల్లోనూ కాషాయ జెండా ఎగరేయాలని ఉవ్విళ్లూరుతున్న బీజేపీకి హిమాచల్ ఓటమి మింగుడుపడనిదే. ఈ ఫలితంతో బీజేపీ అధికారం 16 రాష్ట్రాలకే పరిమితమైంది. వీటిలో సొంతంగా 10 రాష్ట్రాల్లో, సంకీర్ణంతో మిగతా ఆరుచోట్ల అధికారంలో ఉంది. డబుల్ ఇంజన్ (కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే పార్టీ అధికారంలో ఉండటం) నినాదంతో దేశాన్ని హోరెత్తిస్తున్న బీజేపీకి హిమాచల్‌లో ఒక ఇంజన్ పట్టాలు తప్పడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదు. అక్కడ కేవలం ఒక శాతం ఓటు తేడాతోనే ఓడామని మోదీ సరిపుచ్చుకునే ప్రయత్నం చేసినా ఓటమి ఓటమే కదా! పైగా హిమాచల్‌లో కాంగ్రెస్ ముమ్మరంగా ప్రచారం కూడా చేయకపోయినా విజయం ఆ పార్టీనే వరించడం బీజేపీపై అక్కడి ప్రజలకున్న వ్యతిరేకతకు అద్దం పడుతుంది. స్థానికుల్లో తీవ్ర ఆందోళనకు కారణమైన అగ్నిపథ్, వన్ ర్యాంక్–వన్ పెన్షన్ పథకం వంటివాటిపై బీజేపీ దృష్టి పెట్టకపోవడం, కేవలం మోదీ మ్యాజిక్ మీదే మితిమీరిన నమ్మకం పెట్టుకోవడం ఓటమికి దారితీశాయి. ఈ అసెంబ్లీ ఎన్నికలతో పాటే జరిగిన ఒక లోక్‌సభ, ఆరు అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల్లో బీజేపీ కేవలం రెండు అసెంబ్లీ సీట్లలో మాత్రమే నెగ్గింది. ఆ పార్టీ ప్రాభవం తగ్గుతోందనేందుకు ఇదీ సూచికే. ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురి లోక్‌సభ, కతౌలీ అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ ఘోరంగా ఓడటం గమనార్హం. మెయిన్‌పురితో సమాజ్‌వాదీ అభ్యర్థి, పార్టీ చీఫ్ అఖిలేశ్‌యాదవ్ భార్య డింపుల్ యాదవ్ ఏకంగా 2.88 లక్షల ఓట్ల మెజారిటీ సాధించడం మరో విశేషం. 2024 లోక్‌సభ ఎన్నికల్లోగా బీజేపీ సంస్థాగతంగా మరింత పట్టు సాధించకుంటే పరిస్థితి ఇంకా ఆందోళనకరంగా తయారవడం ఖాయం. లేదంటే మోదీనే నమ్ముకుని గుజరాత్ వంటి విజయాల కోసం ఎదురుచూపులు చూడాల్సి వస్తుంది.

కాంగ్రెస్... అదే అయోమయం

ఈ పార్టీ గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. హిమాచల్‌లో గట్టెక్కినా అది సొంతం బలంతో కాదని కాంగ్రెస్‌కూ తెలుసు. గుజరాత్‌లో, ఢిల్లీ కార్పొరేషన్లో పార్టీ కనీస స్థాయి పోటీ కూడా ఇవ్వలేకపోయింది. ఆప్ దెబ్బకు గుజరాత్‌లో ముక్కోణపు పోరులో పూర్తిగా మునిగింది. కోలుకునే పరిస్థితి సుదూరంలోనూ కన్పించడం లేదు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రతో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒరిగిందేమీ లేదు. గుజరాత్‌పైనే దృష్టి పెట్టిన కాంగ్రెస్, హిమాచల్‌లో సరైన ప్రచారం కూడా చేయలేదు. ప్రియాంకా గాంధీ అదపాదడపా పర్యటనలతో మమ అనిపించారు. రాహుల్ ఆవైపు కన్నెత్తి కూడా చూడలేదు. అయినా బీజేపీ వైఫల్యానికి తోడు, ఆప్ ప్రభావం చూపలేకపోవడంతో కాంగ్రెస్‌ను విజయం తనంతతానుగా వరించింది. కష్టించి సాధించినది కాదు.



జీ–20 సారథ్యం.. విశిష్ట అవకాశం: మోదీ

న్యూఢిల్లీ: జీ–20 సారథ్యం దక్కడం భారత్‌కు ఒక విశిష్టమైన అవకాశమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. మన బలాన్ని ప్రపంచ దేశాలకు చాటడానికి ఈ అవకాశాన్ని వాడుకోవాలని సూచించారు. ఆయన శుక్రవారం రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. జీ–20 సారథ్యానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. దేశంలో జీ–20 కార్యక్రమాల నిర్వహణకు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు సహకరించాలని కోరారు. కార్యక్రమాలను విజయవంతం చేయడంలో టీమ్ వర్క్ కీలకమన్నారు.

ప్రజలను భాగస్వాములను చేయాలి

కేవలం మెట్రో రైళ్ల లాంటి పెద్ద ప్రాజెక్టులు కాకుండా మన దేశ సంస్కృతీ సంప్రదాయాలను, మారుమూల ప్రాంతాల్లోని భిన్నత్వాన్ని, విశిష్టతను ప్రపంచానికి చూపించడానికి జీ–20 సారథ్యం దోహదపడుతుందని ప్రధాని మోదీ చెప్పారు. ప్రతి ప్రాంతం గొప్పదనాన్ని తెలియజేయాలని అన్నారు. జీ–20 కార్యక్రమాల్లో పాల్గొనడానికి విదేశాల నుంచి భారీ సంఖ్యలో సందర్శకులు రాబోతున్నారని తెలిపారు. అంతర్జాతీయ మీడియా దృష్టి మన దేశంపై ఉంటుందని అన్నారు.

'ఉమ్మడి స్మృతి'పై రాజ్యసభలో ప్రైవేట్ బిల్లు

- ప్రవేశపెట్టిన బీజేపీ సభ్యుడు మీనా
- తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చిన విపక్షాలు
- బిల్లుకు అనుకూలంగా ఓటింగ్ ఫలితం

న్యూఢిల్లీ: ఉమ్మడి పౌరస్మృతిని సిద్ధం చేసేందుకు ఓ ప్యానల్ ఏర్పాటు చేయాలని కోరుతూ వివాదాస్పద ప్రైవేట్ మెంబర్ బిల్లు శుక్రవారం రాజ్యసభ ముందుకొచ్చింది. విపక్ష సభ్యుల తీవ్ర అభ్యంతరాల మధ్య బీజేపీ ఎంపీ కిరోడీలాల్ మీనా దీన్ని ప్రవేశపెట్టారు. కాంగ్రెస్‌తో పాటు తృణమూల్ కాంగ్రెస్, ఎన్సీపీ, డీఎంకే, సమాజ్‌వాదీ, సీపీఎం, సీపీఐ, ఆర్జేడీ తదితర విపక్షాలు బిల్లును తీవ్రంగా వ్యతిరేకించాయి. ఉమ్మడి స్మృతి దేశ సామాజిక నిర్మాణాన్ని నాశనం చేస్తుందంటూ ఆందోళన వెలిబుచ్చాయి. ''ఆరెస్సెస్ అజెండాను అమలు చేసేందుకు పాలక బీజేపీ ప్రయత్నిస్తోంది. కశ్మీర్ అంశాన్ని ముగించేశారు. ఇప్పుడిక ఉమ్మడి స్మృతిపై పడ్డారు. ఈ బిల్లు పూర్తిగా అనైతికం. ప్రజా వ్యతిరేకం. రాజ్యాంగవిరుద్ధం. దీన్ని తక్షణం ఉపసంహరించాలి'' అంటూ విపక్ష సభ్యులు ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. దాంతో చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఓటింగ్ నిర్వహించారు. 63–23 తేడాతో బిల్లును ప్రవేశపెట్టడానికి ఆమోదం లభించింది. అనంతరం రాజ్యసభ నాయకుడు పీయూష్ గోయల్ మాట్లాడుతూ విపక్షాల అభ్యంతరాలు, ఆరోపణలను తోసిపుచ్చారు. ''ఏ అంశాన్నైనా లేవనెత్తడం సభ్యుని హక్కు. ఉమ్మడి స్మృతిపై సభలో చర్చ జరగనిద్దాం'' అని సూచించారు. ఉమ్మడి స్మృతిపై గతంలోనే బిల్లును లిస్ట్ చేసినా సభ దాకా రాలేదు.

గవర్నర్ పాత్రపై సీపీఎం బిల్లు

గవర్నర్ పాత్ర, అధికారులు, విధులను స్పష్టంగా నిర్వచిస్తూ రాజ్యాంగాన్ని సవరించాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ ఎంపీ వి.సదాశివన్ రాజ్యసభలో ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టారు. రాష్ట్రాల్లో తన అజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు గవర్నర్ల వ్యవస్థను కేంద్రం దారుణంగా దుర్వినియోగం చేస్తోందని ఈ సందర్భంగా ఆయన ఆరోపించారు. ''చరిత్రే ఇందుకు సాక్ష్యం. గవర్నర్ పదవి వలస పాలన సమయంలో భారతీయులను అణచేసేందుకు సృష్టించినది. గవర్నర్లు చాలావరకు ఇప్పటికీ అదే వలసవాద భావజాలంతో పని చేస్తున్నారు'' అని విమర్శించారు. గవర్నర్‌ను కేంద్రమే నియమించేట్టయితే సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రికి మూడు పేర్లు ప్రతిపాదించి ఆయన సూచన మేరకు నడచుకోవాలన్నారు.

గుజరాత్‌కు బీజేపీ కేంద్ర పరిశీలకులు

న్యూఢిల్లీ/అహ్మదాబాద్: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన బీజేపీ ఇక నూతన ముఖ్యమంత్రి ఎంపికపై దృష్టి సారించింది. తాజా ఎన్నికల్లో గెలుపొందిన బీజేపీ ఎమ్మెల్యేలు శనివారం ఉదయం గాంధీనగర్‌లో సమావేశమై, తమ పార్టీ శాసనసభా పక్ష(సీఎల్పీ) నేతను ఎన్నుకోనున్నారు. ఈ ప్రక్రియను పూర్తిచేయడానికి కేంద్ర పరిశీలకులుగా సీనియర్ నేతలు రాజ్‌నాథ్ సింగ్, బీఎస్ యడియూరప్ప, అర్జున్ ముండాను బీజేపీ అధిష్టానం నియమించింది. సీఎల్పీ నేత ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా భూపేంద్ర పటేల్ కొనసాగుతారని బీజేపీ అధిష్టానం గతంలోనే ప్రకటించింది.

భూపేంద్ర పటేల్ రాజీనామా

గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు అందజేశారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు వీలుగా ఆయన మంత్రివర్గం సైతం రాజీనామా సమర్పించింది. బీజేపీ నిర్ణయం ప్రకారం.. భూపేంద్ర పటేల్ ఈ నెల 12వ తేదీన సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోపాటు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరవుతారు.

సీఎం పీఠం మా నేతకే..

హిమాచల్‌లో ఆశావహుల మద్దతుదారుల డిమాండ్

సిమ్లా/న్యూఢిల్లీ: హిమాచల్ ప్రదేశ్‌లో కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకోవడానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు శుక్రవారం సమావేశమయ్యారు. సీఎం అభ్యర్థిని ఎంపిక చేసే బాధ్యతను ఏఐసీసీ అధ్యక్షుడికి కట్టబెడుతూ ఈ భేటీలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. పార్టీ కేంద్ర పరిశీలకులుగా ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బఘేల్, హరియాణా మాజీ సీఎం భూపీందర్‌సింగ్ హుడా వచ్చారు. హిమాచల్‌లో తదుపరి ముఖ్యమంత్రి రేసులో ప్రతిభా సింగ్, ముకేశ్‌సింగ్ అగ్నిహోత్రి, సుఖ్వీందర్ సింగ్ సుఖు ముందంజలో ఉన్నారు. సీఎల్పీ సమావేశంలో పాల్గొనేందుకు వారు తమ మద్దతుదారులతో కలిసి పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. మరోవైపు కేంద్ర పరిశీలకులు రాష్ట్ర గవర్నర్‌ను కలిశారు. నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ ఎమ్మెల్యేల జాబితాను అందజేశారు. ప్రభుత్వాన్ని ఏర్పాటుకు గడువు కోరారు.

అమ్మాయిల కనీస వివాహ వయసు ఎంత?

కేంద్రం వైఖరి కోరిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: మతంతో సంబంధం లేకుండా అమ్మాయిల వివాహ వయసులో ఏకరూపత ఉండాలని జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వ వైఖరి తెలపాలని సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. అమ్మాయి రజస్వల అయితే పెళ్లి చేసేయడానికి ముస్లిం మతాచారాలు అనుమతిస్తున్నాయని, ఇది పోస్కో చట్టానికి, ఐపీసీకి విరుద్ధమని మహిళా కమిషన్ పేర్కొంది. మతాలతో సంబంధం లేకుండా అమ్మాయిలకు 18 ఏళ్లు కనీస వివాహ వయసుగా నిర్ణయించాలని అభ్యర్థించింది. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన కోర్టు కేంద్ర ప్రభుత్వ వైఖరి తెలుపాలంటూ నోటీసులు జారీచేసింది. ముస్లిం పర్సనల్ లా అమ్మాయి రజస్వల అయితే వివాహం చేయడానికి అర్హురాలేనని పేర్కొంటోందని, మిగతా మతాల పర్సనల్ లాల్లో మాత్రం 18 ఏళ్ల కనీస వివాహ వయసుందని మహిళా కమిషన్ పేర్కొంది.



కాంగ్రెస్ నేత సోనియా గాంధీ శుక్రవారం 76వ పుట్టినరోజు జరుపుకున్నారు. కుమారుడు రాహుల్, కుమార్తె ప్రియాంకాతో కలిసి రాజస్తాన్‌లోని రణథంబోర్ నేషనల్ పార్కులో విహరించారు. రాజస్తాన్‌లో భారత్ జోడో యాత్రలో పాల్గొంటున్న రాహుల్ శుక్రవారం విరామం తీసుకున్నారు.

కొలీజియం తీర్మానాలు బయటపెట్టలేం

సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ
- సమాచార హక్కు చట్టం కింద వివరాలు ఇవ్వలేం
- కేవలం తుది నిర్ణయాలనే బహిర్గతం చేస్తాం
- సభ్యులంతా సంతకాలు చేస్తేనే తుది నిర్ణయాలు ఖరారవుతాయ్



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకం కోసం ఉద్దేశించిన కొలీజియం సమావేశం వివరాలు, తీర్మానాలను బహిర్గతం చేయడం సాధ్యం కాదని సుప్రీంకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. 2017 అక్టోబర్ 3న చేసిన తీర్మానం ప్రకారం.. కొలీజియం చర్చల, తీర్మానాల వివరాలను బయటపెట్టలేమని తెలిపింది. తుది నిర్ణయాన్ని మాత్రమే సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని వివరించింది. 2018 డిసెంబర్ 12న కొలీజియం భేటీలో తీసుకున్న నిర్ణయాలను సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కింద ఇవ్వాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాన్ని తోసిపుచ్చింది. కొలీజియం అనేది బహుళ సభ్యులతో కూడిన ఒక వ్యవస్థ అని, కొలీజియం చర్చించిన విషయాలను, చేసిన తీర్మానాలను ప్రజాబాహుళ్యంలోకి తీసుకురాలేమని, సమాచార హక్కు చట్టం కింద ఇవ్వలేమని స్పష్టం చేసింది. కొలీజియంలోని సభ్యులంతా చర్చించుకొని సంతకాలు చేస్తేనే తీర్మానాలు తుది నిర్ణయాలుగా మారుతాయని, అలాంటి వాటినే బయటపెట్టగలమని వివరించింది.

తీర్మానాలే ఫైనల్ కాదు

2018 డిసెంబర్ 12 నాటి కొలీజియం సమావేశం అజెండా వివరాలు ఇవ్వాలని కోరుతూ ఆర్టీఐ కార్యకర్త అంజలి భరద్వాజ్ తొలుత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషన్‌కు విచారణార్హత లేదని తేల్చిచెప్పింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ అంజలి భరద్వాజ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సీటీ రవికుమార్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ కొనసాగిస్తోంది. పిటిషన్‌ను శుక్రవారం తోసిపుచ్చింది. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. కొలీజియం భేటీలో సంప్రదింపుల కోసం చేసే తీర్మానాలు ఫైనల్ అని చెప్పలేమని తెలిపింది. తీర్మానాలపై సభ్యులంతా చర్చించుకొని సంతకాలు చేసే దాకా అవి అస్థిర నిర్ణయాలేనని పేర్కొంది. అందరూ సంతకాలు చేస్తేనే నిర్ణయాలు ఖరారవుతాయని వెల్లడించింది. అంటే కొలీజియం వ్యవస్థలోని సభ్యులందరి ఆమోదం ఉంటేనే తీర్మానాలు నిర్ణయాలవుతాయని వివరించింది. కొలీజియం విషయంలో మీడియాలో వచ్చే రిపోర్టులను విశ్వసించలేమని, ఇదే వ్యవస్థలో పనిచేసిన మాజీ సభ్యుడి ఇంటర్వ్యూను పట్టించుకోలేమని ధర్మాసనం ఉద్ఘాటించింది. కొలీజియం పనితీరు పట్ల మాజీ జడ్జి ఇచ్చిన స్టేట్‌మెంట్లపై తాము మాట్లాడదలచుకోలేదని వ్యాఖ్యానించింది. 2018 డిసెంబర్ 12న అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని కొలీజియం సమావేశమయ్యింది. పలువురిని సుప్రీంకోర్టు జడ్జిలుగా నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. అలాగే పలు హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తులను బదిలీ చేయాలన్న ప్రతిపాదనపై చర్చించి, తీర్మానాలు చేసింది. అయితే, ఈ తీర్మానాలు, నిర్ణయాలను సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయలేదు. 2019 జనవరి 10న జస్టిస్ మదన్ బి.లోకూర్ పదవీ విరమణ సందర్భంగా కొలీజియం మరో నిర్ణయం తీసుకుంది. జస్టిస్ దినేశ్ మహేశ్వరి, జస్టిస్ సంజీవ్ ఖన్నాకు పదోన్నతి కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. 2018 డిసెంబర్ 12 నాటి భేటీలో కేవలం ప్రతిపాదనలపై చర్చించామని, వాటిని ఫైనలైజ్ చేయలేదని పేర్కొంది.

అది మనకు పరాయి వ్యవస్థ: కిరణ్ రిజిజు

కొలీజియం విషయంలో కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు నడుమ వివాదం కొనసాగుతున్న సంగతి విదితమే. ఈ వ్యవస్థను ప్రభుత్వం తప్పుపడుతోంది. కొలీజియం అనేది మనకు పరాయి వ్యవస్థ అని కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇటీవలే ఆక్షేపించారు. అయితే, కేంద్ర మంత్రి వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తిప్పి కొట్టింది. కొలీజియం పూర్తి పారదర్శకంగా పనిచేస్తోందని, అనవసర వ్యాఖ్యలతో దాన్ని పట్టాలు తప్పించవద్దని హితవు పలికింది.

సాక్షి
విజయనగరం

శనివారం । 10 । డిసెంబర్ । 2022



విజయనగరం క్రీడాకారుల సత్తా

సీఎం ప్రైజ్‌మనీ కప్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజయనగరం క్రీడాకారులు సత్తా చూపారు. విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు.

- 8లో

అగ్నిగుండం తొక్కిన భవానీలు

జామి: జామి మండల కేంద్రంలోని పైడితల్లమ్మ ఆలయంలో అర్చకుడు వి.సాయికిరణ్‌శర్మ ఆధ్వర్యంలో గురువారం రాత్రి భవానీ భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. శూలధారణ, కంకణధారణ అనంతరం అగ్నిగుండం తొక్కారు.



తుఫాన్‌పై రైతన్న అలర్ట్

బొబ్బిలి: మాండూస్ తుఫాన్ వర్షాలు శుక్రవారం సాయంత్రం నుంచి ప్రారంభమయ్యాయి. తుఫాన్ హెచ్చరికలతో రైతులు అప్రమత్తమయ్యారు. కొన్ని చోట్ల కోతలు వాయిదా వేశారు. నూర్పిడి చేసిన ధాన్యం బస్తాలను గడ్డి, టార్పాలిన్లతో కప్పి భద్రపరిచారు. బొబ్బిలి డివిజన్‌లో 40,230 ఎకరాల్లో వరి పంటను సాగుచేశారు. చాలాచోట్ల కోసిన వరిచేలను కుప్పలుగా వేయగా మరికొన్ని ప్రాంతాల్లో కళ్లాలకు తరలించి భద్రపరచుకున్నారు.

న్యూస్‌రీల్

పొడగరికి పెళ్లి



పెళ్లికుమార్తె మౌనికతో పొడగరి పెళ్లికొడుకు షన్ముఖరావు

రాజాం: సంతకవిటి మండలం తలతంపర గ్రామానికి చెందిన ఇజ్జాడ షన్ముఖరావు ఏడు అడుగుల పొడవుతో రాష్ట్రంలోనే పొడగరిగా పేరు పొందాడు. ఆయనకు గురువారం రాత్రి పలాస మండలం కాపురౌతుపురం గ్రామానికి చెందిన మౌనిక (5.8 అడుగుల ఎత్తు) అనే యువతితో వివాహం జరిగింది. యువకుడి వివాహాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

పులి అలజడి



కొవ్వాడపేట గ్రామంలో పులివిగా అనుమానిస్తున్న పాదముద్రలు

బొండపల్లి/సీతానగరం: మళ్లీ పులి సంచార వార్తలు అలజడి రేపుతున్నాయి. బొండపల్లి మండలంలోని వెదురువాడ పంచాయతీ పరిధిలోని వెదురువాడ, కొవ్వాడపేట తదితర గ్రామాల్లో పులి పాదముద్రలు కనిపించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పాదముద్రలును అటవీశాఖ అధికారులు ధృవీకరించాల్సి ఉంది.

- సీతానగరం మండలంలోని తామరఖండి పంచాయతీ రేపటివలస–పెదబోగిలి పంచాయతీ అప్పయ్యపేట గ్రామాల మధ్య పెద్దపులి సంచరిస్తూ రైతులకు కనిపించిందన్న వార్తతో ఆ ప్రాంతీయులు భయపడుతున్నారు. పొలానికి ట్రాక్టర్‌తో గెత్తం తరలిస్తుండగా రోడ్డుకు అడ్డంగా ఉన్న పులిని చూసినట్టు రైతులు చెబుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ ఎన్వీ రమణ మాట్లాడుతూ అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చామని, అప్పయ్యపేట, రేపటివలస గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని వీఆర్వోలను ఆదేశించామన్నారు. ఎస్‌ఐ కె. నీలకంఠం మాట్లాడుతూ సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు.

ఆపద మిత్రల సేవలు భేష్

- రెండోదఫా ఆపదమిత్ర శిక్షణలో జెడ్పీ సీఈఓ



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ అశోక్‌కుమార్

విజయనగరం అర్బన్: ప్రకృతి విపత్తులు, అగ్ని ప్రమాదాలు, కరోనా బాధితులకు ఆపదమిత్రలు అందిస్తున్న సేవలు అనిర్వచనీయమైనవని జెడ్పీ సీఈఓ డాక్టర్ ఎం.అశోక్‌కుమార్ పేర్కొన్నారు. విజయనగరం యూత్ హాస్టల్ వేదికగా ఆపద మిత్రలకు రెండోవిడత శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. జిల్లాలో 10 వేల మంది ఔత్సాహికులు ఉండగా అత్యంత ఆసక్తి కలిగిన 100 మందిని రెండో దఫా శిక్షణకు ఎంపిక చేశామని గుర్తుచేశారు. 12 రోజుల పాటు ఇచ్చే శిక్షణను మనసుపెట్టి నేర్చుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్, ఆపద మిత్ర శిక్షణ విభాగం మేనేజర్ దేముడు, ఎన్‌డీఆర్‌ఎస్, ఎస్‌డీఆర్‌ఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య సేవలపై ఆరా

గజపతినగరం: మరుపల్లి పీహెచ్‌సీ పరిధిలోని హెల్త్‌వెల్‌నెస్ సెంటర్లలో అందుతున్న వైద్యసేవలపై వరల్డ్ బ్యాంకు బృందం ప్రతినిధి అదిల్ గామెల్ ఆరా తీశారు. జిన్నాం, గంగచోళ్లపెంట గ్రామాల్లోని హెల్త్‌వెల్‌నెస్ సెంటర్లను శుక్రవారం పరిశీలించారు. వైద్య పరీక్షలు, అందజేస్తున్న మందులు, ఓపీ రికార్డులను తనిఖీ చేశారు. ప్రజలకు సకాలంలో సేవలు అందుతున్నదీ లేనిదీ గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

● ఫిట్ ఇండియా..



చీపురుపల్లి మండలంలోని పెదనడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'ఫిట్ ఇండియా స్కూల్ వీక్- 2022' కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఫిట్ ఇండియా కార్యక్రమం ఆవశ్యకతను తెలియజేస్తూ విద్యార్థులు అక్షరచైతన్యం కలిగించారు. క్విజ్, వ్యాసరచన, పోస్టర్ మేకింగ్, స్పోర్ట్స్‌డే తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్.కె.రెహనాబేగం ఆధ్వర్యంలో సాగిన కార్యక్రమంలో పీడీ ఎం.రామారావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. – చీపురుపల్లి రూరల్

అతివల ఆర్థిక పరిపుష్టికి

వైఎస్సార్ ఆసరా

- మూడో విడత వైఎస్సార్ ఆసరా విడుదలకు కసరత్తు
- క్షేత్రస్థాయిలో అర్హుల గుర్తింపునకు బయోమెట్రిక్
- 2019 ఏప్రిల్‌కు ముందు బ్యాంకు రుణాలు పొందిన సంఘాలకు లబ్ధి
- తొలివిడత 31,029 మహిళా సంఘాలకు రూ.231.11 కోట్లు జమ
- రెండోవిడతలో 31,070 మహిళా సంఘాలకు రూ.213.83 కోట్ల ప్రయోజనం



పూసపాటిరేగ మండలంలో మూడోవిడత వైఎస్సార్ ఆసరా అర్హుల నుంచి బయోమెట్రిక్ సేకరిస్తున్న వెలుగు సిబ్బంది

విజయనగరం అర్బన్:

రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలు ఆర్థికంగా ఎదగాలి.. కుటుంబానికి అండగా నిలవాలన్న ఉద్దేశంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోంది. విరివిగా రుణాలు మంజూరు చేయిస్తోంది. ఆర్థిక ప్రోత్సాహం అందిస్తూ చిరువ్యాపారాలను ప్రోత్సహిస్తోంది. గ్రామీణ, పట్టణ మహిళల ఆర్థిక ఉన్నతికి పాటుపడుతోంది. ఇందులో భాగంగానే 2019, ఏప్రిల్ 11 నాటికి పొదుపు సంఘాలు తీసుకున్న రుణాల మొత్తాన్ని నాలుగు విడతల్లో సభ్యుల ఖాతాలకు జమ చేస్తామని ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అప్పట్లో హామీ ఇచ్చారు. ఆ మేరకు ఇప్పటికే రెండు విడతల్లో సొమ్ము జమచేశారు. మూడో విడతలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చురుగ్గా నిర్వహిస్తున్నారు. అర్హులైన సభ్యుల నుంచి వేలిముద్రలు సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియను శనివారం (ఈ నెల10) లోగా పూర్తిచేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

రెండు విడతల ఆసరా రుణమాఫీ ఇలా..

తొలి విడత ఆసరా ద్వారా 2020 నవంబర్ 9న జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన 31,029 మహిళా సంఘాలకు చెందిన సభ్యులకు రూ. 213.11 కోట్ల సొమ్మును నేరుగా పొదుపు సంఘాల సభ్యుల ఖాతాలో ప్రభుత్వం జమచేసింది. రెండో విడత 'వైఎస్సార్ ఆసరా' పథకం సొమ్మును గత ఏడాది అక్టోబర్ 7వ తేదీన ఒంగోలులో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. విజయనగరం జిల్లాలోని 31,070 సంఘాలకు చెందిన పొదుపు మహిళలకు రూ.213.84 కోట్ల సొమ్మును పొదుపు సంఘాల సభ్యుల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేశారు. తాజాగా మూడో విడత రుణాల మాఫీ ప్రక్రియకు రంగం సిద్ధం చేస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా రెండువిడతల్లో వైఎస్సార్ ఆసరా రుణమాఫీ ఇలా..

నియోజకవర్గం	మొదటి విడత ఆసరా లబ్ధి		రెండో విడత ఆసరా లబ్ధి	
	సంఘాలు	రుణ మాఫీ సొమ్ము (రూ.కోట్లలో)	సంఘాలు	రుణ మాఫీ సొమ్ము (రూ.కోట్లలో)
బొబ్బిలి	4,431	23.59	4,430	23.70
చీపురుపల్లి	5,050	38.60	5,051	38.64
గజపతినగరం	5,911	38.68	5,914	38.72
నెల్లిమర్ల	4,902	38.42	4,902	38.45
రాజాం	4,475	34.08	4,508	34.57
సాలూరు (మెంటాడ)	785	3.76	788	3.78
ఎస్.కోట	4,681	30.83	4,683	30.83
విజయనగరం	794	5.15	794	5.15
మొత్తం	31,029	213.11	31,070	213.84

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోంది. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. ప్రతీ మహిళా ఆర్థికంగా ఎదగాలి. ప్రభుత్వం ఇస్తున్న నగదు సాయానికి, మరికొంత రుణాన్ని తీసుకొని స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటుచేయాలి. చిన్నచిన్న పరిశ్రమలను ఏర్పాటుచేసి మహిళా పారిశ్రామిక వేత్తలుగా అభివృద్ధి చెందాలి. జిల్లా యంత్రాంగం తరపున అన్నివిధాలా సంపూర్ణ సహకారం అందిస్తాం. – ఎ.కల్యాణచక్రవర్తి, పీడీ, డీఆర్‌డీఏ

సఖి గ్రూపులతో సామాజిక మార్పు

- కలెక్టర్ సూర్యకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం ఫోర్ట్: సఖి గ్రూపులకు వివిధ అంశాలపై సంపూర్ణ అవగాహన కల్పించడం ద్వారా సామాజిక మార్పు తెచ్చేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూర్యకుమారి పిలుపునిచ్చారు. విజయనగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆరోగ్యం, పౌష్టికాహారం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, నడవడిక, విద్య, ఉపాధి, వ్యక్తిగత రక్షణ, వివిధ రకాల చట్టాలపై అవగాహన కల్పించేందుకు సఖిగ్రూపులు ఒక చక్కని వేదిక అని అభివర్ణించారు. ప్రస్తుత సమాజంలో బాలికలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారమార్గాలు చూపేందుకు వర్క్‌షాపులు దోహదపడతాయని పేర్కొన్నారు. ఒకే వయసు ఉన్న వారందరినీ ఒక గ్రూపుగా ఏర్పాటు చేయడం ద్వారా వారి వ్యక్తిగత సమస్యలు బయటకుచెప్పుకునే అవకాశం కలుగుతుందన్నారు. కేవలం వైద్యం, ఇంజినీరింగ్ మాత్రమే విద్య కాదని, విస్తృతంగా ఉన్న విద్యావకాశాలను వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి, ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి, యునెసెఫ్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ శ్రీలత, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి రామేశ్వరిప్రభ తదితరులు పాల్గొన్నారు.

ఐసీటీసీ లేబొరేటరీ సిబ్బంది నిర్లక్ష్యం..!

- హెచ్‌ఐవీలేని గర్భిణికి ఉన్నట్టు రిపోర్టు ఇచ్చిన వైనం
- ఆ రిపోర్టు ఆధారంగా ఏఆర్‌టీలోనూ రిజిస్ట్రేషన్
- విషయాన్ని బయటకు పొక్కనీయని వైద్యాధికారులు
- కలెక్టర్, డీఎంహెచ్‌ఓ, డీసీహెచ్‌ఎస్‌లకు ఫిర్యాదు చేసిన బాధితురాలు



ఐసీటీసీ లేబొరేటరీ

విజయనగరం ఫోర్ట్: ఎటువంటి అనారోగ్యం లేని ఓ గర్భిణికి ఐసీటీసీ ల్యాబొరేటరీ సిబ్బంది హెచ్‌ఐవీ ఉన్నట్టు రిపోర్టు ఇచ్చారు. ఆమెను ఆందోళనకు గురిచేశారు. మరోవైపు మందులు తీసుకోవాలంటూ ఏఆర్‌టీ కేంద్రంలో ఆమె పేరును రిజిస్ట్రేషన్ కూడా చేసేశారు. బాధితురాలి ఫిర్యాదుతో అసలు విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే... గంట్యాడ మండలానికి చెందిన ఓ గర్భిణి ఈ నెల ఒకటో తేదీన వైద్యపరీక్షలకు ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి వెళ్లింది. వైద్యులు ఆమెకు మిగతా వైద్య పరీక్షలతో పాటు హెచ్‌ఐవీ పరీక్ష కూడా చేయించుకోవాలని చీటీరాసి ఇచ్చారు. అది పట్టుకుని ఆస్పత్రిలోని ఐసీటీసీ ల్యాబ్‌కు వెళ్లింది. అక్కడి సిబ్బంది పరీక్షలు చేసి గర్భిణికి హెచ్‌ఐవీ ఉన్నట్టు రిపోర్టు ఇచ్చారు. దీంతో ఆమె మానసిక ఆందోళనకు గురైంది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఈ నెల 2న విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గర్భిణికి హెచ్‌ఐవీ పరీక్ష చేయించగా అక్కడ నెగిటివ్ (హెచ్‌ఐవీ లేదని) రిపోర్టు వచ్చింది. మరోసారి నిర్ధారణ కొరకు ఈ నెల 3న ఘోషాస్పత్రిలో గర్భిణికి మళ్లీ హెచ్‌ఐవి పరీక్షలు చేయించారు. అక్కడ కూడా హెచ్‌ఐవీ లేదని నిర్ధారణ అయింది. దీంతో గర్భిణి కుటుంబ సభ్యులు ఎస్.కోట ఏరియా ఆస్పత్రి ఐసీటీసీ ల్యాబ్ సిబ్బందిని నిలదీశారు. మేము పరీక్ష చేసినప్పుడు పాజిటివ్ (హెచ్‌ఐవీ)గా నిర్ధారణ అయ్యిందని వారు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. ఘటన జరిగి వారంరోజులవుతున్నా ఎస్.కోట ఐసీటీసీ, ఆస్పత్రి అధికారులు బయటకు పొక్కనీయకుండా గుట్టుగా ఉంచినట్టు సమాచారం.

కలెక్టర్ డీఎంహెచ్‌ఓలకు ఫిర్యాదు

హెచ్‌ఐవీ లేక పోయినా ఉన్నట్టు రిపోర్టు ఇచ్చిన ఎస్.కోట ఐసీటీసీ ల్యాబ్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గర్భిణి బంధువులు కలెక్టర్ సూర్యకుమారి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జి.నాగభూషణరావుకు గురువారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదుచేశారు. ఇదే విషయంపై జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి రామేశ్వరి ప్రభు, డీసీహెచ్‌ఎస్ జి.నాగభూషణరావు మాట్లాడుతూ ఫిర్యాదు అందిందని, విచారణకు ఐసీటీసీ కేంద్రాల జిల్లా సూపర్‌వైజర్‌ను విచారణకు ఆదేశించామని చెప్పారు. ఆయన ఇచ్చిన నివేదిక ఆధారంగా కారకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

● 'మాండూస్' అలజడి



బంగాళాఖాతంలో ఏర్పడిన మాండూస్ తుఫాన్ ప్రభావంతో భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లోని తీర ప్రాంత మత్స్యకారుల్లో అలజడి నెలకొంది. తేలికపాటి వర్షం కురుస్తుండడం, సంద్రం అల్లకల్లోలంగా మారడంతో బోట్లు, వలలను శుక్రవారం సముద్రం ఒడ్డుకు చేర్చారు. చేపల వేటను నిలిపివేశారు. – భోగాపురం/పూసపాటిరేగ

వైఎస్సార్‌సీపీ హయాంలోనే

బీసీలకు రాజ్యాధికారం

- బీసీలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకున్నది టీడీపీనే
- అప్పట్లో పదవుల కేటాయింపులో బీసీలకు అన్యాయం చేసిన చంద్రబాబు
- జయహో బీసీ మహాసభకు తరలివచ్చిన వారందరికీ ధన్యవాదాలు
- 11న వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం:

అధికారంలోకి రాక ముందు ఓ మాట.. అధికారంలోకి వచ్చాక మరో మాట చెప్పి బీసీలకు అన్యాయం చేసినది టీడీపీ నాయకులేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలను ఓటు బ్యాంకుగా వినియోగించుకుని అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు అందుబాటులో ఉండని టీడీపీ నాయకులకు బీసీల కోసం మాట్లాడే హక్కులేదన్నారు. విజయనగరం జిల్లాలో 2014 ఎన్నికల అనంతరం కేంద్ర, రాష్ట్ర క్యాబినేట్‌లలో ఏ వర్గానికి చెందిన వారికి మంత్రి పదవులు ఇచ్చారో ప్రజలందరికీ తెలుసునని, ఇదీ బీసీల పట్ల టీడీపీకి ఉన్న ప్రేమను తేటతెల్లం చేస్తుందని వాఖ్యానించారు. మరికొద్ది నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీసీల పట్ల ప్రేమ ఒలకబోస్తున్నట్లు మాట్లాడటం సిగ్గుచేటని ఎద్దేవాచేశారు. అధికారంలో ఉన్న సమయంలో టీడీపీ నేతలు బీసీలకు ఏం లబ్ధికల్పించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీలకు చేస్తున్న న్యాయాన్ని చూసి మాట్లాడాలని హితవుపలికారు. ఎన్నికలకు ముందు ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రతిపక్షం ఆడుతున్న నాటకాలను ప్రజలు హర్షించరన్న విషయాన్ని గుర్తెరగాలన్నారు.

వెనుకబడిన వర్గాల మద్దతు వైఎస్సార్‌సీపీకే...

వెనుకబడిన వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీల మద్దతు వైఎస్సార్‌సీపీకే ఉందని మజ్జి శ్రీనివాసరావు ఉద్ఘాటించారు. 2019 ఎన్నికలకు ముందు ఏలూరులో నిర్వహించిన బీసీ సదస్సులో జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన విధంగా గడిచిన మూడున్నరేళ్లలో బీసీలకు రాజ్యాధికారం కల్పించి, వారి అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. వెనుకబడిన ప్రాంతమైన విజయనగరం జిల్లాలో 99 శాతం పదవులు బీసీలకు కల్పించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. జిల్లా పరిషత్‌లో పదవులు దక్కించుకున్న ప్రజాప్రతనిధులే దీనికి సాక్ష్యమన్నారు. విద్యతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్న నినాదంతో అన్ని వర్గాల విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించేందుకు వీలుగా ఫీజు రీయంబర్స్‌మెంట్, అమ్మఒడి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. బీసీ మహిళలకు వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నట్టు వెల్లడించారు. రాజ్యసభలో 8 సీట్లకు 4 సీట్లను బీసీలకు ఇవ్వడమే కాకుండా బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 2019 నుంచి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 76 వేల ఇళ్లు మంజూరు చేసి నిరుపేదలకు సొంతింటి భాగ్యం కల్పించేందుకు కృషిచేస్తున్నట్టు వివరించారు. లేనిపోని విమర్శలు చేస్తున్న టీడీపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, 2024లో జరగబోయే ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి శాశ్వతంగా చరమగీతం పాడతారన్నారు.

జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



బీసీలందరికీ ధన్యవాదాలు..

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఈ నెల 7న విజయవాడలో నిర్వహించిన జయహో బీసీ మహాసభకు తరలివచ్చిన జిల్లా బీసీలకు మజ్జి శ్రీనివాసరావు ధన్యావాదాలు తెలిపారు. లక్షలాదిగా తరలివచ్చి బీసీల మద్దతు జగన్‌మోహన్‌రెడ్డికేనంటూ చెప్పకనే చెప్పారన్నారు. భవిష్యత్‌లో ఇదే ఆదరణ చూపిస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వెన్నుదన్నుగా నిలవాలని ఆకాంక్షించారు.

11న వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం

పార్టీ పటిష్ట నిర్మాణం, 2024 ఎన్నికలే లక్ష్యంగా ఈనెల 11న వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ఫూల్‌బాగ్ జగన్నాథ కల్యాణ మండపం ప్రాంగణంలో మంత్రులు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలతో పాటు నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు, పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు.

20లోగా పరీక్ష ఫీజు చెల్లింపు

విజయనగరం పూల్‌బాగ్: 2022–23 మార్చి/ఏప్రిల్‌లో జరిగే పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లింపు, నామినల్ రోల్స్ సమర్పించేందుకు గడువు తేదీలు ప్రకటించినట్లు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ నెల 20వ తేదీలోగా ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చన్నారు. రూ.50 అపరాధ రుసుంతో ఈ నెల 26వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుంతో జనవరి 2వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుంతో జనవరి 9వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. రెగ్యులర్ విద్యార్థులు రూ.125(అన్ని సబ్జెక్టులకు కలిపి), 3, 3 కన్నా తక్కువ సబ్జెక్టులకు రూ.125, వొకేషనల్ అభ్యర్థులకు రెగ్యులర్ పరీక్ష రుసుంనకు అదనంగా రూ.60, ఏజ్‌కాండేషన్ ఫీజు రూ.300, మైగ్రేషన్ ఫీజు రూ.80 చెల్లించాలని వెల్లడించారు. వివరాలకు www.breap.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

మహిళా సాధికారతే లక్ష్యం

- మహిళలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
- జీవనోపాధి మెరుగుపరిచేందుకు చర్యలు
- నిరంతరాయంగా పథకాలు, కార్యక్రమాల అమలు
- 4,683 పొదుపు సంఘాలకు రూ.183 కోట్ల రుణం


వ్యాపారాలపై పొదుపు సంఘాలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం శ్రీరాములు


మిషన్‌తో కర్పూరం తయారు చేస్తున్న వరదా పరమేశ్వరి

సీతానగరం: రాష్ట్రంలోని మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే ఆయన అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తూ మహిళలు స్వయంగా ఎదిగేందుకు తోడ్పాటునందిస్తున్నారు. ఓ వైపు రాజకీయ పదవులతో పాటు మరోవైపు అన్ని రంగాల్లోనూ మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాలతో మహిళా పక్షపాతిగా ఆయన మంచి పేరు తెచ్చుకున్నారు.

జిల్లాలో 11,949 పొదుపు సంఘాలు..

ఇంటిని చక్కదిద్దే మహిళకు ఆర్థిక తోడ్పాటునందిస్తే ఆ ఇల్లు మరింత బాగుంటుందన్న సదుద్దేశ్యంతో ప్రభుత్వం అతి తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేస్తోంది. వీటితో కుటీర పరిశ్రమలు నెలకొల్పి, మహిళలు జీవనోపాధి మెరుగుపరుచుకుంటుండడం విశేషం. ఇప్పుడు అన్ని చోట్ల ఇదే పరిస్థితి నెలకొనడంతో మహిళలు ప్రభుత్వ పాలన పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా వెలుగు ఆధ్వర్యంలో ఉన్న మొత్తం 11,949 పొదుపు సంఘాలు 2022 ఆర్థిక సంవత్సరంలో రూ.368 కోట్ల రుణాలకు ప్రణాళికలు రూపొందించి, కోరగా, ఇప్పటివరకు 4,683 సంఘాలకు రూ.183 కోట్లు రుణాలను ప్రభుత్వం మంజూరు చేసి, వారి ఆర్థిక ఎదుగుదలకు దోహదపడింది. అలాగే సొంతింటి కల నెరవేర్చుకునేందుకు 75,290 మంది లబ్ధిదారులకు రూ.141.16 కోట్లు అందజేసింది. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటున్న మహిళలు కోళ్లు, గొర్రెలు, మేకల పెంపకంతో పాటు వివిధ వస్తువుల తయారీ, కూరగాయల సాగు, చిన్నచిన్న వ్యాపారాలు, కిరాణా షాపు, టైలరింగ్ చేస్తూ ఆర్థికంగా ఎదిగేందుకు ఉత్సాహంతో అడుగులు వేస్తున్నారు. ఇదంతా సీఎం జగనన్న పుణ్యమని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వృత్తి నైపుణ్యం..

పొదుపు సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలు కల్పిస్తోంది. సంఘ సభ్యులుగా ఉన్న వారికి వృత్తి నైపుణ్యం పెంపొందించే శిక్షణలు ఇస్తూ ప్రోత్సహిస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఇటువంటి శిక్షణ తీసుకున్న ఎంతో మంది ఇప్పుడు వివిధ వ్యాపారాలు చేసుకుంటూ మెరుగైన జీవనోపాధి సాగిస్తున్నారు. రోజువారీ వచ్చే ఆదాయంలో పొదుపు పాటించడంతో పాటు ఓ వైపు కుటుంబ పోషణ, మరోవైపు పిల్లల ఉన్నత చదువులకు ప్రణాళికలు వేసుకుంటున్నారు.

మహిళలే సంపాదనపరులు..



మహిళలు సంపాదనపరులుగా ఉండాలన్న సదుద్దేశ్యంతో ప్రభుత్వం వారికి అనేక అవకాశాలు కల్పిస్తోంది. మహిళలు కూడా ప్రభుత్వ పథకాలు, శిక్షణ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకుని, వారి సొంత కాళ్లపై వారు నిలబడేందుకు అహర్నిశలు కష్టపడుతున్నారు. చిన్నచిన్న పరిశ్రమలు, వ్యాపారాలు కొనసాగిస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నారు.

– పెద్దింటి కిరణ్‌కుమార్, జిల్లా డీఆర్‌డీఏ పీడీ, పార్వతీపురం మన్యం జిల్లా

సరగడపేటలో చోరీ


బాధితురాలికి దొరికిన నెక్లెస్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

భోగాపురం: మండలంలోని సరగడపేటలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన లక్ష్మి భర్త సన్యాసి బతుకు తెరువు నిమిత్తం విజయవాడ వెళ్లగా, కూతురు, కొడుకుతో కలిసి ఇదే గ్రామంలో ఆమె నివాసముంటోంది. దివీస్ కంపెనీలో పనిచేస్తున్న ఆమె కొడుకు రాత్రి నైట్‌డ్యూటీకి వెళ్లగా, కూతురితో కలిసి లక్ష్మి ఇంట్లో నిద్రపోయింది. సరిగ్గా రాత్రి ఒంటిగంట సమయానికి గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి, గాఢనిద్రలోని లక్ష్మి మెడలోని పుస్తెలతాడును కత్తిరించాడు. అనంతరం ఆ తాడుకు ఉన్న తాళాలతో బీరువాను తెరిచి, అందులోని 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.2 వేల నగదు తీసుకుని పరిగెత్తాడు. ఇదే సమయానికి నిద్రలేచిన లక్ష్మి దొంగ.. దొంగ.. అని కేకలు వేసింది. చుట్టుపక్కల వారు వచ్చి ఏమైందని అడిగే లోపు అక్కడి నుంచి దొంగ పారిపోయాడు. అయితే దొంగ అక్కడి నుంచి జారుకునే సమయంలో 2 తులాల నెక్లెస్ అక్కడే పడిపోయింది. దానిని స్వాధీనం చేసుకున్న లక్ష్మి బీరువా వెతకగా మిగతా ఆభరణాలు లేకపోయేసరికి బోరుమని ఏడ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కృష్ణమూర్తి సిబ్బందితో కలిసి చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి, పలు ఆధారాలు సేకరించారు. వీలైనంత త్వరగా దొంగను పట్టుకునే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 545.00
విజయనగరం	రూ. 549.00
శ్రీకాకుళం	రూ. 549.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	54,280–00
బంగారం(22సి. 10గ్రా.)	49,750–00
వెండి (కిలో)	72,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹ 230

'సెక్యూరిటీస్ మార్కెట్'పై వర్క్‌షాప్


శ్రీనును సత్కరిస్తున్న సీతం కళాశాల సిబ్బంది

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'సెక్యూరిటీస్ మార్కెట్, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్'పై వర్క్‌షాప్ శుక్రవారం ప్రారంభమైంది. సెక్యూరిటీస్ మార్కెట్స్ అండ్ కొటక్ సెక్యూరిటీ ట్రైనర్ శ్రీను మాడెం మాట్లాడుతూ ఆర్థిక లక్ష్యాలు సాధించడానికి పెట్టుబడి, దీర్ఘకాలిక ప్రణాళిక కోసం ప్రాథమిక ఆర్థిక పరిజ్ఞానం పెంపొందాలని సూచించారు. అనంతరం ఆయనను కళాశాల యాజమాన్యం సన్మానించింది. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డీవీ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో..
విజయనగరం క్రీడాకారుల సత్తా

- సింగిల్స్ మినహా మిగిలిన విభాగాల్లో అద్భుత ప్రదర్శన
- విజేతలకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అభినందనలు


డబుల్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన విజయనగరం పురుషుల జట్టు


విజేత మహిళల జోడితో ప్రజాప్రతినిధులు

విజయనగరం: నగరంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న సీఎం ప్రైజ్‌మనీ కప్ జోనల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో విజయనగరం జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. పురుషుల సింగిల్స్ విభాగం మినహా మిగిలిన అన్ని విభాగాల్లో అద్భుత ప్రదర్శన కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలకు ఆరు జిల్లాల నుంచి మొత్తం 300 క్రీడాకారులు హాజరై, తమలోని ప్రతిభ కనబరిచారు. పురుషుల సింగిల్స్‌లో విశాఖపట్నం జిల్లాకు చెందిన క్రీడాకారులు అల్లు సాయికిరణ్, పి.శరణ్ వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకోగా, డబుల్స్ విభాగంలో ఆతిథ్య విజయనగరం జిల్లాకు చెందిన క్రీడాకారులు దినేష్‌కుమార్–ఆదిత్య(జోడి), నవీన్‌కుమార్–శివకుమార్(జోడి) విజేతలుగా నిలిచారు. శుక్రవారం మహిళా విభాగంలో జరిగిన పోటీల్లో 50 మంది క్రీడాకారులు తలపడగా, ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన మ్యాచ్‌లు హోరాహోరీగా కొనసాగాయి. మహిళల సింగిల్స్‌లో విజయనగరానికి చెందిన కె.ప్రీతి ప్రథమ స్థానం దక్కించుకోగా, విశాఖపట్నం జిల్లాకు చెందిన ఫలక్ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. డబుల్స్‌లో విజయనగరం జిల్లాకు చెందిన కె.ప్రీతి–సుధాకల్యాణి(జోడి), వి.జాహ్నవి–ఎస్.కావ్య(జోడి) ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకున్నారు. జోనల్ స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకున్న క్రీడాకారులంతా రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించినట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ పి.అప్పలనాయుడు తెలిపారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి వై.కుసుంబచ్చన్, టోర్నీ చీఫ్ రిఫరీ పొట్నూరు శ్రీరాములు, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు స్వరూప్, రవి, మురళి, ప్రసాద్, పి.ఆదిలక్ష్మి, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


రేపటి నుంచి జగనన్న ప్రీమియర్ లీగ్

- డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన


టీ-షర్టులు ఆవిష్కరిస్తున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ భావన, వైఎస్సార్ సీపీ నాయకుడు విక్రమ్ తదితరులు

విజయనగరం ఫోర్ట్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 50వ పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 11వ తేదీ నుంచి జగనన్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అవనాపు విక్రమ్ అన్నారు. స్థానిక డీసీఎంఎస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానిక అయోధ్య మైదానంలో ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు జరిగే ఈ పోటీలకు 50 డివిజన్ల నుంచి 50 జట్లను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఫైనల్స్‌లో గెలుపొందిన జట్టుకు ట్రోఫీ, రూ.50 వేల నగదు, రన్నరప్‌కు రూ.25 వేల నగదు అందజేస్తామని వివరించారు. టోర్నీలో పాల్గొనే క్రీడాకారులకు ఉచిత ప్రవేశంతో పాటు టీషర్టులు కూడా ఉచితంగా అందజేస్తామన్నారు. అనంతరం లీగ్ టీ-షర్టులను ఆవిష్కరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కాళ్ల గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


లక్ష్మణకుమార్(ఫైల్)

జామి: విశాఖపట్నం జిల్లాలోని పద్మనాభం మండలం, చిన్నాపురం జంక్షన్ దగ్గరలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆళ్ల లక్ష్మణకుమార్(25) అనే యువకుడు దుర్మరణం చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. కుమరాం గ్రామానికి చెందిన లక్ష్మణకుమార్ అలియాస్ సుధీర్ బొబ్బిలిలో స్క్రాప్ బిజినెస్ చేస్తుంటాడు. రాత్రి 10 గంటలకు బొబ్బిలి నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వస్తుండగా మార్గమధ్యంలోని మిల్లర్(కాంక్రీట్ మిషన్)ను బలంగా ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం.

లారీ ఢీకొని వృద్ధుడు..


వృద్ధుడి మృతదేహం

కొమరాడ: లారీ ఢీకొని వృద్ధుడు అధికారి సత్యం నాయుడు(70) మృతి చెందిన సంఘటన మండలంలోని సివిని గ్రామ రోడ్డు సమీపంలో జరిగింది. ఇదే గ్రామానికి చెందిన ఈయన మంచినీటి కోసం బావి వద్దకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా, కొమరాడ నుంచి పార్వతీపురం వైపు వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి మృతదేహం తరలించారు.

క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి...

పూసపాటిరేగ: మాండూస్ తుఫాన్‌పై మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి కల్యాణ చక్రవర్తి అన్నారు. మండలంలోని తిప్పలవలస తీరప్రాంతాన్ని శుక్రవారం సందర్శించి తుఫాన్ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మత్స్యకారులకు వివరించారు. బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. ఆయనతో పాటు ఎంపీపీ మహంతి కల్యాణి, ఎంపీడీఓ జి.రామారావు, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద, గుషిణి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించనున్నట్లు ఏఓ పూర్ణిమ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాల వద్ద ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు కేంద్రాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

పీఓపై చర్యలు తీసుకోవాలి..

విజయనగరం పూల్‌బాగ్: అల్లూరు సీతారామ రాజు జిల్లా పెదబయలు తహసీల్దార్ శ్రీనివాస్ ఆత్మహత్యకు కారణమైన పాడేరు ఐటీడీఏ పీఓపై చర్యలు తీసుకోవాలని పట్టణ పౌరసంక్షేమ సంఘ జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె. సురేష్ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేటలో తహసీల్దార్ శ్రీనివాస్ మృతదేహాన్ని శుక్రవారం సందర్శించి నివాళులర్పించారు.

విద్యాలక్ష్మికి ప్రత్యేక పూజలు



విద్యాలక్ష్మి అమ్మవారు

విజయనగరం రూరల్: దుప్పాడ గంగానగర్‌లో ఉన్న శ్రీ క్షేత్రమ్‌లోని అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరుని దేవాలయంలో మార్గశిర మాస విశేష పూజలో భాగంగా విద్యాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు రమేష్ ఆచార్యులు, శ్రీనివాస్ రమేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి స్నపనం, పంచామృతాభిషేకాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

తూర్పుకాపు ఆత్మీయ కలయిక రేపు

విజయనగరం పూల్‌బాగ్: ఈ నెల 11న తూర్పుకాపు కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక నిర్వహించనున్నట్లు తూర్పుకాపు సామాజిక వేదిక అధ్యక్ష, కార్యదర్శులు రొంగలి రామారావు, ముదిలి నాగభూషణం తెలిపారు. శుక్రవారం స్థానిక వేదిక భవన్‌లో వారు మాట్లాడుతూ, కలెక్టర్ ఆఫీస్ గంట్యాడ రోడ్డులో గల కామాక్షినగర్(హైడిమాండకాలనీ)లో గల తూర్పుకాపు సామాజిక భవన ప్రాంగణంలో ఆత్మీయ కలయిక ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

కళాశాల సందర్శన

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఉన్నత విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకులు(ఆర్‌జేడీ) సీహెచ్.కృష్ణ శుక్రవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని విభాగాల్లో ఉన్న అధ్యాపకుల కొరతను తప్పక పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. ఉన్నత విద్యాశాఖలో ప్రవేశపెట్టిన యాప్‌లు, వాటి ఆవశ్యకతను వివరించారు. అధ్యాపకులతో మాట్లాడుతూ నైపుణ్యాలను మెరుగుపరచుకుని బోధన, పరిశోధన, కళాశాల పరిపాలనలో సాంకేతికత ఆవశ్యకతను గుర్తించాలని సూచించారు. కళాశాల ఆంగ్లోపన్యాసకులు డాక్టర్ రవీంద్రనాథ్ తయారు చేసిన స్టడీమెటీరియల్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న కరెన్సీ, స్టాంపుల ప్రదర్శన



కరెన్సీ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న వివేకానంద విద్యాసంస్థల అధినేత ప్రసాద్, తదితరులు

శృంగవరపుకోట: స్థానిక వివేకానంద కళాశాలలో ఏర్పాటు చేసిన కరెన్సీ ప్రదర్శన విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. స్థానిక ఎస్‌బీఐ మెయిన్‌బ్రాంచ్‌లో సీఏసీలో పనిచేస్తున్న ఎస్.ఎస్.ఎన్.రాజు తాను సేకరించిన నాణాలు, విదేశీ కరెన్సీ, ప్రత్యేక తపాలా స్టాంపులు, రిజర్వ్ బ్యాంక్ ప్రత్యేకంగా విడుదల చేసిన నాణాలను శుక్రవారం ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. వివేకానంద విద్యాసంస్థల అధినేత సీహెచ్.ఆర్.కె.ప్రసాద్ ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలి

● డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



ఫెన్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ తైక్వాండో, ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారులు ఉత్తమ క్రీడా ప్రతిభతో సత్తా చాటాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆకాంక్షించారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో అండర్ -14, 17 వయసుల విభాగాల్లో నిర్వహించిన తైక్వాండో, ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలను ఆమె శుక్రవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం క్రీడా పోటీలు నిర్వహిస్తోందన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో రాణించి జాతీయ పోటీలకు అర్హత సాధించాలని సూచించారు. క్రీడాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, క్రీడల్లో రాణించిన వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని చెప్పారు. ఇదిలా ఉండగా జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరుకాగా...అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ తెలిపారు. పోటీలను ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి బంగార్రాజు, చారి, పీడీలు, పీఈటీలు పర్యవేక్షించారు.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ తరగతులు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎన్‌సీఎస్ ట్రస్టీ శ్రీనివాస్, తదితరులు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు 'తవాస్మి: జీవన వేదం- రామాయణం'పై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తవాస్మి రూపకర్తలు, ఐఐటీ ఆచార్యులు ఆర్.శ్రీరామ చక్రధర్, ఎ.శారదా దీప్తి తెలిపారు. రామనారాయణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, మనిషికి మానవత్వానికి మధ్య పెరుగుతున్న అగాథాన్ని తగ్గించి, వ్యక్తిలో వ్యక్తిత్వపు వెలుగులు నింపే ప్రయత్నమే 'తవాస్మి: జీవన వేదం- రామాయణం' అని చెప్పారు. నేటి బాలలే రేపటి పౌరులని, రేపటి పౌరులే దేశ భవిష్యత్ అని తెలిపారు. అలాంటి పిల్లల వ్యక్తిత్వ వికాసం కోసం తవాస్మి ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఇప్పటివరకు రెండువేల మంది విద్యార్థులకు తవాస్మిపై శిక్షణ అందించామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ అందించే పుస్తకాలను ఎన్‌సీఎస్ ట్రస్ట్ సభ్యుడు నారాయణం శ్రీనివాస్ ఆవిష్కరించారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు



కవులవాడలోని జగనన్న కాలనీలో పర్యటిస్తున్న మండల ప్రత్యేకాధికారి పద్మావతి, తదితరులు

● మండల ప్రత్యేకాధికారి పద్మావతి

భోగాపురం: జగనన్న కాలనీ లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి బి.పద్మావతి అధికారులకు సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డితో కలిసి మండలంలోని కవులవాడ పంచాయతీ జగనన్న కాలనీలో చేపడుతున్న నిర్మాణాలను శుక్రవారం పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సాయం, నిర్మాణ సామగ్రితో నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, కొండపు కొత్తయ్యరెడ్డి, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, హౌసింగ్ ఏఈ ఆర్.రాము, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం

● వ్యవసాయశాఖ జె.డి రామారావు



రైతుకు బ్రోచర్‌ను అందజేస్తున్న జె.డి రామారావు, తదితరులు

పూసపాటిరేగ: చిరుధాన్యాలతో మానవాళి ఆరోగ్య సమస్యలను అధిగమించవచ్చునని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ వీటీ రామారావు అన్నారు. మండలంలోని బత్తివలసలో చిరుధాన్యాలు సాగుపై రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిరుధాన్యాలు సాగులో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం వస్తుందని చెప్పారు. ప్రస్తుతం చిరుధాన్యాల వినియోగం బాగా పెరిగిందన్నారు. అనంతరం చిరుధాన్యాల సాగుపై రూపొందించిన బ్రోచర్లను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఎ.డి నాగభూషణరావు, శాస్త్రవేత్త కె. తేజేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి ఎ.శ్రీనివాస్, సర్పంచ్ కొర్నాన రామప్పడు, తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చేస్తే జైలు శిక్ష

● సీఐ వెంకటరావు



మాట్లాడుతున్న సీఐ వెంకటరావు

విజయనగరం అర్బన్: తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేస్తే కనీసం ఆరు నుంచి పది సంవత్సరాల పాటు జైలు శిక్ష ఉంటుందని ఒకటో పట్టణ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ బి.వెంకటరావు అన్నారు. స్థానిక మహరాజా అటానమస్ కళాశాలలో 'యాంటీ ర్యాగింగ్- చట్టాల పరిణామాలు' అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ర్యాగింగ్ చేస్తే జైలు శిక్షతో పాటు చదువుకొనే అవకాశం కోల్పోయి భవిష్యత్ నాశనమవుతుందని చెప్పారు. ర్యాగింగ్ భూతం నుంచి కాపాడుకోవాలంటే మనకు దృఢ నిశ్చయం, మనోబలం ఎంతో అవసరమన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సాంబశివరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, ఎన్‌సీసీ అధికారి కల్యాణ్ అశోక్, అధ్యాపకులు, విద్యార్థి విభాగం కన్వీనర్ వి.బాబ్జీ, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రమణమూర్తి

నెల్లిమర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో కన్వర్జెన్సీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎస్‌వీ రమణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్మాణంలో ఉన్న సచివాలయ, వెల్‌నెస్, అంగన్వాడీ భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇప్పటికే నిర్మాణంలోనున్న ఇళ్లను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ డీఈఈ మురళీమోహన్, ఎంపీడీఓ జి.గిరిబాల, ఈఓపీఆర్‌డీ భానోజీ రావు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం విక్రయించేలా చర్యలు..

నెల్లిమర్ల: మండలానికి చెందిన రైతులంతా తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సలహా మండలి సభ్యులు, సచివాలయ సహాయకులకు మండల ప్రత్యేకాధికారి ఎస్‌వీ రమణమూర్తి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని వ్యవసాయ అధికారులకు ఆదేశించారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేయాలన్నారు. రబీకి అవసరమైన విత్తనాలు, ఎరువులను ఆర్‌బీకేల్లో సిద్ధంగా ఉంచాలన్నారు. ఏఓ పూర్ణిమ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఇరిగేషన్ ఏఈఈ శ్రీనివాసరావు, ఏఈఓ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు

● ఎంపీపీ మహంతి కల్యాణి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కల్యాణి, తదితరులు

పూసపాటిరేగ: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. మండలంలోని కుమిలి రైతుభరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు ధాన్యం అమ్మేందుకు దళారులను ఆశ్రయించకుండా నేరుగా రైతుభరోసా కేంద్రం అధికారులును సంప్రదించాలన్నారు. సాధారణ రకం క్వింటాకు రూ. 2040, గ్రేడ్ ఏ రకానికి 2060 రుపాయలను మద్దతు ధరగా నిర్ణయించినట్లు చెప్పారు. ఈ క్రాప్‌లో పంట నమోదైన రైతులు మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు అర్హులన్నారు. ధాన్యం విక్రయించిన 21 రోజుల్లోనే రైతు ఖాతాకు నగదు జమవుతుందని చెప్పారు. మండల వ్యవసాయ అధికారి కొల్లి నీలిమ, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, ఎంపీడీఓ జి.రామరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు పతివాడ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్ధనరావు, గుజ్జు సురేష్‌రెడ్డి, పడాల శ్రీధర్, గాబు సూరప్పన్నరెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు

● ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు



మాట్లాడుతున్న ఎంపీపీ వాసుదేవరావు

డెంకాడ: పంచాయతీల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు తప్పనిసరని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికల తయారీపై మూడు రోజులపాటు జరగనున్న శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు మాట్లాడుతూ, పంచాయతీలకు సంబంధించి ప్రజారోగ్యం, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం, తాగునీరు, మాతాశిశు సంరక్షణ, విద్య, అభివృద్ధి పనులు, ఉపాధి, తదితర అంశాలపై ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చి నిధులను ఒక క్రమపద్ధతిలో సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ స్వరూపారాణి, ఈఓపీఆర్‌డీ అప్పలనాయుడు, ఏఓ పి.నిర్మల, ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు, ఏపీఓ ఎ.వెంకటరమణ, ఏపీఎం పి.విజయలక్ష్మి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ విభాగాలకు చెందిన సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ ఉప్పాడ, అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళ పోలీసులు

● ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి

భోగాపురం: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి బి.పద్మావతి అధ్యక్షతలో మహిళలపై లింగ వివక్షత అనే అంశంపై అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళ పోలీసులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, పురుషులతో నేడు అన్ని రంగాల్లో పోటీపడుతున్న మహిళలపై వివక్షత చూపకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సచివాలయ పోలీసులకు సూచించారు. బాల్య వివాహాలు, శిశుమరణాలు, గృహహింస, లైంగిక వేధింపులు, అత్యాచారాలను సమూలంగా రూపుమాపాలన్నారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైగింక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అన్నారు. అనంతరం లింగ వివక్షతను రూపుమాపేందుకు ప్రతిఒక్కరూ బాధ్యత వహిస్తామంటూ ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు పచ్చిపాల నాగలక్ష్మి, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, సీడీపీఓ సుగుణవతి, ఏపీఎం రమణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళ పోలీసులు పాల్గొన్నారు.

డ్రెస్ కోడ్ తప్పనిసరి

భోగాపురం: వీఓఏలు తప్పనిసరిగా డ్రెస్ కోడ్ పాటించాలని ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీఓఏలకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, మండల ప్రత్యేకాధికారి బి.పద్మావతి, ఏపీఎం వై.రమణ, సీసీలు, వెలుగు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

వేపాడ: ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగా మండలంలోని బొద్దాం పీహెచ్‌సీలో వైద్యాధికారి సతీష్ కుమార్ 60 మంది గర్భిణులకు శుక్రవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. గర్భిణులకు వైద్యాధికారి భోజన సదుపాయం కల్పించారు. పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విశ్వనాథం,ఉపాధ్యాయులు

కొత్తవలస: అప్పన్నపాలెం గ్రామ సమీపంలోని ఓపీ జిందాల్ భారత్ విద్యామందిర్‌కు చెందిన అయిదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ పి.వి.ఎస్.విశ్వనాథం శుక్రవారం తెలిపారు. ఇటీవల ఎస్.కోటలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-14 బాలికల విభాగంలో బి.హాసిని, కె.ఝాన్సీ, బాలుర విభాగంలో ఎస్.దుర్గాసంపత్‌కుమార్ అండర్-17 బాలికల విభాగంలో ఎల్.సుస్మిత, బాలుర విభాగంలో ఎస్.రోహిత్‌కుమార్ ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ చెప్పారు. దీంతో వీరు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు పి.అప్పలనాయుడు, సంధ్యను ప్రిన్సిపాల్ అభినందించారు.

ధాన్యం రవాణా చార్జీలను ప్రభుత్వమే భరిస్తుంది



బొండపల్లి: దేవుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ చలం నాయుడు



చీపురుపల్లిరూరల్: కర్లాంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



గంట్యాడ: రామవరం ఆర్బీకేలో రైతులతో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

బొండపల్లి: రైతుల పొలాలు, కళ్లాల నుంచి ధాన్యం మిల్లులకు తరలించేందుకు అయ్యే రవాణా, కూలీలు, గోనె సంచుల ఖర్చులను ఈ ఏడాది ప్రభుత్వమే భరిస్తోందని ఎంపీపీ చల్ల చలంనాయుడు తెలిపారు. దేవుపల్లి గ్రామంలోని ఆర్బీకేలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజనూ ఆర్బీకేల ద్వారా మద్దతు ధరతో ప్రభుత్వం కొను గోలు చేస్తుందని చెప్పారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, ఎంపీడీఓ ఎ.వేదవతి, రాచకిండాం పీఏసీఎస్ అధ్యక్షుడు గొల్లు సతీష్, ఎంపీటీసీ రాపాక వెంకటలక్ష్మి, మండల వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ పడాల అప్పలనాయుడు, ఏఓ పి.వి. మల్లికార్జున రావు, నాయకులు ఇట్లా తిరుపతి రావు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం

చీపురుపల్లిరూరల్: రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కర్లాం పీఏసీఎస్ అధ్యక్షుడు చందక గురునాయుడు అన్నారు. కర్లాం గ్రామంలోని ఆర్బీకే వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఓ సీహెచ్.రఘునాథ్, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇప్పిలి అనంతం, పార్టీ మండల అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసులనాయుడుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ధాన్యం విక్రయించుకున్న 21 రోజుల్లో బిల్లులను వారి ఖాతాల్లో ప్రభుత్వం జమచేయనుందని చెప్పారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బాణాన శ్రీనివాసరావు, స్థానిక నాయకులు బాణాన రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తకూడదు

గంట్యాడ: రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా వారి నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సిబ్బందికి సూచించారు. రామవరం ఆర్బీకేలో శుక్రవారం ఆయన తనిఖీలు చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. ధాన్యం విక్రయించుకునే ప్రక్రియలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం నిల్వకు గోదాములు ఉన్నాయా అని వ్యవసాయ అధికారులను ఆరా తీశారు. రైతుల కళ్లాల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేయాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ ఏడీ నాగభూషణం, తహసీల్దార్ స్వర్ణకుమార్, ఏఓ శ్యామ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఈ- సర్వీసులను పెంచాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ నిర్మలాదేవి

గజపతినగరం: గ్రామ సచివాలయాల్లో అందించే ఈ-సేవలను మరింత పెంచాలని సిబ్బందికి జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జి.నిర్మలాదేవి సూచించారు. స్థానిక గ్రామసచివాలయంలో శుక్రవారం ఆమె తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు. సచివాలయంలో అందిస్తున్న సేవలు, స్పందనలో అందిన అర్జీల్లో ఎన్నింటిని పరిష్క రించారు. తదితర అంశాలపై ఆరా తీశారు. అర్హులందరికీ పథకాలు మంజూరు చేయాలని, పన్నుల వసూలు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి రమణ, వైస్ సర్పంచ్ కె.రామునాయుడు తదితరులు ఆమె వెంట ఉన్నారు.

పాస్టర్లకు దుస్తుల పంపిణీ



పాస్టర్ల దంపతులకు దుస్తులు అందజేస్తున్న పాస్టర్ ప్రశాంత్‌కుమార్

దత్తిరాజేరు: క్రిస్మస్‌ను పురస్కరించుకుని మండలంలోని షికారుగంజి చర్చిలో పాస్టర్ విక్టర్‌పాల్ ఆధ్వర్యంలో బాడంగి, రామభద్రపురం, మెంటాడ, గజపతినగరం, దత్తిరాజేరు మండలాల్లోని పాస్టర్ల దంపతులకు శుక్రవా రం దుస్తులు పంపిణీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా కృష్ణునిపాలెంకు చెందిన ఎవేంజ్ లిజన్స్‌హెల్పింగ్ హ్యాండ్ సంస్థ అధ్యక్షుడు, పాస్టర్ ప్రశాంత్‌కుమార్ దంపతులు తమ నిధులతో దుస్తులు సమకూర్చారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఏటా క్రిస్మస్ పండగకు పేదలకు, పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు.


కర్నూలు జిల్లా కల్లపరి గ్రామంలో సంక్షేమ పథకాల కరపత్రాన్ని లబ్ధిదారులకు అందజేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్


పశ్చిమగోదావరి జిల్లా సరిపల్లిలో వృద్ధురాలిని సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

మన ప్రభుత్వం


తిరుపతి జిల్లా పరమేశ్వరమంగళం గ్రామంలో మహిళకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి ఆర్కే రోజా


పల్నాడు జిల్లా ముప్పాళ్లలో వృద్ధురాలికి సంక్షేమ కరపత్రం అందజేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

ఈనాడువన్నీ కట్టుకథలే..

- నిత్యం పనికట్టుకుని రాసే కథనాలతో జనం నవ్వుకుంటున్నారు
- ఈనాడు రామోజీకి ఆర్థికమంత్రి 'బుగ్గన' కౌంటర్



సాక్షి, అమరావతి : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ, ఇతరత్రా రూపాల్లో ఇటీవల ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన రూ.982 కోట్లను వెనక్కి తీసుకుందంటూ ఈనాడు కథనం పూర్తిగా అబద్ధాల అల్లిక, తప్పుల తడకని.. అలాగే, జీతాలు, పింఛన్లు ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందంటూ రాసిన కథనం కూడా పచ్చి అబద్ధమని రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఆయన ఏమన్నారంటే..

- ▲ టీడీపీ హయాంలో నెలంతా ఉద్యోగులకు జీతాలివ్వడం రామోజీ మరచిపోయారా?
- ▲ అప్పటి ఆర్థికమంత్రి యనమల.. 'దొరికిన కాడికి అప్పులన్నీ చేసేశాం, అంతా ఊడ్చిపారేశాం, మీ ప్రభుత్వం వచ్చినా చిల్లిగవ్వ ఖజానాలో లేద'న్న విషయం గుర్తులేదా? వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి జీతాలు, పింఛన్లను వారం రోజుల్లోనే అన్నీ క్లియర్ చేస్తోంది. సాంకేతిక, అనివార్య కారణాలతో వీలుకాని అరుదైన సందర్భాల్లోనే 10 రోజుల్లో చెల్లింపులన్నీ పూర్తవుతున్నాయి. ఈ ఆర్థిక నిర్వహణ చాలదా మా ప్రభుత్వ దార్శనికత, చిత్తశుద్ధి ఏంటో ప్రజలు అర్థం చేసుకోవడానికి. రోజుకి రూ.400 నుంచి రూ.450 కోట్ల ఆదాయం రాష్ట్ర ఖజానాకి జమవుతాయని అవగాహన లేకుండా రాయడం ఈనాడుకే చెల్లు. నిత్యం పనికట్టుకుని అదే పనిపెట్టుకుని జీతాలు, ఆర్థిక పరిస్థితి, అప్పుల గురించి తప్పులుపడి లేనిది ఉన్నట్లు.. ఉన్నవి లేనట్లు రాస్తున్న మీ కాల్పనిక కథనాలు చదువుతున్న వారు నవ్వుకుంటున్నారు.
- ▲ 'అన్నదాత' బదులు ఈనాడు మూసివేసుంటే సరిపోయేదని యావత్ తెలుగులోకం అభిప్రాయపడుతోంది.
- ▲ ఇక జీఎస్టీ బకాయిల కింద ఏపీకి విడుదలైన రూ.682 కోట్లను కేంద్రం ఏమీ వెనక్కి తీసుకోలేదు. పాత బకాయిల కింద సర్దుబాటని ఆరోపించడంలో అర్థమేలేదు.
- ▲ అలాగే, ఏపీకి రావలసిన కేంద్ర నిధులు రూ.300 కోట్లు ఇప్పటికే వచ్చాయి. ఈ మొత్తాన్ని కూడా కేంద్రం వెనక్కి తీసుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఉలిక్కిపడలేదు కూడా. సర్దుబాటు అనుమానం అసలక్కర్లేదు.
- ▲ రామోజీ ఏ ఆర్థికశాఖ అధికారులతో ఆరాలు తీశారో చెప్పండి? ఏ ఐఏఎస్ అధికారికి జీతం రాలేదో వెల్లడించండి? డిసెంబర్ 1న కార్పొరేషన్ నుంచి రూ.2వేల కోట్లు అప్పులు తెచ్చామని రాశారు. ఏ కార్పొరేషన్‌లో తీసుకున్నామో రాయలేదేం?

సాగు, తాగునీటికే తొలి ప్రాధాన్యం

శ్రీశైలంలో నీటి వినియోగంపై కృష్ణా బోర్డుకు తేల్చి చెప్పిన ఆర్‌ఎంసీ

- జూలై–అక్టోబర్‌లో కనీస నీటి మట్టం 854 అడుగులకు ఎగువన ఉండాల్సిందే
- తర్వాత తాగునీటి అవసరాల మేరకే నీటిని విడుదల చేస్తూ విద్యుదుత్పత్తి
- ఉత్పత్తయ్యే విద్యుత్‌లో రెండు రాష్ట్రాలకు సమాన నిష్పత్తిలో పంపిణీ
- కృష్ణా బోర్డు ఛైర్మన్ ఎంపీ సింగ్‌కు తుది నివేదిక ఇచ్చిన ఆర్‌ఎంసీ కన్వీనర్ ఆర్కే పిళ్లై

సాక్షి, అమరావతి :శ్రీశైలం జలాశయం నీటి వినియోగంలో సాగు, తాగునీటికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కృష్ణా బోర్డుకు ఆర్‌ఎంసీ(జలాశయాల నిర్వహణ కమిటీ) తేల్చి చెప్పింది. రుతుపవనాల కాలంలో జూలై 1 నుంచి అక్టోబర్ 31 వరకు శ్రీశైలం ప్రాజెక్టు కనీస నీటి మట్టం 854 అడుగులపైనే ఉండాలని పేర్కొంది. ప్రస్తుతం ఉన్న వర్కింగ్ అరేంజ్‌మెంట్ ప్రకారం శ్రీశైలం జలాశయం విద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తయ్యే విద్యుత్‌లో ఇరు రాష్ట్రాలు చెరి సగం(50: 50) పంచుకోవాలని స్పష్టం చేస్తూ కృష్ణా బోర్డు ఛైర్మన్ ఎంపీ సింగ్‌కు బుధవారం ఆర్‌ఎంసీ కన్వీనర్ తుది నివేదిక ఇచ్చారు. డిసెంబర్ 3న నిర్వహించిన ఆరో సమావేశంలో తుది నివేదికను రెండు రాష్ట్రాలు అంగీకరించినా.. దానిపై సంతకం చేయడానికి కొంత సమయం కావాలని తెలంగాణ అధికారులు అడిగారని నివేదికలో పేర్కొన్నారు. కానీ.. తుది నివేదికపై సంతకాలు చేయడానికి డిసెంబర్ 5న ఏర్పాటు చేసిన సమావేశానికి తెలంగాణ అధికారులు గైర్హాజరయ్యారని తెలిపింది. దాంతో ఆర్‌ఎంసీలో మిగతా సభ్యులైన నలుగురు (కన్వీనర్ ఆర్కే పిళ్లై కృష్ణా బోర్డు సభ్యులు మౌతాంగ్, ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, ఏపీ జెన్‌కో డైరెక్టర్ ఎమ్వీవీ సత్యనారాయణ) తుది నివేదికపై సంతకాలు చేశారని పేర్కొంది. ఈ తుది నివేదికపై బోర్డులో చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించింది. కృష్ణా బోర్డు ఆమోదించాకే ఆర్‌ఎంసీ నివేదిక అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ)–2 అవార్డు నోటిఫై అయ్యే దాకా ఈ నివేదిక అమల్లో ఉంటుందని పేర్కొంది. ఆర్‌ఎంసీ తుది నివేదిక, సీడబ్ల్యూసీ రూల్ కర్వ్స్ ఆధారంగా నీటి కేటాయింపులకు రక్షణ కల్పించాలంటూ రెండు రాష్ట్రాలు కేడబ్ల్యూడీటీ–2ను కోరడానికి వీల్లేదని తెగేసి చెప్పింది. ఆర్‌ఎంసీ తుది నివేదికలో ప్రధానాంశాలు ఇలా ఉన్నాయి.

విద్యుదుత్పత్తి కేంద్రాల నిర్వహణ ఇలా..

- ▲ వరద రోజుల్లో అంటే జూలై 1 నుంచి అక్టోబర్ 31 మధ్య ఉత్పత్తయ్యే విద్యుత్‌ను రోజూ ఉదయం 8 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు మిలియన్ యూనిట్లలో లెక్కకట్టి.. దాన్ని ఇరు రాష్ట్రాలకు చెరి సగం పంపిణీ చేయాలి.
- ▲ అక్టోబర్ 31 తర్వాత శ్రీశైలం ప్రాజెక్టుకు దిగువన సాగు, తాగునీటి అవసరాలను ప్రతి పది రోజులకు ఒకసారి పీఆర్‌ఎంసీ (జలాశయాల శాశ్వత నిర్వహణ కమిటీ) లెక్కకట్టి.. విద్యుదుత్పత్తి చేస్తూ నీటిని దిగువకు విడుదల చేయాలి.
- ▲ శ్రీశైలం ఎడమ గట్టు కేంద్రంలో రివర్సిబుల్ టర్బైన్స్‌తో విద్యుదుత్పత్తి చేయడానికి 13 శాతం నీరు ఎక్కువగా అవసరం. శ్రీశైలం నుంచి దిగువకు ఒక టీఎంసీని విడుదల చేయాల్సి వస్తే.. అందులో 0.531 టీఎంసీని ఎడమ గట్టు కేంద్రం, 0.469 టీఎంసీలను కుడి గట్టు కేంద్రం ద్వారా విడుదల చేస్తూ విద్యుదుత్పత్తి చేయాలి.
- ▲ శ్రీశైలం జలాశయంలో ఖాళీ ఉంటే.. ఎడమ గట్టు కేంద్రం ద్వారా జలాశయంలోకి రివర్స్ పంపింగ్ చేసిన నీటిని వినియోగించుకుని పీక్ అవర్స్‌లో తెలంగాణ విద్యుదుత్పత్తి చేసుకోవచ్చు.
- ▲ నాగార్జునసాగర్‌లో వరద రోజుల్లో అంటే.. జూలై 1 నుంచి అక్టోబర్ 31 రూల్ కర్వ్‌లో నిర్ణయించిన నీటి మట్టం కంటే ఎక్కువగా ఉంటే విద్యుదుత్పత్తి చేసుకోవచ్చు. వరద తగ్గాక.. దిగువన సాగు, తాగునీటి అవసరాల మేరకు నీటిని విడుదల చేస్తూ ప్రధాన కేంద్రం ద్వారా విద్యుదుత్పత్తి చేయాలి.

ఉమ్మడి జలాశయాల నిర్వహణ ఇలా

- ▲ బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపుల ఆధారంగా సీడబ్ల్యూసీ 2021 డిసెంబర్ 29న రూపొందించిన శ్రీశైలం జలాశయం రూల్ కర్వ్స్ ముసాయిదాను 2022 ఫిబ్రవరి 2న కృష్ణా బోర్డుకు అందించింది. దీనిపై ఆర్‌ఎంసీ రెండు రాష్ట్రాల అభిప్రాయాలను తీసుకుని, ఖరారు చేసింది.
- ▲ శ్రీశైలం జలాశయంలో 75 శాతం లభ్యత ప్రకారం రెండు రాష్ట్రాలు నీటిని వినియోగించుకోవాలి. ఆ తర్వాతే విద్యుదుత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలి. సాగు, తాగునీటిని దృష్టిలో పెట్టుకుని, జూలై 1 నుంచి అక్టోబర్ 31 వరకు శ్రీశైలంలో కనీస మట్టం 854 అడుగుల కంటే ఎగువన నీటిని నిల్వ చేయాలి. వరద తగ్గాక అవసరమైన మేరకు మాత్రమే విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు నీరు విడుదల చేయాలి.
- ▲ నాగార్జునసాగర్ నిర్వహణ విధి విధానాలపై (రూల్ కర్వ్స్) రెండు రాష్ట్రాలు తమ అభిప్రాయాలను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)కు తెలియజేసి, ఖరారు చేసుకోవాలి.

మిగులు జలాలను కోటాలో కలపొద్దు

- ▲ వరద రోజుల్లో కృష్ణా ప్రధాన పాయపై జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల గేట్లను ఎత్తేసి.. ప్రకాశం బ్యారేజ్ నుంచి సముద్రంలోకి జలాలు కలుస్తున్న సమయంలో రెండు రాష్ట్రాలు ఎవరు ఏ మేరకు మళ్లించినా.. ఆ జలాలను మిగులు జలాలుగానే లెక్కకట్టాలి. ఆ ప్రాజెక్టుల గేట్లు మూసేశాక వాడుకునే నీటిని ఆయా రాష్ట్రాల నికర జలాల కోటాలో కలపాలి.
- ▲ ఆర్‌ఎంసీ స్థానంలో జలాశయాల శాశ్వత నిర్వహణ కమిటీ(పీఆర్‌ఎంసీ)ని ఏర్పాటు చేసి.. ఉమ్మడి జలాశయాల నిర్వహణను శ్రీ పర్యవేక్షించాలి.

సినీఫక్కీలో వైద్య విద్యార్థిని కిడ్నాప్

- యువతి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై దాడి.. ఫర్నిచర్ ధ్వంసం
- పోలీసుల గాలింపుతో హాలియా వద్ద యువతిని వదిలేసిన ముఠా

ఇబ్రహీంపట్నం రూరల్/తుర్కయంజాల్/సాక్షి, హైదరాబాద్ : శుక్రవారం ఉ.11.20. రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్నెగూడలో ఓ ఇల్లు.. ఆ ఇంటి యజమాని కుమార్తెకు పెళ్లిచూపులు.. ఆ సమయంలో మూడు వాహనాలు అక్కడికి దూసుకొచ్చాయి. వాటిలోంచి పదుల సంఖ్యలో దుండగులు కర్రలు, ఇనుపరాడ్లతో దిగారు. ఇంట్లో విధ్వంసం సృష్టించారు. అడ్డొచ్చిన ఇంటి యజమాని, ఇతర కుటుంబసభ్యులపై దాడిచేశారు. యువతిని కూడా కొడుతూ బలవంతంగా కారెక్కించి తీసుకెళ్లారు. ప్రేమ వ్యవహారం నేపథ్యంలో అంతా సినీఫక్కీలో జరిగిన ఈ సంఘటన తీవ్ర కలకలం సృష్టించింది. చివరకు యువతి క్షేమంగా బయటపడటంతో ఉత్కంఠకు తెరపడింది. వివరాలివీ..

పెళ్లికి నిరాకరణతో..

నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ముచ్చర్లపల్లికి చెందిన దామోదర్‌రెడ్డి, నిర్మల దంపతులు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మన్నెగూడలో ఉంటున్నారు. దామోదర్‌రెడ్డి మిలటరీ విశ్రాంత ఉద్యోగి. వీరి కుమార్తె (24) వైద్య విద్యార్థిని. మొయినాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీడీఎస్ హౌస్‌సర్జన్ చేస్తోంది. కరోనా సమయంలో.. బొంగ్లూర్ సమీపంలోని 'మిస్టర్ టీ' స్టాల్ నిర్వాహకుడు, నల్లగొండ జిల్లా ముషంపల్లికి చెందిన కొడుదుల నవీన్‌రెడ్డితో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. అప్పట్లో ఆమెను పెళ్లి చేసుకునేందుకు నవీన్‌రెడ్డి మధ్యవర్తులను పంపగా యువతి తల్లిదండ్రులు నిరాకరించారు. ఈ నేపథ్యంలో.. శుక్రవారం ఆ యువతికి పెళ్లిచూపులు ఏర్పాటుచేశారు. విషయం తెలుసుకున్న నవీన్‌రెడ్డి.. దుండగులను తీసుకుని యువతి ఇంటికొచ్చి బీభత్సం సృష్టించారు. కర్రలు, ఇనుపరాడ్లతో కిటికీలు, అద్దాలు పగలగొట్టి సామగ్రి, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. అడ్డొచ్చిన యువతి తండ్రి, మేనమామను కొట్టి తల్లిని కిందపడేశారు. యువతిని కొడుతూ కార్లో పడేసి తీసుకెళ్లారు. మరోవైపు.. యువతి ఇంటిముందే నవీన్‌రెడ్డి ఏర్పాటుచేసుకున్న గోదాం, స్థావరం, గదులను బాధిత కుటుంబ సభ్యులు జేసీబీతో కూల్చి ఫర్నిచర్‌కు నిప్పుపెట్టారు.

యువతి ఫోన్‌కాల్‌తో లొకేషన్ ట్రాక్..

యువతిని కిడ్నాప్ చేసిన నవీన్‌రెడ్డి కారులో నాగార్జునసాగర్ వైపు పరారయ్యాడు. పోలీసుల గాలింపుతో భయాందోళనకు గురైన కిడ్నాపర్లు హాలియా వద్ద యువతిని వదిలేసి వెళ్లినట్లు సమాచారం. యువతి 'క్షేమంగా ఉన్నా డాడీ..' అని తండ్రికి ఫోన్‌చేసింది. సెల్‌టవర్ ఆధారంగా పోలీసులు యువతిని గుర్తించి తండ్రికి అప్పగించారు. నవీన్‌రెడ్డి కోసం గాలిస్తున్నారు.

తెలంగాణ

ఎర్రకోటపై గులాబీ జెండా

భారత్ రాష్ట్ర సమితి ఆవిర్భావ కార్యక్రమంలో సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: 'భారత్ రాష్ట్ర సమితి అనే వెలుగు దివ్వెను దేశం నలుమూలలా విస్తరింపచేద్దాం. భరతమాత సంతృప్తిపడేలా తెలంగాణ కీర్తి కిరీటాన్ని ఆమె పాదాలవద్ద పెట్టి దేశ ప్రతిష్టను ద్విగుణీకృతం చేద్దాం. భారత్ రాష్ట్ర సమితితో మన ప్రయాణం కొనసాగించి భరతమాత సంతృప్తిని కళ్లారా చూద్దాం. తెలంగాణ కోసం బయలుదేరినప్పుడూ చాలామంది అవమానించి గొంతు నులిమే ప్రయత్నాలు చేశారు. అవన్నీ అధిగమించే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాం. ఇప్పుడూ కొంతమంది బాధలు, ఇబ్బందులు పెడతారు. పిరికితనం లేకుండా ముందుకు సాగుదాం. వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లగలిగాం కాబట్టే తెలంగాణ సాధించాం. అదే స్ఫూర్తితో వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకెళ్తే ఢిల్లీ ఎర్రకోట మీద గులాబీ జెండా ఎగరడం ఖాయం..' అని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సమితి(టీఆర్‌ఎస్) పేరును భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్)గా మార్చాలనే వినతికి కేంద్ర ఎన్నికల సంఘం అంగీకరించిన నేపథ్యంలో శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ పూజా కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం 1.20 గంటలకు బీఆర్‌ఎస్ పార్టీ ఏర్పాటు అధికారికపత్రాలపై పార్టీ అధినేతగా కేసీఆర్ సంతకాలు చేశారు. నిర్ణయించిన ముహూర్తం మేరకు 1.25 గంటలకు భారతదేశ చిత్రపటంతో కూడిన గులాబీ జెండాను ఆహ్వానితులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గం, పార్లమెంటరీ, లెజిస్లేచర్ పార్టీ, ఇతర ముఖ్య నేతల సమావేశంలో కేసీఆర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ తొలి నినాదం అబ్ కీ బార్..కిసాన్ సర్కార్ అని చెప్పారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

బొబ్బిలి: పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పూడి హరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని దిబ్బవీధి, అంట్యాకుల వీధి, సిరిపురపు వీధి, రత్నాలనగర్ ప్రాంతాల్లో ఉన్న 4 ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధి పనుల పరిశీలన


ఉపాధిపనులు పరిశీలిస్తున్న ఏపీఓ

వంగర: మండలంలో ఎం.సీతారాంపురం, వంగర, మద్దువలస, జగన్నాథవలస తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఏపీఓ ఎస్.సంగంనాయుడు శుక్రవారం పరిశీలించారు. పనులకు సకాలంలో హాజరుకావాలని, రెండు పూటలా పనులు చేస్తే గిట్టుబాటు వేతనం లభిస్తుందన్నారు. మెడికల్ కిట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు, సీనియర్ మేట్లకు సూచించారు.

వారం రోజుల్లో విద్యుత్ సౌకర్యం

- ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు, తదితరులు

మెంటాడ: జగనన్న కాలనీలకు వారం రోజుల్లో విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని మండల ప్రత్యేకాధికారి డి. వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కుంటినవలసలో హౌసింగ్ డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ డేవిడ్, ఎంపీడీఓ త్రివిక్రమ్, తహసీల్దార్ ఆదిబాబు పాల్గొన్నారు.

రేపు కన్యాశుల్కం ప్రదర్శన

బొబ్బిలి: పట్టణంలోని మున్సిపల్ ఆడిటోరియం కళాభారతిలో ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు కన్యాశుల్కం నాటకంలోని కొన్ని సీన్లను ప్రదర్శిస్తున్నట్టు యంగ్‌మెన్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు ఎం. విజయమోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు పోషించే పాత్రలతో ప్రదర్శితం కానున్న ఈ నాటకాన్ని పట్టణ ప్రజలు తిలకించాలని కోరారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి


యువకుడి మృతదేహం, (ఇన్‌సెట్‌లో) ఈశ్వరరావు(ఫైల్)

సబ్బవరం(పెందుర్తి): అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై బాటజంగాలపాలెం సమీపంలో ఓ బైక్ అదుపుతప్పి ముందువెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం మంచాడవలసకు చెందిన ఈశ్వరరావు(28) పెందుర్తి మండలంలోని పురుషోత్తపురం వద్ద గల అబ్బీస్ ఎక్స్‌పోర్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అనకాపల్లి సమీపం తోటాడలోని పొల్ట్రీస్ వద్ద కంపెనీకి సంబంధించిన మెటీరియల్ లోడింగ్ పనిపై ఈశ్వరరావు పెందుర్తి నుంచి గురువారం రాత్రి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. రాత్రంతా లోడింగ్ పని చూసుకుని శుక్రవారం వేకువజామున 4 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై పెందుర్తి బయలుదేరాడు. జాతీయ రహదారిపై వెళ్తూ బాటజంగాలపాలెం సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టి రోడ్డుపై పడిపోయాడు. ఈ ఘటనలో ఆయన తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తండ్రి వెంకటరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

రైతులు ఇబ్బంది పడకూడదు..


మాట్లాడుతున్న మండల స్థాయి వ్యవసాయ సలహా సంఘ వైస్ చైర్మన్ తెంటు సత్యంనాయుడు

తెర్లాం: ధాన్యం కొనుగోలులో రైతులు ఇబ్బంది పడకూడదని మండల వ్యవసాయ సలహా సంఘం వైస్ చైర్మన్, కుసుమూరు సర్పంచ్ తెంటు సత్యంనాయుడు అన్నారు. మండలంలోని కుసుమూరు ఆర్‌బీకేలో మండల స్థాయి సలహా సంఘ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేయాలని సూచించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి జి.సునీల్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, మండల వ్యవసాయ సలహా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల అఫిలియేషన్‌కు 23 వరకు గడువు

రాజాం సిటీ: ప్రైవేట్ జూనియర్ కళాశాలల గుర్తింపునకు సంబంధించి అప్లికేషన్ సమర్పించేందుకు ఈ నెల 23తో గడువు ముగుస్తుందని శ్రీకాకుళం ఆర్‌ఐఓ శివ్వాల తవిటినాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 ఏడాదికిగాను రెన్యువల్ చేసుకునేందుకు ముందస్తుగానే ఇంటర్మీడియెట్ బోర్డు అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. 23వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 24 నుంచి 30 వరకు రూ.10 వేల అపరాధ రుసుంతో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తునకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని రాజాం, పాలకొండ నియోజకవర్గాల్లోని ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాల్స్ అందరూ ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

12న వాహనాల వేలం

బొబ్బిలి: పట్టణంలోనిఎస్‌ఈబీ కార్యాలయం ఆవరణలో ఈనెల 12న ద్విచక్ర వాహనాల వేలం నిర్వహించనున్నట్లు సీఐ ఆర్. జైభీమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం ప్రక్రియ ఈ నెల 10న జరగాల్సి ఉండగా.. కొన్ని కారణాల వల్ల 12కి మార్చినట్లు పేర్కొన్నారు. విజయనగరం ఏఈఎస్ శైలజారాణి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 గంటలకు జరగనున్న వేలంలో ఆసక్తి గల వారు పాల్గొనాలని కోరారు.

యోగాతో ఒత్తిడి దూరం

రాజాం సిటీ: ప్రతి ఒక్కరికీ యోగాపై అవగాహన ఎంతో అవసరమని యోగా గురువు భిక్షమయ్య అన్నారు. స్థానిక చీపురుపల్లి రోడ్డులోని నటరాజ్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రాత్రి యోగాపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 10న దివ్యసంకల్ప జ్ఞానయజ్ఞంలో భాగంగా ఉచిత అంతర్ముఖ యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. దయనందిన జీవితంలో ప్రతి ఒక్కరు ఒత్తిడికి గురౌతున్నారని, అటువంగి ఒత్తిడి నుంచి బయటపడేందుకు యోగా దివ్య ఔషధంలా పనిచేస్తుందని వివరించారు.

ముగిసిన శిక్షణ


మాట్లాడుతున్న ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు

రేగిడి: మండల పరిషత్ సమావేశ మందిరంలో నాలుగు రోజులుగా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు మాట్లాడుతూ..శిక్షణలో తెలుసుకున్న విషయాలను పాటించడం ద్వారా పంచాయతీ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీల సహకారంతో బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతీ పంచాయతీలో రికార్డుల నిర్వహణ చక్కగా ఉండాలన్నారు. చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు ఉపయోగపడేవిధంగా ఉండాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ఎ.నాగభూషణరావు, సీనియర్ అసిస్టెంట్ వెంకటరావు, కందిశ పంచాయతీ సర్పంచ్ కెల్ల పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

11న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

బొబ్బిలి: విజయనగరం–నెల్లిమర్ల మధ్యలో గల జగన్నాథ కల్యాణ మంటపంలో ఈనెల 11న నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశానికి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు జరగనున్న కార్యక్రమానికి టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణలు హాజరవుతారని పేర్కొన్నారు.

యువత సాధికారతకు పెద్దపీట

- జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గోవిందరావు


మాట్లాడుతున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గోవిందరావు

రామభద్రపురం: యువత సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్. గోవిందరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ, నిరుద్యోగ యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ప్రారంభించామన్నారు. బొబ్బిలి, చీపురుపల్లి, ఎస్.కోట, విజయనగరం, రాజాం నియోజకవర్గ కేంద్రాలలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆయా కేంద్రాల్లో ఎంపిక చేసిన అభ్యర్థులకు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ (ఎంఎస్ ఆఫీస్, బేసిక్, కంప్యూటర్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ విభాగంలో శిక్షణ), ఎలక్ట్రీషియన్, ఫీల్డ్ టెక్నీషియన్, ఎయిర్ కండిషన్, తదితర విభాగాల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. త్వరలో గజపతినగరం, నెల్లిమర్లలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు. జిల్లాలోని ఇప్పటివరకు 37 జాబ్‌మేళాలు నిర్వహించి సుమారు 1853 మందికి బహుళజాతి కంపెనీలలో ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ రామలింగేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ చొక్కాపు శ్రీరాములునాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతు పక్షపాతి

- ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు


మాట్లాడుతున్న ఎంపీపీ నాయుడు, తదితరులు

మెంటాడ: రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌బీకేలో నిర్వహించిన వ్యవసాయ మండలి సలహా సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం విధించిన నూతన విధానాల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న పలు అవగాహన కార్యక్రమాల్లో రైతులు పాల్గొని, సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఎ.డి మహరాజన్, మండల వ్యవసాయశాఖ ఇన్‌చార్జ్ గోవిందమ్మతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ చలానాల వసూలు


వాహన పత్రాలను పరిశీలిస్తున్న సీఐ రవికుమార్

రాజాం సిటీ: వాహన తనిఖీల్లో భాగంగా విధించిన చలానా వసూళ్లకు చర్యలు చేపడుతున్నామని సీఐ కె.రవికుమార్ తెలిపారు. పట్టణంలోని పలుకూడళ్లలో శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న చలానాలను వసూలు చేశారు. ప్రతి ఒక్కరూ రోడ్డుభద్రత నిబంధనలు పాటించాలని, ప్రమాదాల నివారణకు తమవంతు బాధ్యత వహించాలని సూచించారు. హెల్మెట్, సరైన వాహన ధ్రువపత్రాలు లేనివారిపై అపరాధ రుసుం విధించారు. ఆయనతో పాటు ఎస్సై పి.నీలావతి, సిబ్బంది ఉన్నారు.



అసలే శీతాకాలం.. ఆపై అల్పపీడన ప్రభావంతో చలిగాలులు వణికిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. వృద్ధులు, చిన్నారులు చలికి గజగజ వణికిపోతున్నారు. దీనికి తోడు పొగమంచు దట్టంగా కురుస్తుండడంతో రేగిడిలో ఉదయం 8 గంటలైనా రోడ్లు కనిపించక వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

– రేగిడి

న్యూస్ మేకర్/ రివాబా జడేజా


● రివాబా జడేజా


● నైనాబా జడేజా

ఆడపడుచు ప్రత్యర్థి వైపు నిలిచినా
కోడలు గెలిచింది

ఇంటిలోన పోరు ఇంతింత కాదయా అన్నారు. ఆ సందర్భం వేరు. ఇక్కడ కూడా ఇంటిలోని పోరే. ఈ సందర్భం వేరు. క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య రివాబా గుజరాత్ ఎన్నికల్లో నిలబడింది. ఆడపడుచు నైనాబా ఆమెకు సింహస్వప్నంగా మారింది. వదిన ఓటమి కోసం ఆమె చేయని ప్రచారం ప్రయత్నం లేదు. కోడలికి మద్దతు ఇవ్వకుండా కూతురు పక్షం చేరారు మామగారు. భర్త రవీంద్రకు ఇరకాటం ఉన్నా భార్య పక్షాన నిలిచాడు. రివాబా 50 వేల భారీ మెజార్టీతో గెలిచింది. ఈ గెలుపులో ఎన్నో మలుపులు. టీవీ సీరియల్ వంటి మెరుపులు.

‘ఆడపడుచు అర్ధమొగుడు’ అనే మాట ఎవరు అన్నారోగాని మొన్నటి గుజరాత్ అసెంబ్లీ ఎలక్షన్లు జరిగినన్నాళ్లు రివాబా జడేజా(33)కు ఆ మాట గుర్తుకొస్తూనే ఉండి ఉంటుంది. బాల్‌ను బ్యాట్‌తో పిచ్చిగా బాదుతాడనే పేరు గడించిన క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య అయిన రివాబా జడేజా ఏకంగా నరేంద్ర మోడి ఆశీస్సులతో బి.జె.పి అభ్యర్థిగా జామ్‌నగర్ నార్త్ నియోజకవర్గం నుంచి పోటీకి దిగింది. ఆమెకు కాంగ్రెస్, ఆప్ పార్టీల అభ్యర్థులు ప్రత్యర్థులు. కాని అసలు ప్రత్యర్థిగా మాత్రం ఆడపడుచు నైనాబా నిలిచింది. దానికి కారణం ఆమె కాంగ్రెస్ మద్దతుదారు. రవీంద్ర, నైనాల తండ్రి అనిరుధ్ సింగ్ కూడా కాంగ్రెస్ మద్దతుదారుడే. అంటే ఇంట్లో ఆడపడుచు, మామగారు కాంగ్రెస్ పార్టీ. రివాబా బి.జె.పి. ఎలక్షన్ గెలవాలి... అలాగే ఇంటిలోని బంధాలు చెదిరిపోకుండా నెగ్గుకురావాలి. ఆ విధంగా రివాబాకు ఈ ఎన్నిక కత్తి మీద సాము అయ్యింది.

నైనాబా వ్యతిరేకత

నైనాబాకు బి.జె.పి అంటే అస్సలు గిట్టదు. బి.జె.పి పాలన వల్ల రాష్ట్రంలో అంతా నష్టమే జరుగుతోందని ఆమె అభిప్రాయం. అందుకే 2019లో కాంగ్రెస్ పార్టీలో చేరింది. తండ్రి కూడా చేరాడు. నైనాబా ఏ వేదిక దొరికినా దేశంలో ధరల పెరుగుదల గురించి, నిరుద్యోగ సమస్య గురించి మాట్లాడి బి.జె.పిని తూర్పార పడుతుంది. కాంగ్రెస్ పార్టీ నుంచి ఆమె సీట్ ఆశించింది కాని అది జరగలేదు. ఈలోపు ఏకంగా ఆమె వదిన, సోదరుడు రవీంద్ర భార్య అయిన రివాబాకు బి.జె.పి పిలిచి మరీ పార్టీ టికెట్ ఇచ్చింది. అందుకు తమ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే ధర్మేంద్ర సింగ్ జడేజాను పక్కన పెట్టింది. వదిన బి.జె.పిలో చేరడం నైనాబాకు బొత్తిగా నచ్చలేదు. అలాగని ఇంటి వరకు ఆమెతో అనుబంధాన్ని వదలుకోదలుచుకోలేదు. దాంతో పాటు బి.జె.పి అభ్యర్థిగా వదిన గెలవడాన్ని సహించనూ లేదు. దాంతో ఇంటి బయటి యుద్ధానికి తెర లేపింది.

అన్ని అస్త్రాలు

రివాబా తన ఆడపడుచు గురించి జాగ్రత్తగానే ఉంది. పెద్దగా విమర్శలు సంధించలేదు. కాని నైనాబా మాత్రం నిర్దాక్షిణ్యంగా వదిన రివాబా మీద అస్త్రాలు సంధిస్తూనే వెళ్లింది. ‘మా వదినది రాజ్‌కోట్. ఆమె ఒక కోడలిగా జామ్‌నగర్ వచ్చింది. ఆమె ఈ ప్రాంతానికి కొత్త. నాన్ లోకల్. ఆమెను గెలిపించాల్సిన అవసరం ఎంతమాత్రం లేదు’ అని వీధి వీధి ప్రచారం మొదలెట్టింది. కాంగ్రెస్ అభ్యర్థి బిపెందర్ సింగ్‌కు ఓటేయమని కోరింది. అభ్యర్థిత్వం కోసం రివాబా సమర్పించిన అఫిడవిట్‌లో ఆమె పేరు ‘రివా సింగ్ సోలంకి’ అని ఉంది. దీనిని కూడా నైనా పట్టుకుంది. ‘చూశారా... మా వదినకు పెళ్లయ్యి ఆరేళ్లయినా తన ఇంటి పేరును అధికారికంగా మార్చుకోలేదు. అంత తీరిక లేదా ఆమెకు’ అని పబ్లిక్‌లో చర్చ పెట్టింది. రివాబా తన ప్రచారంలో ఐదేళ్ల కుమార్తెను ఒకటి– రెండుసార్లు తీసుకు వచ్చింది. దానికి కూడా అబ్జెక్షన్ చెప్పింది నైనా. ‘పిల్లల్ని చూపించి మా వదిన సెంటిమెంట్ పండించాలని అనుకుంటోంది. పిల్లల్ని ప్రచారానికి తీసుకు రాకూడదు. ఇది చైల్డ్ లేబర్ కిందకు వస్తుంది’ అని ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. అయితే రివాబా మాత్రం ‘రాజకీయాలు వారి వారి వ్యక్తిగతమైనవి. కుటుంబంగా మేమంతా ఒకటి’ అని చెప్పింది.

కాంగ్రెస్‌కు ఓటు వేయమని మామగారు వీడియో రిలీజ్ చేసినా ఆమె ఎదురు విమర్శలు చేయలేదు.

భర్త తోడుగా

ఇంట్లో తండ్రి, చెల్లెలు కాంగ్రెస్ పార్టీ కోసం బ్యాటింగ్ చేస్తుంటే రవీంద్ర తన భార్య కోసం ప్రచార బాధ్యత తీసుకున్నాడు. భార్యకు అన్ని విధాలా సపోర్ట్‌గా నిలిచాడు. ఆమె గెలుపు కోసం రోడ్ షోలు నిర్వహించాడు. దాదాపు 2 లక్షల పై చిలుకు ఓట్లు ఉన్న నియోజకవర్గం అది. రాజ్‌పుట్‌ల ప్రాబల్యం ఎక్కువ. పోటీలో ఉన్న ప్రధాన అభ్యర్థులు అదే సామాజిక వర్గానికి చెందిన వారు. అందువల్ల గెలుపు అంత సులువు కాదు. దానికి తోడు చెల్లెలి బెడద. అందుకే రవీంద్ర చెమట చిందించాడు. డిసెంబర్ ఒకటిన జామ్‌నగర్ నార్త్‌లో పోలింగ్ జరిగింది. 8వ తేదీ భారీ మెజార్టీతో రివాబా విజయం సాధించింది.

‘హలో ఎం.ఎల్.ఏ. నువ్వు ఈ విజయానికి నిజంగా తగినదానివి’ అని సంతోషంగా రవీంద్ర జడేజా భార్యను ఉద్దేశించి ట్వీట్ చేశాడు.

పార్టీ అభ్యర్థిగా రివా గెలిచింది. కోడలిగా ఆమె ఇంటిలోనూ అదే పని చేయాల్సి ఉంది.

చేర్యాల చిత్రాలలో
చరిత తెలంగాణ @75


● లక్ష్మి వక్కలంక

తెలంగాణ (హైదరాబాద్ రాష్ట్రం) విముక్తమై 75 ఏళ్లు అవుతున్న సందర్భంగా 75 చిత్రాల చిత్రమాలికను రూపొందిస్తున్నారు లక్ష్మి వక్కలంక. చేర్యాల నకాషీ పెయింటింగ్ ప్రక్రియను కొత్తగా నేర్చుకుని మరీ తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక ప్రస్థానాన్ని ‘స్టోరీ టెల్లింగ్ స్టైల్’లో ప్రదర్శించనున్నారు. పాతికేళ్లుగా దుబాయ్‌లో ఉంటున్న ఆమె, నాలుగు నెలల కిందట హైదరాబాద్‌కు వచ్చేశారు. అక్కడ ఓ ఎంట్రప్రెన్యూర్‌గా, మల్టీ మీడియా ప్రోగ్రామర్‌గా, ఆర్ట్ డైరెక్టర్, ప్రాజెక్ట్‌మేనేజర్‌గా పనిచేస్తూ, అక్కడి ఫేమస్ మ్యాగజైన్‌లలోనూ చిత్రాలు గీసేవారు. ప్రస్తుతం తెలంగాణ థీమ్‌గా ఆమె గీసిన, గీస్తున్న ‘చిత్రకథ’నం... సంక్షిప్త పరిచయం.

నిన్నమొన్నటివరకూ దుబాయ్‌లో ఆమె ఓ ఎంట్రప్రెన్యూర్. మొబైల్ యాప్స్ అభివృద్ధి చేసేవారు. మల్టీ మీడియా ప్రోగ్రామర్‌గా, ఆర్ట్ డైరెక్టర్‌గానూ పని చేశారూ, చేస్తున్నారు. భర్త వక్కలంక శ్రీనివాస్ ఫైన్ ఆర్ట్స్‌లో యూనివర్సిటీ టాపర్ కావడంతో తానూ పెయింటింగ్‌లో ఆసక్తి పెంచుకున్నారు. కేవలం అభిరుచితో సరి పెట్టుకోలేదు. తొలుత దుబాయ్‌లో పెయింటింగ్ పతాక ఎగరేశారు. మొదటే రచ్చ గెలిచి, ఇంట గెలవడం కోసమిప్పుడు నాలుగు నెలల కిందటే సొంతింటి ముంగిటి ముగ్గుపై కుడికాలు పెట్టారు. ఆమే లక్ష్మి వక్కలంక.

తెలంగాణ (హైదరాబాద్ స్టేట్) విముక్తమై 75 ఏళ్లు నిండుతున్న తరుణంలో తెలంగాణ థీమ్‌తో చేర్యాల పెయింటింగ్స్ స్టైల్లో 75 చిత్రాలతో ప్రదర్శన నిర్వహించడంతో పాటు తానో పెయింటర్‌గా జాతీయ స్థాయిలోనూ నిలవాలని తపిస్తున్నారు. అంతేకాదు... ఈ చిత్రకారిణి... హ్యాండ్ పెయింటెడ్ జ్యువెలరీ, ఆర్టిఫిషియల్ జ్యువెలరీ పెయింటింగ్స్‌నూ రూపొందిస్తుంటారు. కేవలం కాన్వాస్‌పై చిత్రీకరణలతో సరిపెట్టుకోలేదు... యూఏఈలో ప్రముఖ కలినరీ మ్యాగజైన్ ‘గల్ఫ్ గార్మే(ట్)’, అక్కడి పర్యాటక ప్రదేశం ‘అల్ అయిన్’ అందాలను ‘విజిట్ అల్ అయిన్’లోనూ చిత్రాలు గీశారు.


● తెలంగాణ థీమ్ చిత్రం




● అలనాటి దుబాయ్ ప్రదర్శన పెయింటింగ్స్

తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక పయనాన్ని చిత్రీకరించేలా నాటి శాలివాహన చక్రవర్తులు, కాకతీయ సమ్రాట్టులు మొదలుకొని నేటి పాలకుల వరకు, చాకలి ఐలమ్మ వంటి వీరుల పోరాటపటిమలూ, తెలంగాణ వేడుకల బతుకమ్మ బొమ్మలు, బమ్మెర పోతనా–రామదాసాహితీకారులూ, ఒగ్గు కథల్లాంటి సంస్కృతీరూపాలు, నిర్మల్ పెయింటింగ్ నిరుపమాన చిత్రాలు, బిర్యానీ, బ(ం)గారాల ‘కలినరీ’తుల ‘రుచి’త్రాలు, భాగమతీ, కులీల లీల చిత్రాల, ఇక్కడి కవిగాయకవైతాళికులే కాదు... ఆధునిక ప్రాజెక్టులు మిషన్ భగీరథ వంటివీ గీస్తూ, త్వరలోనే వాటితో ప్రదర్శనకు సన్నాహాలు చేస్తున్నారు.

‘‘దుబాయ్‌లో ఉన్నప్పుడు అక్కడ యూఏఈ ఏర్పడి 50 ఏళ్లు పూరయి, గోల్డెన్ జూబిలీ ఉత్సవాలు జరుగుతున్న సందర్భంలో 50 చిత్రాల్ని... అక్కడి దేశీయ, సాంస్కృతిక ప్రతీకలనూ, అభివృద్ధి చిహ్నాలను ‘యూఏఈస్ అకంప్లిష్‌మెంట్స్ అండ్ యాంబిషన్స్’ థీమ్‌తో చిత్రాలు గీశాను. దుబాయ్ వరల్డ్ ట్రేడ్ సెంటర్ నిర్వహించే ‘‘వరల్డ్ ఆర్ట్ దుబాయ్’’ అనే ఎగ్జిబిషన్‌లో ప్రదర్శన నిర్వహించాను. ఒక్కోచిత్రం గీయడానికి రోజులో 18 గంటల కంటే ఎక్కువే కష్టపడ్డాను. ఆ చిత్రాలకు ఎంత మంచి రెస్పాన్స్ వచ్చిందంటే అక్కడి సాంస్కృతిక విభాగం వారు... తమ ఆరోగ్య విభాగం వాళ్లు నిర్మించే అక్కడి ఓ కొత్త భవనంలో అమర్చుకోడానికి అనుమతిని అడిగి తీసుకున్నార’’ని తెలిపారు.


● తెలంగాణ థీమ్ చిత్రం

‘‘దుబాయ్ ప్రదర్శనలో నేను ఎంచుకున్న మీడియం యాక్రిలిక్, మిక్స్‌డ్ మీడియా పెయింటింగ్. కానీ తెలంగాణ సంస్కృతీ చిహ్నాల కోసం నేను చేర్యాల నకాషీ పెయింటింగ్ పద్ధతిని రెండు నెలల పాటు అభ్యసించాను. చేర్యాల వెళ్లి స్వాభావికమైన అక్కడి రంగులు రూపొందించే పద్ధతులు నేర్చుకున్నాను. నేను ప్రాక్టీస్ చేసిన ప్రక్రియలో కాకుండా, ప్రస్తుతం చేస్తున్న తెలంగాణ వర్క్‌ను చేర్యాల పెయింటింగ్ పద్ధతుల్లో చేయడానికి కారణముంది. ఇది స్టోరీ టెల్లింగ్‌కు బాగా ఉపకరిస్తుంది. అందుకే అనాది నుంచి అనూచానంగా రామాయణ, భారత, భాగవత గాథల్ని చేర్యాల శైలితో చిత్రీకరించి చెబుతుంటారు. తెలంగాణ కథను చిత్రాలతో చెప్పడానికే స్టోరీటెల్లింగ్‌కు అనువైన ఈ శైలిని ఎంచుకున్నాను. దుబాయ్‌లో కంటే ఎక్కువగా ఇక్కడ మరింతగా కష్టపడుతున్నాను. మార్చిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడంతో పాటు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న మన రాష్ట్రంలోనూ ప్రదర్శనకు ఉంచాలని పాటుపడుతున్నాను. దాదాపు పని పూర్తయ్యిందిగానీ... చిత్రాల్ని చిత్రికపట్టే పని కొంత మిగిలి ఉంది’’ అన్నారు లక్ష్మి.

– సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

దర్పణం

స్టేటస్ సింగిల్

ఇప్పటికీ మన దేశంలో చాలామంది మహిళలు ‘స్టేటస్ సింగిల్’ అనే పేరు వాడటాన్ని కూడా భయపడతారు. ఈ విషయాన్ని గ్రహించిన శ్రీమోయి కుందు దేశంలోని ఒంటరి మహిళల కోసం ‘స్టేటస్ సింగిల్’ పేరుతో ఫేస్‌బుక్ గ్రూప్‌ను ఏర్పాటు చేసింది. ఈ గ్రూప్‌లోని మహిళలు ఇటీవల ఢిల్లీలో కలుసుకుని, సమాజంలో తాము ఒంటరిగా ఎదుర్కొంటున్న సమస్యలు, సాధిస్తున్న విజయాలపై స్పందించారు. మన దేశంలో 7.14 కోట్లమంది ఒంటరి మహిళలు ఉన్నారని, ఈ సంఖ్య ప్రతి యేటా పెరుగుతుందని చెబుతున్న ఈ సంఘం గురించి, మారుతున్న ‘ఒంటరితనం ముఖం’ తెలుసుకోవాల్సిన తరుణమిది.


● ‘స్టేటస్ సింగిల్’ సభ్యులతో ఫౌండర్ శ్రీమోయి కుందు (మధ్యలో)

‘స్టేటస్ సింగిల్’ అనేది పట్టణ, ఒంటరి మహిళలకు ఉన్న ఏకైక వేదిక అని చెప్పవచ్చు. ఇది పెళ్లికాని యువతులు, వితంతువులు, విడాకులు తీసుకున్న, విడిపోయిన, వికలాంగ ఒంటరి మహిళల కోసం ఏర్పడిన ఒక సమూహం.

ఒంటరినని గర్వంగా..

సాధారణంగా భారతీయ మహిళలు, అమ్మాయిల అతి ముఖ్యమైన జీవిత లక్ష్యం వివాహం. కానీ, పెద్ద సంఖ్యలో మహిళలు ఇప్పుడు ఒంటరిగా ఉండటాన్ని ఎంచుకోవడం ద్వారా వారి స్వతంత్ర మార్గాన్ని నమోదు చేస్తున్నారు. దక్షిణ ఢిల్లీలోని కరేబియన్ లాంజ్‌లో కలుసుకున్న ఈ మహిళ గ్రూప్‌తో ఆ గది అంతా వారి కబుర్లు, నవ్వులతో నిండిపోయింది. ‘మనల్ని మనం వితంతువులు, విడాకులు తీసుకున్నవారు, అవివాహితులుగా అభివర్ణించుకోవడం మానేద్దాం’ అని ఆ గ్రూప్ ఫౌండర్ శ్రీమోయి కుందు సమావేశంలో చెబుతున్నారు. దానికి అక్కడి గ్రూప్ మహిళలంతా ‘సింగిల్ అని మనల్ని మనం గర్వంగా పిలుచుకుందాం’ అని ముక్తకంఠంతో అన్నారు. మహిళలంతా చప్పట్లు కొడుతూ హర్షం వ్యక్తం చేయడం చూసినవారికి సమాజంలో ఒంటరి మహిళల పరిస్థితి గురించి అర్థం చేసుకోవచ్చు అనిపించకమానదు.

అవమానాల భయం

గ్రామీణ భారతంలో ఒంటరి స్త్రీలను తరచుగా వారి కుటుంబాల్లో భారంగానే చూస్తారు. అయితే, నేటి రోజుల్లో జనాదరణ పొందిన సంస్కృతిలో ఒంటరి మహిళలు కూడా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పెళ్లి కాని వారితో సహా మహిళలందరికీ అబార్షన్‌కు సమాన హక్కులు ఉన్నాయని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అత్యున్నత న్యాయస్థానం ఒంటరి మహిళల హక్కులను గుర్తించిందని తెలియజేశారు.

సంపన్న వర్గాల్లోనూ మహిళ ఒంటరిగా ఉండటం అంత సులభం కాదంటూ ‘నేను ఒంటరి మహిళగా వివక్ష, ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నాను. కుటుంబం నుంచి విడిపోయాక ముంబైలో అపార్ట్‌మెంట్‌ని అద్దెకు తీసుకోవాలని చూస్తున్నప్పుడు, హౌసింగ్ సొసైటీ సభ్యులు నన్ను, మీరు తాగుతారా? మీరు లైంగికంగా చురుకుగా ఉన్నారా?’ వంటి ప్రశ్నలు అడిగారు’ అన్నారు నీతూ ఆవేదనగా.

నూరు మిలియన్లు క్రాస్!

2001లో 5.12 కోట్లుగా ఉన్న సింగిల్స్ 2011 లో 7.14 కోట్లకు పెరిగారు. కోవిడ్ కారణంగా 2021లో జనాభా లెక్కింపులో ఆలస్యమైంది. లేదంటే ఇప్పటికే మా సంఖ్య 10 కోట్లు (100 మిలియన్లు) దాటి ఉండేది’ అని ఎమ్ఎస్ కుందు వివరించారు. ఇటీవల వివాహ వయస్సు పెరిగిందనే వాస్తవం ద్వారా ఈ శాతంలో కొంత పెరుగుదల ఉండవచ్చు. అయితే, 20 ఏళ్ల వయసులోనే ఒంటరి స్త్రీలు, అదీ పెద్ద సంఖ్యలో వితంతువులు కూడా ఉన్నారు. ఒంటరి మహిళలను కలిసినప్పుడు వారు వివాహం అనే భావనను తిరస్కరిస్తున్నారు. ఇది స్త్రీలను అన్యాయం చేసి, అణచివేసే పితృస్వామ్య సమాజం’ అంది కుందు.



సముద్రంలో బిందువు..

‘ఒక పురుషుడు తోడు లేని స్త్రీ సమాజంలో ఎలా అట్టడుగున ఉంచబడిందో నేను చూశాను. ఏ సంప్రదాయ సమూహ కార్యక్రమంలోనూ ఆమె పాల్గొనడాన్ని ఎవరూ ఇష్టపడరు. అలాగే, వితంతు నీడ అశుభమైనదిగా పరిగణిస్తారు. 44 ఏళ్ల వయసులో మా అమ్మ ప్రేమించి, మళ్లీ పెళ్లి చేసుకున్నప్పుడు ఆమె సమాజ ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది అని తన తల్లికి జరిగిన అవమానం గురించి, అది తనపై చూపిన ప్రభావం గురించి చెప్పింది మైత్రి. ఢిల్లీకి సమీపంలోని గురుగ్రామ్‌కు చెందిన లైఫ్ కోచ్ భావన మాట్లాడుతూ ‘సమాజంలో పితృస్వామ్య పరిస్థితులే ఒంటరి మహిళల సంఖ్య పెరగడానికి కారణమని’ అభిప్రాయపడ్డారు.

మేం ఈ రోజు సముద్రంలో ఒక బిందువు కావచ్చు. కానీ, ఒక బిందువుగానైనా ఉండగలిగినందుకు సంతోషంగా ఉన్నాం’ అని తెలియజేసుకున్న ఈ సమూహ సభ్యులు తమ భవిష్యత్తు ప్రయోజనకర కార్యక్రమాలకు రూపకల్పనలను జోడించారు.

బ్యూటిప్స్

పట్టుకుచ్చులాంటి కేశాలకోసం

- తలస్నానం పూర్తయ్యాక ఒక మగ్గు నీటిలో ఒక కప్పు వెనిగర్ కలిపి పోసుకుంటే నిర్జీవంగా ఉండే జుట్టు ఆరోగ్యంగా మెరుస్తుంది.
- కొబ్బరినూనెలో మందార పూలు వేసి కాచి వడపోయాలి. ఈ నూనెను రోజూ తలకు పెట్టుకుంటే జుట్టు రాలడం తగ్గుతుంది. జుట్టు ఒత్తుగా మారుతుంది.
- వెచ్చటి కొబ్బరినూనెతో తలకు మర్దన చేసి తర్వాత తలకు వేడి నీటిలో ముంచిన టవల్ చుట్టి గంటసేపు ఉంచి, ఆ తరువాత తలస్నానం చేస్తే జుట్టు మెత్తగా పట్టుకుచ్చులా మారుతుంది.
- తలకు శనగపిండి పట్టించి అన్నం వార్చిన గంజితో తల రుద్దాలి. ఇది కేశాలకు సహజసిద్ధమైన కండిషనర్.
- వారానికొకసారి టీ డికాషన్‌తో తలస్నానం చేస్తే జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. కుంకుడుకాయ, శీకాయ పొడులతో తలస్నానం చేసే వాళ్లు ఆ పొడిలో టీ డికాషన్ కలుపుకోవచ్చు లేదా షాంపూతో రుద్దుకున్న తర్వాత టీ డికాషన్‌తో రుద్దుకోవాలి.
- శీకాయ పొడిలో ఎండిన ఉసిరి కాయల పొడి, నిమ్మతొక్కల పొడి కలుపుకుని వాడితే జుట్టు రాలడం తగ్గి నల్లబడుతుంది.

కళ

కలల నుంచి కన్నీళ్ల వరకు

‘సినిమా సినిమా ఏంచేస్తావు?’ అని అడిగితే– ‘ఆకాశంలోకి తీసుకెళ్లి చుక్కలతో స్నేహం చేయిస్తాను. నిన్ను పుష్పకవిమానంలో కూర్చోబెట్టి దేశదేశాలు తిప్పుతాను. నువ్వు ఉన్నచోట అంగుళం కూడా కదలకుండా అంతరిక్షం వరకు తీసుకువెళతాను’ అన్నదట. అయితే కేరళ అంతర్జాతీయ చిత్రోత్సవంలో ప్రదర్శితమయ్యే మహిళా దర్శకుల చిత్రాలు నేల విడిచి సాము చేయవు. నేల మీద ఉండే మహిళల సమస్యలను, అంతరంగాన్ని కళ్లకు కడతాయి.



తిరువనంతపురంలో ప్రారంభమైన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ కేరళ (ఐఎఫ్ఎఫ్‌కె)లో 70 దేశాలకు చెందిన 185 చిత్రాలను ప్రదర్శించబోతున్నారు. వీటిలో 17 దేశాలకు చెందిన 32 మంది మహిళా దర్శకుల చిత్రాలు ఉన్నాయి. ఇవా అనే టీనేజ్ అమ్మాయి భావోద్వేగాలు ‘ఐ హ్యావ్ ఎలక్ట్రిక్ డ్రీమ్స్’ చిత్రానికి మూలం. బెల్జియం ఫిల్మ్ డైరెక్టర్ వాలెంటీనా మారెల్ తీసిన ఈ చిత్రంలో ఇవా ఆమె చెల్లి, తల్లి, తండ్రితో పాటు ఒక పిల్లి కూడా ప్రధాన పాత్రలు. విడి విడి ప్రపంచాలుగా కనిపించే ప్రేమ, ద్వేషాలు కొన్నిసార్లు కలిసిపోయి ఉంటాయి.వాటి మధ్య ఉన్న సన్ననిరేఖపై ఈ చిత్రం దృష్టి పెట్టింది.



● నందితాదాస్ దర్శకత్వం వహించిన ‘జ్విగాటో’ మధ్యతరగతి జీవితాన్ని ప్రతిబింబిస్తుంది

ఫిన్‌లాండ్ ఫిల్మ్ డైరెక్టర్ అల్లి హప్పలో తీసిన చిత్రం గర్ల్ పిక్చర్. అల్లి తల్లిదండ్రులు ఇద్దరూ న్యాయవాదులే. ‘ఇన్‌ఫర్‌మేషన్ సైన్స్’లో పట్టా పుచ్చుకున్నప్పటికీ అల్లి మనసంతా సృజనాత్మకరంగంపైనే ఉండేది. దీంతో మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ చేసింది. మిమ్మి, రోన్కో, ఎమ్మి అనే ముగ్గురు అమ్మాయిలపై తీసిన ఈ చిత్రం కలలు, వాస్తవాలు, స్నేహం, సంబంధబాంధవ్యాల చుట్టూ తిరుగుతుంది. జులియా మారట్ (బ్రెజిల్) తీసిన ‘రూల్ 34’ ఒక యంగ్ లా స్టూడెంట్ కేంద్రంగా సాగే కథ. అంతర్జాల ‘నీలి’ నీడల పెడ పోకడలకు ‘రూల్ 34’ అద్దం పడుతుంది. నందితాదాస్ దర్శకత్వం వహించిన ‘జ్విగాటో’లో బుల్లితెర ప్రముఖుడు కపిల్‌శర్మ ప్రధాన పాత్ర పోషించాడు. ఆయన భార్యగా షహన గోస్వామి నటించింది. మధ్యతరగతి కుటుంబానికి చెందిన భార్యాభర్తల జీవితాన్ని చెప్పే కథ ఇది. ఈ కథలో మనకు తెలిసిన వాళ్లు ఎంతోమంది కనిపిస్తారు. వాస్తవాలను పునాదిగా చేసుకొని అల్లుకున్న కాల్పనిక కథ ఇది. పదిహేడు దేశాలకు చెందిన ముప్పై రెండు మంది మహిళా దర్శకులు తీసిన ఈ చిత్రాలు మనిషి జీవితంలోని అంతర్, బహిర్‌ప్రపంచాలను వెండితెర మీదికి తీసుకువచ్చాయి.

ది స్పిరిట్ ఆఫ్ సినిమా

ఇరాన్ దర్శకురాలు, స్త్రీ హక్కుల కార్యకర్త మహ్నాజ్ మొహమ్మది ‘ది స్పిరిట్ ఆఫ్ సినిమా’ అవార్డ్‌కు ఎంపికైంది. ‘వుమెన్ వితౌట్ షాడోస్’ అనేది ఆమె తొలి డాక్యుమెంటరీ. నిరాశ్రయులైన మహిళల బాధలకు ఇది అద్దం పడుతుంది. రైల్లో ప్రయాణం చేస్తూ సామాన్యులను ఇంటర్వ్యూ చేస్తూ తీసిన ట్రావెలాగ్, భర్తను కోల్పోయిన ఇద్దరు పిల్లల తల్లి జీవనసంక్షోభాన్ని కళ్లకు కట్టే ‘సన్–మదర్’ అనే డాక్యుమెంటరీలకు మంచి పేరు వచ్చింది. ‘ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది మహిళలు ఎన్నో రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారు. సినిమా అనే మాధ్యమం ద్వారా వాటిని వెలుగులోకి తీసుకురావాలి. చర్చ జరగాలి’ అంటుంది మహ్నాజ్.


● మహ్నాజ్ మొహమ్మది

• హ్యాపీ వింటర్

ముసుగు తన్నకండి చురుగ్గా ఉండండి

శీతాకాలం లేవబుద్ధి కాదు. ముసుగు తన్ని పడుకున్న మంచాన్ని దిగ బుద్ధి కాదు. రోజంతా బద్ధకంగా ఉండాలనిపిస్తుంది. వెచ్చగా మూల కూచోవాలని ఉంటుంది. కొంతవరకే అలా ఉండండి. కాని శరీరాన్ని అదిలించాలి. కదిలించాలి. ఒంట్లో నుంచి ఉత్సాహం పుట్టించాలి. శీతాకాలం మూడ్‌ని డల్ చేయకుండా చూసుకోవాలి. అందుకు కొన్ని చిట్కాలున్నాయి. అవి పాటించండి.



మొదట ఇమేజిన్ చేసుకోవాలి. ఫిబ్రవరిలో టూర్ ఉంది. ఆ టూర్‌లో నాలుగడుగులు వేయలేక చతికిల పడితే లాభం లేదు. ఆ ఫిబ్రవరి టూర్ కోసం ఈ చలికాలం ఎక్సర్‌సైజులు చేయడం మానకూడదు అనుకోవాలి. సమ్మర్‌లో హుషారుగా తిరిగి పనులు చేసుకోవాలంటే వేసవి నాటికి బరువు ఇంకా తగ్గ చక్కగా కనిపించాలంటే ఈ చలికాలం మజ్జుగా ఉంచి బరువు పెరిగేలా చేయకూడదు అనుకోవాలి.

చలి మనిషిని భయపెడుతుంది. బయటకు వెళ్లాలంటే భయపెడుతుంది. స్నానానికి భయపెడుతుంది. వ్యాయామానికి భయపెడుతుంది. మెలకువకు భయపెడుతుంది. కొన్ని రకాల జంతువులు చలికాలం హైబర్‌నేట్ అవుతాయి. అంటే కదలికలు మానుకుంటాయి. మనిషికి ఆ సౌకర్యం, అనుమతి లేదు. మనిషి మహా అయితే ఎప్పుడైనా కాస్త ఎక్కువ ముడుక్కుని ఎనర్జీని రీ అసెర్ట్ చేసుకోగలడు అంతే.

వింటర్ జోష్

టైమ్ ఎప్పుడూ తక్కువే. వింటర్‌లో మన వాటా క్వాలిటీ టైమ్‌ను బద్ధకం వల్ల నష్టపోకూడదు. క్వాలిటీ టైమ్‌లో క్వాలిటీగా గడపాలంటే ఉత్సాహాన్ని పెంచుకోవాల్సిందే. అందుకు ఏం చేయాలి?

- ఉదయాన్నే లేవండి. వేడి నీళ్లు తాగండి. బద్ధకం అయితే పక్క మీద చేసే కొన్ని స్ట్రెచ్ ఎక్సర్‌సైజులు ఉంటాయి. ఆ తర్వాత యోగా మ్యాట్ మీద కొన్ని బేసిక్ ఆసనాలు వేయండి. ప్రాణాయామం, ధ్యానంతో పాటు చలికాలానికి ఉపయోగపడే ఆసనాలు నాలుగైదు ఉన్నాయి. వాటిలో 1. హస్త ఉత్తరాసన 2.పాద హస్తాసన 3.ఉష్ట్రాసన 4.హలాసన 5.భుజంగాసన. ఈ ఆసనాలతో శరీరాన్ని స్వాధీనంలోకి, చురుకుదనంలోకి తెచ్చుకోండి.
- వాకింగ్‌కు వెళ్లండి. కాని రోజువారి దుస్తులు కాకుండా వెచ్చని దుస్తులు, టోపీ ధరించి వెళ్లండి. చలి భయం ఉంటుంది కనుక ఇంట్లో మీరు ఆసనాలు వేశారు కాబట్టి ఒంట్లో వేడి పుట్టి హుషారుగా మీరు వాకింగ్ చేయగలరు. చేయండి.
- పార్కులో అయితే మీ నడక ద్వారా ఎనిమిది అంకెను వేస్తూ ఉత్తరం నుంచి దక్షిణానికి ఐదు నిమిషాలు తిరిగి దక్షిణం నుంచి ఉత్తరానికి ఐదు నిమిషాలు నడవండి. ఈ నడక మంచిది.
- ఇక డైట్ చాలా ముఖ్యం. చలికాలంలో శరీరాన్ని చురుగ్గా ఉంచే ఆహారాన్ని తీసుకోవాలి.
- ఒక్కోసారి ఇల్లు బొత్తిగా కదలబుద్ధి కాదు. అప్పుడు మంచి జోష్ ఉన్న సంగీతం పెట్టుకుని కనీసం పిచ్చి గంతులు వేయండి. రిథమిక్‌గా డాన్స్ చేయండి. ఇది మీ శరీరానికి ఉత్సాహం ఇస్తుంది.
- పని చేయాలన్నా వ్యాయామం చేయాలన్నా తోడు ఉంటే హుషారు వస్తుంది. ఈ శీతాకాలంలో బద్ధకాన్ని వదిలించే హుషారైన వ్యాయమ స్నేహితుణ్ణి/స్నేహితురాలిని ఎంచుకోండి. మీరు మారం చేసినా 'పద' అని తిట్టి, ఉత్సాహపరిచి తీసుకెళ్లేవాళ్లు మీకు మేలు చేస్తారు. కాసేపటిలోనే బద్ధకం పోయి మీరు వ్యాయామంలో, నడకలో పడతారు.



ఇంటి పనులు

శీతాకాలం ఇంటి పనులు పంచుకోవడం కూడా శరీరానికి మంచిది. శీతాకాలంలో అందరికీ నచ్చే గది వంటగది. ఎందుకంటే వెచ్చగా ఉంటుంది. వంట పనిలో సాయం చేయడం, వంట చేయడం చిన్న వ్యాయామం కాదు. కూరగాయలు తరగడం, అంట్లు తోమడం, టీ పెట్టడం, గ్రైండర్ వేయడం... వీటినే వ్యాయామం అనుకుంటే బయటి చలిని ఎదుర్కొనే బాధ తప్పుతుంది.

మానసిక ఆరోగ్యం

చలికాలం తొందరగా ఇల్లు చేరుకోబుద్ధవుతుంది. ఇంటికి చేరాక ఫోన్, టీవీ, ఇంటర్‌నెట్‌లో గడపడం కంటే మంచి పుస్తకాలు చదవడం మానసిక ఆరోగ్యానికి మంచిది. చక్కగా రగ్గు కప్పుకుని పుస్తకాలు చదవండి. లేదా పిల్లలకు కథలు చెప్పండి. జీవిత భాగస్వామితో కబుర్లు చెప్పండి. కథలతో నిద్రలోకి జారుకోండి.

ఎక్స్‌పైరీ డేట్ ఎందుకు?



వివిధ రకాల ఉత్పత్తులపై ఎక్స్‌పైరీ డేట్ ఎందుకు వేస్తారు? కాలం చెల్లిన తర్వాత వాటిని వాడితే ఏమౌతుంది? కొన్ని రకాల ఆహారపదార్థాల పైన యూజ్ బై లేదా బెస్ట్ బిఫోర్ అని రాసి ఉంటుంది. దాని అర్థం ఆ తేదీ దాటిన తర్వాత వాటిని వినియోగించ కూడదా? ఒకవేళ వాడితే ఏమవుతుంది? తెలుసుకుందామా..?

ఇంటి అవసరాల కోసం మనం ఒకోసారి కొన్ని నెలలకు సరిపడా అన్ని రకాల కిరాణా సామాన్లు ఒకేసారి తెచ్చుకుంటూ ఉంటాం. అయితే కొద్దిరోజుల తర్వాత వాటిలో కొన్నింటికి ఎక్స్‌పైరీ డేట్ చూసి, అయ్యో, ఇది ఈ తేదీలోగా గమనిస్తే వాటిని అలాగే వాడుతున్నారా, లేక ఎక్స్‌పైరీ అయిపోయాయని పాడేస్తున్నారా తెలుస్తుంది. మన ఇండ్లల్లో కూడా తాతాల కాలం నుంచే కారం, పసుపు, చింతపండు అని ఎన్నో రకాల పదార్థాలను ఒకేసారి కొనుగోలు చేసి వాటినే భద్రంగా దాచుకొని సంవత్సరాల పాటు వాడటం మనకు తెలుసు.

మరి ఇంతకాలంగా లేనిది ఇప్పుడు ఇప్పుడు ప్రతీదానికి ఈ ఎక్స్‌పైరీ తేదీతో సంబంధం ఏమిటి? ఇప్పుడు మార్కెట్లో మనం చూస్తే ప్రతి దానిపై ధరతో పాటు ఎప్పుడు తయారు చేశారు (Manufacture Date), అది ఎప్పటిలోగా వాడాలో తెలిపే ఎక్స్‌పైరీ డేట్ ముద్రించి ఉంటుంది. అయితే ఏదైనా వస్తువు దాని కాలపరిమితి దాటిపోయింది అంటే అది పూర్తిగా పాడైపోయింది ఇక వినియోగించకూడదు అని కాదు. ఆ పదార్థం ప్యాకింగ్ చేసేటపుడు ఏదైతే తాజాదనం ఉంటుందో ఆ తేదీ దాటిన తర్వాత తిరిగి అదే తాజాదనం ఉండదు అని అర్థం.

వాస్తవానికి ఏ వస్తువైనా మనం భద్రపరుచుకునే విధానాన్ని బట్టి ఉంటుంది. ఎక్స్‌పైరీ డేట్ ఉండి, ప్యాకింగ్ సరిగా లేకుంటే అది కూడా వెంటనే పాడవవచ్చు. ఉప్పులాంటి పదార్థాలను సంవత్సరాల కొద్దీ వాడుకోవచ్చు. డ్రైఫ్రూట్స్ లాంటివి కూడా సరిగ్గా భద్రపరిస్తే సంవత్సరం వరకూ నిల్వ ఉంటాయి. ఏదైనా వస్తువు చెడిపోయింది అంటే అది దాని నుంచి వచ్చే వాసన, దాని స్వభావాన్ని చూసి మనం పసిగట్టవచ్చు.

అలా అని ఇకపై ఎక్స్‌పైరీ డేట్ ఉన్నవన్నీ తినేయకండి. ఎందుకంటే, సాధారణంగా ఆహార పదార్థాలు కొద్ది కాలం వరకు మాత్రమే బాగుంటాయి. గడువు ముగిసే కొద్దీ ఆహార పదార్థాలు పాడవుతాయి. మందుల విషయంలో ఎక్స్‌పైరీ తేదీని జాగ్రత్తగా గమనించాలి. ఆ తేదీ దాటిపోయిన తర్వాత వాడటం వల్ల ఆ మందు సమర్థంగా పని చేయకపోవచ్చు లేదా దానివల్ల మరింత ప్రమాదం ఏర్పడవచ్చు. అందువల్ల మందుల విషయంలో మాత్రం ఎక్స్‌పైరీ తేదీ దాటకముందే వాడటం మంచిది.

ఒక విషయం



శుభ్రత అంటే దుమ్ము, ధూళి లేకుండా చూసుకోవడమని చెప్పుకోవచ్చు. కానీ, ఆరోగ్యవంతమైన పరిసరాలు అంటే రోగకారకాలు, సూక్ష్మక్రిములు లేకుండా మెరుగుపర్చుకోవడం. శుభ్రత కన్నా మెరుగైన ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని మన చుట్టూ ఏర్పాటు చేసుకుంటే అంటువ్యాధుల్ని నివారించవచ్చు. అలాగే యాంటీబయోటిక్ నిరోధక శక్తిని కూడా అడ్డుకోవచ్చు. మురికి, క్రిములు, శుభ్రత, ఆరోగ్యవంతంగా ఉండడానికి మధ్య తేడాను అర్థం చేసుకోవడంలో కొంత గందరగోళానికి గురవుతున్నారు .రెండు వేల మందితో ఒక సర్వే చేయగా, అందులో 23 శాతం మంది.. హానికారక సూక్ష్మ క్రిముల వల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని భావిస్తున్నారని తేలింది.అయితే, అది 'కీడు చేసే నమ్మకం' అని, అలా చేయడం వల్ల పిల్లలు ప్రమాదకరమైన అంటురోగాల బారిన పడతారని ఈ నివేదిక తయారు చేసిన నిపుణులు చెబుతున్నారు. దానికి బదులు, ఆయా ప్రదేశాలను నిర్ణీత సమయాలకు శుభ్రం చేయడంపై దృష్టి పెట్టాలని, అవి శుభ్రంగా కనిపించిన ప్పటికీ తగిన శ్రద్ధ పెట్టి ఎలాంటి క్రిములు లేకుండా చూడాలని, అప్పుడే చెడ్డ సూక్ష్మ క్రియుల వ్యాప్తిని అడ్డుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.ఎప్పుడెప్పుడు.. ఎక్కడెక్కడ పరిసరాలను ఆరోగ్యవంతంగా ఉంచాలో తెలుసుకోవాలి.

ఆహారాన్ని తయారు చేసే, వడ్డించే ప్రాంతాలు, వేళ్లు, చేత్తో ఆహారం తీసుకునేప్పుడు, తర్వాత మరుగుదొడ్డి వాడిన తర్వాత, ఎవరైనా దగ్గేప్పుడు, తుమ్మేప్పుడు, ముక్కును చీదేప్పుడు. ఇల్లు, వంటగదిలో ఉండే మురికి బట్టలు, మసిగుడ్డలు, పెంపుడు జంతువులతో ఉన్నప్పుడు, చెత్త, వ్యర్థాలను చేత్తో తాకినప్పుడు, పారేసేటప్పుడు, అంటువ్యాధి సోకిన వారికి సపర్యలు చేసేప్పుడు చేతులు శుభ్రం చేసుకోవాలి.

• మీకు తెలుసా?

రోజూ తలస్నానం చేస్తే..?

కొందరు వారంలో అన్ని రోజులూ తలస్నానం చేస్తారు, ఇంకొంత మంది వారంలో ఒకటి లేదా రెండు సార్లు చేస్తారు. అయితే వాస్తవానికి వారంలో ఎన్నిసార్లు తలస్నానం చేయాలి అనేది చాలా మందికి తెలియదు. ఇంకో విషయం, అందరి జుట్టు ఒకేలా ఉండదు. కొందరికి వెంట్రుకలు పలుచగా ఉంటే మరికొందరికి ఒత్తుగా ఉంటాయి, కొందరి జుట్టు పట్టులాగా జారిపోయేలా ఉంటే ఇంకొందరి జుట్టు రింగులు తిరిగి ఉంటుంది. కాబట్టి ముందుగా వారి జుట్టు స్వభావం ఎలాంటిదో తెలుసుకొని దానికనుగుణంగా తలస్నానం చేయాల్సి ఉంటుంది. లేకపోతే జుట్టు రాలిపోవటం, నిర్జీవంగా మారడం, చుండ్రు రావటం లాంటి సమస్యలు అనవసరంగా కొనితెచ్చుకున్నట్లు అవుతుంది.



హిట్ డైరెక్షన్

ప్రతి ఏడాది కొత్త దర్శకులు పరిచయం అవుతుంటారు. ఈ ఏడాది కూడా కొత్త డైరెక్టర్లు వచ్చారు. దాదాపు పదిహేనుకు పైగా కొత్త దర్శకులు వస్తే.. అందులో హిట్ బొమ్మ (సినిమా) ఇచ్చిన దర్శకులు ఎక్కువగానే ఉన్నారు. ఇలా హిట్ డైరెక్షన్‌తో ఎంట్రీ ఇచ్చిన డైరెక్టర్ల గురించి తెలుసుకుందాం.

డీజే సౌండ్ అదిరింది

ఈ ఏడాది ప్రేమికుల దినోత్సవానికి రెండు రోజుల ముందు వచ్చిన 'డీజే టిల్లు' చిత్రం అద్భుతమైన విజయం సాధించింది. టైటిల్ రోల్‌లో సిద్ధు జొన్నలగడ్డ నటించగా, నెగటివ్ షేడ్స్ ఉన్న హీరోయిన్ పాత్రను నేహా శెట్టి చేశారు. సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ చిత్రంతో విమల్ కృష్ణ దర్శకుడిగా తెలుగు ఇండస్ట్రీకి పరిచయం అయ్యారు. ఈ చిత్రంలోని 'డీజే టిల్లు' టైటిల్ సాంగ్, 'పటాస్ పిల్ల' పాటలు శ్రోతలను ఉర్రూతలూగించాయి. ఈ డీజే హిట్ సౌండ్ ఇచ్చిన కిక్‌తో సీక్వెల్‌గా 'డీజేటిల్లు స్క్వేర్'ను తీస్తున్నారు. అయితే ఈ చిత్రానికి మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు.



• విమల్ కృష్ణ

పసందైన కళ్యాణం

'రాజావారు రాణిగారు, అద్భుతం' వంటి సినిమాలకు సినిమాటోగ్రాఫర్‌గా చేసిన విద్యాసాగర్ చింతా దర్శకత్వం వహించిన తొలి సినిమా 'అశోకవనంలో అర్జున కళ్యాణం'. విశ్వక్ సేన్‌కు ఈ సినిమాతో క్లాస్ ఇమేజ్ తెప్పించారు విద్యాసాగర్. ఇందులో రుక్సార్ ధిల్లాన్ హీరోయిన్. 'రాజావారు రాణిగారు' చిత్రానికి దర్శకత్వం వహించిన రవికిరణ్ కోల ఈ సినిమాకు కథ, మాటలు, స్క్రీన్‌ప్లే ఇచ్చి షో రన్నర్‌గా వ్యవహరించారు. భోగవల్లి బాపినీడు, సుధీర్ ఈదర నిర్మించిన ఈ 'అర్జున కళ్యాణం' మే 6న విడుదలై, ప్రేక్షకులకు పసందైన అనుభూతినిచ్చింది.



• విద్యాసాగర్

కలెక్షన్ కింగ్

కల్యాణ్‌రామ్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లను రాబట్టిన చిత్రం 'బింబిసార'. ఈ హిట్ ఫిల్మ్‌తో దర్శకుడిగా పరిచయం అయ్యారు వశిష్ఠ. రాజుల కాలం, ప్రస్తుత కాలం నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం మంచి వసూళ్లు రాబట్టి కలెక్షన్ కింగ్ అనిపించుకుంది. ఇక 'బింబిసార- 2' కూడా ఉండొచ్చనే హింట్ ఇచ్చారు వశిష్ఠ. నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా కె. హరికృష్ణ నిర్మించిన 'బింబిసార' ఈ ఏడాది ఆగస్టు 5న విడుదలైంది.



• వశిష్ఠ

డబుల్ ధమాకా

తెలుగు, తమిళ ప్రేక్షకుల మెప్పును ఒకే సినిమాతో పొందిన డబుల్ ధమాకా శ్రీకార్తీక్ దక్కింది. శర్వానంద్ హీరోగా అక్కినేని అమల, ప్రియదర్శి, 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రల్లో నటించిన ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం 'ఒకే ఒక జీవితం' . ఎస్ఆర్ ప్రకాష్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమాకి శ్రీకార్తీక్ దర్శకుడు. సెప్టెంబరు 9న ఈ సినిమా విడుదలైంది. తల్లీకొడుకుల సెంటిమెంట్‌కు టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్ మిళితం చేసి ప్రేక్షకులను అలరించారు శ్రీకార్తీక్.



• శ్రీ కార్తీక్

మంచి ముత్యం

సరోగసీ కాన్సెప్ట్‌తో వినోదాత్మకంగా 'స్వాతి ముత్యం' చిత్రాన్ని తెరకెక్కించి ప్రేక్షకుల మెప్పు పొందారు దర్శకుడు లక్ష్మణ్ కె. కృష్ణ. 'సదా నీ ప్రేమలో..' అనే ఇండిపెండెంట్ ఫిల్మ్ తర్వాత లక్ష్మణ్ దర్శకత్వంలో వచ్చిన తొలి ఫీచర్ ఫిల్మ్ 'స్వాతి ముత్యం'. సూర్యదేవర నాగవంశీ నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమాతో లక్ష్మణ్ కె. కృష్ణ దర్శకుడిగా పరిచయం అయితే హీరో బెల్లంకొండ గణేష్‌కు కూడా ఇది తొలి చిత్రమే. వీరిద్దరూ మంచి ముత్యంలాంటి సినిమా ఇచ్చి, ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.



• లక్ష్మణ్ కె. కృష్ణ

అక్కడ హిట్.. ఇక్కడా హిట్టే...

'ఓ మై కడవులే' (2020)తో తమిళ పరిశ్రమకు దర్శకునిగా పరిచయమయ్యారు అశ్వత్ మారిముత్తు. ఇదే సినిమా రీమేక్ 'ఓరి.. దేవుడా'తోనే తెలుగులోనూ దర్శకునిగా పరిచయం అయ్యారు అశ్వత్. 'ఓరి.. దేవుడా..' కూడా ఓ మాదిరి హిట్‌గా నిలిచింది. ఇందులో విశ్వక్ సేన్ హీరోగా నటించగా, వెంకటేశ్ కీలక పాత్ర చేశారు. అక్టోబరు 21న విడుదలైన ఈ చిత్రానికి 'దిల్' రాజు, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మాతలు.



• అశ్వత్ మారిముత్తు

థ్రిల్లింగ్ హిట్

'అంబులి' సినిమాతో తమిళ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు దర్శక-ద్వయం హరి శంకర్–హరీష్ నారాయణ్. ఈ ఇద్దరూ తెరకెక్కించిన 'యశోద' గత నెల రిలీజై, హిట్ టాక్ తెచ్చుకుంది. సమంత టైటిల్ రోల్‌లో, వరలక్ష్మీ శరత్‌కుమార్, ఉన్ని ముకుందన్ కీలక పాత్రల్లో నటించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీతో తెలుగుకు దర్శకులుగా పరిచయం అయ్యారు హరి-హరీష్. సరోగసీ నేపథ్యంలో జరిగే క్రైమ్స్ నేపథ్యంలో శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 11న విడుదలై, థ్రిల్లింగ్ హిట్ ఇచ్చింది.



• హరి, హరీష్

హిట్ హారర్

ఈ ఏడాది చిన్న సినిమాగా విడుదలై పెద్ద హిట్‌గా నిలిచిన చిత్రాల జాబితాలో 'మసూద' ఉంది. సూపర్ నేచురల్ హారర్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన ఈ సినిమాకి సాయికిరణ్ దర్శకుడు. సంగీత, తిరువీర్, కావ్య కళ్యాణ్‌రామ్, 'శుభలేఖ' సుధాకర్ ప్రధాన పాత్రల్లో నటించారు. రాహుల్ యాదవ్ నక్కా నిర్మించిన ఈ చిత్రం నవంబరు 18న విడుదలైంది.



• సాయికిరణ్

ఇంకొందరు...

రవితేజ 'రామారావు ఆన్ డ్యూటీ' తో శరత్ మండవ (తెలుగులో శరత్‌కు తొలి చిత్రం) వరుణ్ తేజ్ బాక్సింగ్ డ్రామా 'గని'తో కిరణ్ కొర్రపాటి, నితిన్ పొలిటికల్ డ్రామా 'మాచర్ల నియోజకవర్గం' తో ఎమ్ఎస్ రాజశేఖర్ రెడ్డి, శ్రీ విష్ణు 'అల్లూరి' తో ప్రదీప్‌వర్మ, 'టెన్త్‌క్లాస్ డైరీస్'తో సినిమాటోగ్రాఫర్ అంజి, సుమ కనకాల 'జయమ్మ పంచాయితీ' తో విజయ్‌కుమార్ కలివరపు, హర్ష్ కనుమిల్లి 'సెహరి'తో జ్ఞానశేఖర్ ద్వారక, రాజ్‌తరుణ్ 'స్టాండప్ రాహుల్'తో శాంటో, వైష్ణవ్ తేజ్ 'రంగరంగ వైభవంగా..'తో గిరీశాయ (తెలుగులో...), 'ముఖచిత్రం' సినిమాతో గంగాధర్ వంటి దర్శకులు ప్రేక్షకుల మెప్పు పొందే ప్రయత్నం చేశారు.

సినిమా

ప్రతి క్షణం ప్రమాదం

నయనతార లీడ్ రోల్‌లో అశ్విన్ శరవణన్ దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం 'కనెక్ట్'. సత్యరాజ్, అనుపమ్ ఖేర్ కీలక పాత్రధారులు. ఈ నెల 22న ఈ చిత్రం రిలీజ్ కానుంది. 'కనెక్ట్' తెలుగు వెర్షన్‌ను యూవీ క్రియేషన్స్ రిలీజ్ చేస్తోంది. తెలుగు ట్రైలర్‌ను సోషల్ మీడియాలో ప్రభాస్ షేర్ చేశారు. దేశంలో లాక్‌డౌన్ విధించడానికి 24 గంటల ముందు అంటూ ట్రైలర్ సాగుతుంది.'నాన్నా నేను చెప్పేది విను.', 'నీతో ఉన్నదీ మన అమ్ము కాదు.. అక్కడ ఉన్న ప్రతిక్షణం నీ ప్రాణానికి ప్రమాదం' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి.



• సత్యరాజ్, నయనతార, అనుపమ్ ఖేర్

రామ్ ప్రేమ

''రోహిత్ నటించిన 'నాట్యం' చూశాను. అతనిలో మంచి డ్యాన్సర్, యాక్టర్ వున్నారు. 'లవ్ యూ రామ్' అతనికి మంచి బ్రేక్ ఇస్తుందని నమ్ముతున్నాను. ఈ సినిమాలో పాటలు అద్భుతంగా వున్నాయి. దర్శకుడిగా అద్భుత చిత్రాలు అందించిన దశరథ్ నిర్మాతగానూ సక్సెస్ అవ్వాలని కోరుతున్నాను'' అన్నారు తెలంగాణ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్. రోహిత్ బెహల్, అపర్ణ జనార్ధనన్ జంటగా దర్శకుడు కె. దశరథ్ అందించిన కథతో తెరకెక్కుతున్న చిత్రం 'లవ్ యూ రామ్'. డీవై చౌదరి దర్శకత్వంలో డీవై చౌదరి, కె. దశరథ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా సాంగ్ టీజర్‌ని తెలంగాణ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, టీజర్‌ను దర్శకుడు హరీష్ శంకర్ రిలీజ్ చేశారు. ''ఈ సినిమా చూశాను. అందరూ ఆదరిస్తారని అనుకుంటున్నాను'' అన్నారు హరీష్ శంకర్. ''మిస్టర్ పర్ఫెక్ట్‌తో హరీష్ శంకర్, నా జర్నీ మొదలైంది. ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఈ చిత్రానికి పని చేశారాయన'' అన్నారు కె. దశరథ్. ''ఈ సినిమాలో దశరథ్‌గారు కూడా నటించారు'' అన్నారు డీవై చౌదరి. ఈ చిత్రానికి సంగీతం: కె. వేద.



• అపర్ణ, రోహిత్

రాజ్ కథ

రాజ్ కార్తికేన్ హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'రాజ్ కహాని'. చంద్రికా అవస్థి, సోనియా సాహా, ప్రియా పాల్, సాయి, 'జబర్దస్త్' ఫణి కీలక పాత్రలు పోషించారు. భాస్కర రాజు, ధార్మికేన్ రాజు నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధం అవుతోంది. ఈ సందర్భంగా హీరో, దర్శకుడు రాజ్ కార్తికేన్ మాట్లాడుతూ– ''అమ్మ ప్రేమను అంతర్లీనంగా, అమ్మాయి ప్రేమను బాహ్యావలయంగా చేసుకుని అసలైన ప్రేమకు అర్థం చెప్పే సినిమా ఇది'' అన్నారు. ''మంచి సబ్జెక్ట్‌తో రూపొందించాం. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం'' అన్నారు నిర్మాతలు. దివంగత ప్రముఖ సంగీత దర్శకులు చక్రి సోదరుడు మహిత్ నారాయణ్ ఈ సినిమాకు స్వరకర్త.



• రాజ్ కార్తికేన్

ఇడియట్‌తో లవ్

విరాట్, శ్రీలీల జంటగా బెక్కెం వేణుగోపాల్, వసంత సమర్పణలో ఏపీ అర్జున్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఐ లవ్ యు ఇడియట్'. సాయికిరణ్ బత్తుల, సుదర్శన్ గౌడ్ బత్తుల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ''మంచి కాన్సెప్ట్‌తో వచ్చే చిత్రాలను ప్రేక్షకులను ఆదరిస్తారనే నమ్మకంతో ఈ సినిమా నిర్మించాం'' అన్నారు సాయికిరణ్ బత్తుల. ''చిన్న సినిమాలకు సపోర్ట్‌గా నిలిచే బెక్కెం వేణుగోపాల్‌గారు మా సినిమా రిలీజ్ చేయడానికి ముందుకు రావడం సంతోషంగా ఉంది'' అన్నారు ఏపీ అర్జున్. ఈ చిత్రానికి సంగీతం: వి. హరికృష్ణ, కెమెరా: అర్జున్ శెట్టి.



• శ్రీలీల

ఓ తండ్రి తీర్పు

ప్రతాప్, శ్రీరామ్, రాజేంద్ర రాజు, వివా రెడ్డి, సురభి శ్రావణి ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'ఓ తండ్రి తీర్పు'. లయన్ ఆరిగపూడి విజయ్ కుమార్ సమర్పణలో లయన్ శ్రీరామ్ దత్తి నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్టర్‌ను నటుడు- నిర్మాత మురళీమోహన్ ఆవిష్కరించారు. రాజేంద్ర రాజు కాంచనపల్లి పర్యవేక్షణలో ప్రతాప్ భీమవరపు దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. ''రచయిత-దర్శకుడు ప్రతాప్ భీమవరపుగారు తండ్రిగా నటిస్తూ, ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు'' అన్నారు శ్రీరామ్ దత్తి. ''మురళీమోహన్‌గారి 'ఓ తండ్రి తీర్పు' చిత్రం నాకు చాలా ఇష్టం. అందుకే అదే టైటిల్‌తో ఒక మంచి కథ రాసుకొని సినిమాగా తీస్తున్నాను'' అన్నారు ప్రతాప్ భీమవరపు.



• రాజేంద్ర రాజు

సాక్షి బిజినెస్
శనివారం
10-12-2022

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
389	113
62,182	18,497

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	11,116	△	35
డోజోన్స్	33,756	▽	26
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,477	△	4
డాక్స్	14,371	△	106
షాంఘై	3,207	△	10
నికాయ్	27,901	△	113

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	
53,937	△ 157
బంగారం (99.5 స్వచ్ఛత)	
53,721	△ 156
వెండి (కిలో)	
66,131	△ 773

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎటిఎం	81.08	83.25
€	యూరో	ఎటిఎం	84.49	87.12
£	బ్రిటన్ పౌండ్	ఎటిఎం	98.76	101.02
¥	జపాన్ ఎన్ (100)	ఎటిఎం	60.03	61.65
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎటిఎం	55.06	55.93
S$	సింగపూర్ డాలర్	ఎటిఎం	60.01	61.68
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	20.94	22.62
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.50	23.30
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.07	12.73

ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణ బిడ్ల గడువు పొడిగింపు?



న్యూఢిల్లీ: ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణకు సంబంధించి ప్రాథమిక బిడ్ల దాఖలుకు గడువును దాదాపు నెల రోజుల పాటు పొడిగించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. జనవరి తొలినాళ్ల వరకూ దీన్ని పెంచవచ్చని అధికార వర్గాలు తెలిపాయి. బిడ్‌లో పాల్గొనేందుకు ఆసక్తిగా ఉన్న సంస్థలు ఈ మేరకు అభ్యర్థించినట్లు పేర్కొన్నాయి. సంవత్సరాంతపు సెలవుల కారణంగా విదేశీ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు పని చేయరు కాబట్టి డెడ్‌లైన్‌ను పొడిగించవచ్చని తెలిపాయి. వాస్తవానికి ప్రాథమిక బిడ్ల దాఖలుకు డిసెంబర్ 16 ఆఖరు తేదీ. ఐడీబీఐ బ్యాంకులో కేంద్రం, ఎల్ఐసీకి 94.71 శాతం వాటాలు ఉన్నాయి. కేంద్రం 60.72 శాతం వాటాలను విక్రయించాలని భావిస్తోంది.

సన్‌ఫ్లేమ్.. వీగార్డ్ సొంతం

డీల్ విలువ రూ. 660 కోట్లు



ముంబై: కిచెన్ అప్లయెన్సెస్ సంస్థ సన్‌ఫ్లేమ్ ఎంటర్‌ప్రైజెస్‌ను కొనుగోలు చేయనున్నట్లు ఎలక్ట్రికల్స్, హోమ్ అప్లయెన్సెస్ కంపెనీ వీగార్డ్ ఇండస్ట్రీస్ తాజాగా పేర్కొంది. 100 శాతం వాటాను సొంతం చేసుకునేందుకు తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలియజేసింది. ఇందుకు మొత్తం నగదు రూపేణా రూ. 660 కోట్లు చెల్లించనున్నట్లు వెల్లడించింది. సన్‌ఫ్లేమ్ రుణరహిత సంస్థకాగా.. రూ. 50 కోట్ల నగదు నిల్వలను కలిగి ఉంది. అయితే డీల్‌లో చేర్చని కారణంగా నగదును సన్‌ఫ్లేమ్ ప్రమోటర్లు చేజిక్కించుకోనున్నట్లు వెల్లడించింది.

హైదరాబాద్‌లో 12 నుంచి 'టై' సదస్సు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ది ఇండస్ ఎంట్రప్రెన్యూర్స్ (టై) 7వ గ్లోబల్ సదస్సు డిసెంబర్ 12 నుంచి 14 వరకు హైదరాబాద్‌లో జరగనుంది. తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి కేటీ రామారావు సమక్షంలో ఈ సదస్సు ప్రారంభం కానుంది. అడోబ్ సిస్టమ్స్ సీఈవో శంతను నారాయణ్, గ్రీన్‌కో గ్రూప్ సీఈవో అనిల్ కుమార్ చలమలశెట్టి తదితరులు ఇందులో పాల్గొనున్నారు. 17 దేశాల నుంచి సుమారు 2,500 మంది ప్రతినిధులు, 150 మందికి పైగా వక్తలు హాజరవుతున్నారు. అంతర్జాతీయంగా ఎంట్రప్రెన్యూర్ షిప్‌ను ప్రోత్సహించేందుకు తోడ్పడే ఐడియాలపై ఇందులో ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు టై గ్లోబల్ వైస్ చైర్మన్ మురళి బుక్కపట్నం తెలిపారు.

జోయాలుక్కాస్ 'సీజన్ ఆఫ్ గివింగ్'



హైదరాబాద్: ఆభరణాల విక్రయ సంస్థ జోయాలుక్కాస్ ''సీజన్ ఆఫ్ గివింగ్'' పేరుతో ఆఫర్లను ప్రకటించింది. ఇందులో భాగంగా వజ్రాభరణాలపై 25 శాతం డిస్కౌంట్ అందిస్తోంది. ఎంపిక చేసిన డైమండ్ జ్యువెలరీ కలెక్షన్స్‌ను ఆకర్షణీయమైన ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపింది. ఒక ఏడాది ఉచిత బీమా, జోయాలుక్కాస్ నుంచి కొనుగోలు చేసిన అన్ని ఆభరణాలపై బై–బ్యాక్ హామీతో జీవితకాలపు ఉచిత నిర్వహణ సేవలు పొందవచ్చని పేర్కొంది. సీజన్ ఆఫ్ గివింగ్ ఆఫర్స్ దేశవ్యాప్తంగా అన్ని జోయాలుక్కాస్ షోరూంల్లో లభిస్తాయని ప్రకటించింది. కస్టమర్ల ప్రతి సంబరం గుర్తుండిపోయేలా చేయడమే తమ లక్ష్యమని జోయాలుక్కాస్ గ్రూప్ ఎండీ జాయ్ అలుక్కాస్ తెలిపారు. అందుకు అనుగుణంగా ప్రత్యేక ఆఫర్ల కోసం ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-12-2022	
విశాఖ	545–00
చిత్తూరు	568–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525–00
విజయవాడ	525–00
రిటైల్ ధర (డజను)	78.00
9-12-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	511–00
వరంగల్	513–00
రిటైల్ ధర	5.70

ఐటీ, ఇంధన షేర్లు పడేశాయ్

- వారాంతాన లాభాల స్వీకరణ
- లాభాల్లోంచి నష్టాల్లోకి సూచీలు
- సెన్సెక్స్ 389 పాయింట్లు పతనం
- నిఫ్టీ నష్టం 113 పాయింట్లు



ముంబై: స్టాక్ మార్కెట్ లాభాలు ఒకరోజుకే పరిమితమయ్యాయి. ఐటీ, ఇంధన షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో శుక్రవారం సెన్సెక్స్ 389 పాయింట్లు క్షీణించి 62,182 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 113 పాయింట్లు నష్టపోయి 18,497 వద్ద నిలిచింది. వారాంతపు రోజు కావడంతో ట్రేడర్లు పొజిషన్లు తీసుకునేందుకు వెనకాడారు. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. ఇటీవల క్రూడాయిల్ ధరలు పెరుగుతుండటం, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ సెంటిమెంట్‌పై మరింత ఒత్తిడిని పెంచాయి. ప్రపంచ మార్కెట్లలోని సానుకూలాంశాలు పెద్దగా ప్రభావాన్ని చూపలేకపోయాయి. ఎఫ్ఎంసీజీ, ఫార్మా మినహా అన్ని రంగాల షేర్లు నష్టాలను చవిచూశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.158 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.501 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ విలువ బలహీనపడటంతో పాటు చైనాలో కోవిడ్ ఆంక్షల సడలింపు వార్తలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 687 పాయింట్లు, నిఫ్టీ 200 పాయింట్లు నష్టపోయాయి.

ఇంట్రాడేలో 62 వేల దిగువకు సెన్సెక్స్

సెన్సెక్స్ ఉదయం 120 పాయింట్ల లాభంతో 62,690 వద్ద, నిఫ్టీ 53 పాయింట్లు పెరిగి 18,662 వద్ద మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచి అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో సూచీలు ఆరంభ లాభాలను కోల్పోయి క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 62 వేల స్థాయిని కోల్పోయి 681 పాయింట్లు క్షీణించి 61,889 వద్ద డే కనిష్టానికి దిగివచ్చింది. నిఫ్టీ 199 పాయింట్లు నష్టపోయి 18,410 వద్ద ఇంట్రాడే కనిష్ట స్థాయిని నమోదు చేసింది.

ఐటీ షేర్ల క్రాష్...

అమెరికాలో ప్రతికూల పరిస్థితుల కారణంగా ఐటీ కంపెనీల షేర్లలో 10 నుంచి 27 శాతం వరకు దిద్దుబాటు ఉండే అవకాశముందని క్రెడిట్ సూసీ నివేదిక తెలపడంతో ఈ రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి నెలకొంది. హెచ్‌సీఎల్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్ షేర్లు 6–3% నష్టపోయాయి. విప్రో, టీసీఎస్ షేర్లు 2%,1% చొప్పున పతనమయ్యాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ముందస్తు అంచనాల కంటే తక్కువగానే ఆదాయం రావచ్చని యాజమాన్య వ్యాఖ్యలతో హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేరు ఏడు శాతం నష్టపోయి రూ.1,027 వద్ద స్థిరపడింది.
- ఈక్విటీ షేర్ల బైబ్యాక్ నిమిత్తం డిసెంబర్ 13న(నేడు) బోర్డు భేటీ నేపథ్యంలో పేటీఎం షేరు 7 శాతానికి పైగా లాభపడి రూ.545 వద్ద నిలిచింది.
- యస్‌బ్యాంక్ షేరు 12% పెరిగి రూ.19.85 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 15 శాతానికి పైగా దూసుకెళ్లి రూ.20.50 వద్ద రెండేళ్ల గరిష్టాన్ని తాకింది. రుణాల డిఫాల్ట్ కేసులో జీ లెర్న్ లిమిటెడ్ అనుబంధ సంస్థ డిజిటల్ వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్‌పై కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియ కింద చర్యలు తీసుకోవాలంటూ ఎన్‌సీఎల్‌టీను యస్ బ్యాంక్ ఆశ్రయించడం షేరు ర్యాలీకి కారణమైంది.

మ్యారికో చేతికి వియత్నాం కంపెనీ

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం మ్యారికో లిమిటెడ్.. వియత్నాంకు చెందిన బ్యూటీ ఎక్స్ కార్పొరేషన్‌ను సొంతం చేసుకోనున్నట్లు పేర్కొంది. ఇందుకు తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలియజేసింది. మహిళా వ్యక్తిగత సంరక్షణ ప్రొడక్టుల కంపెనీ కొనుగోలుకి 493 బిలియన్ల వియత్నాం కరెన్సీ(రూ. 172 కోట్లు) చెల్లించనున్నట్లు వెల్లడించింది. ప్యూరిట్ డి ప్రివెన్స్, లివ్ బ్రాండ్ల కంపెనీ కొనుగోలు వియత్నాం మార్కెట్లో మ్యారికో కార్యకలాపాల విస్తరణకు దోహదం చేయనుంది. పూర్తి అనుబంధ సంస్థ మ్యారికో సౌత్ఈస్ట్ ఏషియన్ కార్పొరేషన్ ద్వారా బ్యూటీ ఎక్స్‌లో 100 శాతం వాటా కొనుగోలుకి సంతకాలు చేసినట్లు మ్యారికో తెలియజేసింది. కంపెనీ ప్రధానంగా సౌందర్యం, వ్యక్తిగత సంరక్షణ విభాగంలో కార్యకలాపాలు కలిగి ఉంది. షవర్ జెల్స్, షాంపూలు, కండిషనర్స్, ఫేస్ వాష్, లోషన్లు తదితర ప్రొడక్టులను రూపొందిస్తోంది. 2021లో బ్యూటీ ఎక్స్ రూ. 82 కోట్ల టర్నోవర్ సాధించింది. గతేడాది(2021–22)లో మ్యారికో రూ. 9,500 కోట్లకుపైగా ఆదాయాన్ని అందుకుంది.

బ్యూటీ ఎక్స్ కొనుగోలు వార్తలతో మ్యారికో షేరు ఎన్ఎస్ఈలో 2.6 శాతం ఎగసి రూ. 524 వద్ద ముగిసింది.

స్నాప్‌డీల్ ఐపీవో వాయిదా



న్యూఢిల్లీ: ఈకామర్స్ సంస్థ స్నాప్‌డీల్ పబ్లిక్ ఇష్యూ వాయిదా పడింది. రూ. 1,250 కోట్ల సమీకరణకు దాఖలు చేసిన ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను వెనక్కి తీసుకోవాలని నిర్ణయించింది. ఇందుకు వీలు కల్పించమంటూ క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీని అభ్యర్థించింది. వెరసి ఐపీవో ప్రణాళికలను తాత్కాలికంగా రద్దు చేసుకున్న ఫార్మ్ఈజీ, బోట్, డ్రూమ్ తదితర స్టార్టప్ బాటలో స్నాప్‌డీల్ నిలిచింది. పీఈ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్‌కు పెట్టుబడులున్న స్నాప్‌డీల్ ఐపీవో చేపట్టేందుకు గతేడాది డిసెంబర్‌లోనే సెబీకి దరఖాస్తు చేసింది. అయితే సెబీ నుంచి అనుమతులు లభించవలసి ఉన్న నేపథ్యంలో తాజా నిర్ణయాన్ని ప్రకటించింది. ఈకామర్స్ దిగ్గజాలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌తో పోటీపడుతున్న స్నాప్‌డీల్ ప్రపంచవ్యాప్తంగా టెక్ షేర్లలో అమ్మకాలు నమోదవుతుండటంతో వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. అయితే భవిష్యత్‌లో తిరిగి సన్నాహాలు చేపట్టే వీలున్నట్లు తెలియజేశారు.

డబ్బిస్తే మేమూ యూపీఐలు తయారుచేస్తాం

ఆర్‌బీఐకి యాక్సిస్ బ్యాంక్ ఎండీ అమితాబ్ కౌంటర్

ముంబై: యూపీఐ అవకాశాన్ని బ్యాంకులు చేజేతులా వదులుకున్నాయంటూ ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ టి. రబి శంకర్ చేసిన వ్యాఖ్యలపై ప్రైవేట్ రంగ యాక్సిస్ బ్యాంక్ ఎండీ అమితాబ్ చౌదరి ఘాటుగా స్పందించారు. అలాంటి వ్యాపారాలపై పెట్టుబడి పెట్టి వేల కోట్లు నష్టపోయేంత డబ్బు బ్యాంకుల దగ్గర లేదని వ్యాఖ్యానించారు. నష్టపోయినా ఫర్వాలేదని డబ్బులిస్తే తామూ యూపీఐ లాంటివి తయారు చేస్తామని ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన పేర్కొన్నారు. రబి శంకర్ విమర్శలపై స్పందించాలని కోరగా 'నష్టపోయేందుకు మా దగ్గర రూ. 3,000 కోట్ల డబ్బు లేదు' అని చౌదరి తెలిపారు. యూపీఐల్లాంటివి నష్టాలతో కూడుకున్న వ్యాపారాలని ఆయన చెప్పారు. వాటికి రాబడులు కూడా లేకపోయినా వేల్యుయేషన్స్ మాత్రం ఎలా పెరిగిపోతున్నాయో తెలియడం లేదని పేర్కొన్నారు. గూగుల్ పే, ఫోన్‌పే లాంటి సంస్థలకు వేరే వ్యాపారాలు ఉన్నాయి కాబట్టే అవి యూపీఐపై భారీగా ఖర్చులు చేయగలుగుతున్నాయని ఆయన తెలిపారు. 'ప్రస్తుతం టెక్నాలజీ వల్ల వచ్చిన సమస్యలేమిటంటే కొన్ని కంపెనీలకు పెట్టుబడుల రూపంలో భారీగా డబ్బు వస్తోంది. కస్టమర్లను సంపాదించుకోవడానికి అవి దాన్ని ఖర్చు పెడుతున్నాయి. ఆ క్రమంలో భారీగా నష్టపోతున్నాయి. ఈ ప్రక్రియలో వాటికి మరింత వేల్యుయేషన్ లభిస్తోంది. అయితే, అనేక సంవత్సరాలుగా కొనసాగుతున్న, ఇకపైనా కొనసాగబోయే బ్యాంకులు, ఇతరత్రా సంస్థలు అలాంటి ఆటలు ఆడలేవు' అని చౌదరి స్పష్టం చేశారు. మార్కెట్ వాటా విషయంలో యూపీఐ యాప్‌లతో పోలిస్తే బ్యాంకులు కాస్త వెనుకబడినా .. సదరు యాప్‌లు ఆదాయం ఆర్జించాలంటే మాత్రం తమతో పోటీపడక తప్పదని ఆయన పేర్కొన్నారు.



సాక్షి స్పోర్ట్స్

అక్సెల్‌సన్‌కు ప్రణయ్ షాక్

బ్యాడ్మింటన్ సీజన్ ముగింపు టోర్నీ వరల్డ్ టూర్ ఫైనల్స్‌ను భారత ప్లేయర్ ప్రణయ్ సంచలన విజయంతో ముగించాడు. వరుసగా తొలి రెండు లీగ్ మ్యాచ్‌ల్లో ఓడిన ఈ కేరళ ఆటగాడు సెమీఫైనల్‌కు అర్హత పొందలేకపోయాడు. బ్యాంకాక్‌లో శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ గ్రూప్ 'ఎ' చివరి మ్యాచ్‌లో 12వ ర్యాంకర్ ప్రణయ్ 14–21, 21–17, 21–18తో టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత, ప్రపంచ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ అక్సెల్‌సన్ (డెన్మార్క్)పై గెలుపొందాడు. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో గెలిచి సెమీఫైనల్ చేరిన అక్సెల్‌సన్‌కు ప్రణయ్‌తో 51 నిమిషాలపాటు జరిగిన పోరులో తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. నామమాత్రపు మ్యాచ్ కావడంతో ఒత్తిడి లేకుండా ఆడిన ప్రణయ్ తొలి గేమ్‌ను కోల్పోయినా ఆ తర్వాతి రెండు గేముల్లో గెలిచాడు. గ్రూప్ 'ఎ'లో చివరి స్థానంలో నిలిచిన ప్రణయ్‌కు 9000 డాలర్ల (రూ. 7 లక్షల 41 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.



క్లీన్‌స్వీప్ తప్పేనా?

- నేడు బంగ్లాదేశ్‌తో భారత్ చివరి వన్డే
- ఉదయం గం. 11:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



కుల్దీప్ యాదవ్, షహబాజ్

చటోగ్రామ్: వరుస ఓటములు, గాయాలతో సతమతమవుతున్న భారత్ ముందు క్లీన్‌స్వీప్ ప్రమాదం పొంచి ఉంది. సిరీస్ గెలిచేందుకు వచ్చి... తక్కువ ర్యాంక్ జట్టు చేతిలో వరుస పరాజయాలతో సిరీస్ చేజార్చుకున్న టీమిండియా ఇప్పుడు... పరువు కాపాడుకునే పనిలో పడింది. శనివారం ఆతిథ్య బంగ్లాదేశ్‌తో జరిగే చివరిదైన మూడో వన్డేలో గెలుపే లక్ష్యంగా భారత్ బరిలోకి దిగుతోంది.

కోహ్లి చెలరేగితే...

టాపార్డర్ వైఫల్యంతోనే భారత్ సిరీస్‌ను మూల్యంగా చెల్లించుకుంది. తాజాగా గాయంతో రోహిత్ గైర్హాజరీ జట్టుకు మరింత ప్రతికూలాంశం. దీంతో ధావన్–ఇషాన్ కిషన్ జోడీ ఇన్నింగ్స్ ఓపెన్ చేయడం ఖాయమైంది. అనుభవజ్ఞుడైన స్టార్ బ్యాటర్ కోహ్లి తనకు అచ్చొచ్చిన మూడో స్థానంలోనే ఎప్పట్లాగే చెలరేగితే భారత్ కష్టాలు సగం తీరుతాయి. మిడిలార్డర్‌లో శ్రేయస్ అయ్యర్, రాహుల్, అక్షర్ పటేల్ కూడా బాధ్యతను పంచుకుంటే ఏ బెంగా ఉండదు. ఈ పర్యటనలో మన బౌలింగ్ మెరుగనే చెప్పాలి. మరోవైపు బంగ్లాదేశ్ ఖాతాలో ఇప్పటికే సిరీస్ ఉంది. వాళ్లకు ఈ మ్యాచ్ ఓడినా నష్టం లేదు. కాబట్టి యథేచ్ఛగా ఆడే అవకాశముంది. ఇది సత్ఫలితాలిస్తే భారత్‌లాంటి ఓ మేటి జట్టుపై క్లీన్‌స్వీప్ అనేది బంగ్లా క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

పిచ్, వాతావరణం

బంగ్లాదేశ్‌లో బ్యాటింగ్‌కు బాగా అనుకూలించే పిచ్ ఇదే! గత రెండు వన్డేలతో పోలిస్తే ఈ మ్యాచ్‌లో భారీస్కోర్లు ఖాయం. వర్షం ముప్పు లేదు.

జట్లు (అంచనా)

భారత్: కేఎల్ రాహుల్ (కెప్టెన్), ధావన్, ఇషాన్ కిషన్, కోహ్లి, శ్రేయస్, సుందర్, అక్షర్, శార్దుల్, షహబాజ్/కుల్దీప్ యాదవ్, సిరాజ్, ఉమ్రాన్.

బంగ్లాదేశ్: లిటన్ దాస్ (కెప్టెన్), అనాముల్, నజ్ముల్, షకీబ్, ముష్ఫికర్, మహ్ముదుల్లా, అఫీఫ్, మెహదీ హసన్, నజుమ్, ముస్తఫిజుర్, ఇబాదత్.

బ్రెజిల్ గుండె పగిలింది

- క్వార్టర్ ఫైనల్లో ఓడిన మాజీ విజేత
- 'షూటౌట్'లో తేలిన ఫలితం
- 4–2తో నెగ్గి సెమీస్ చేరిన క్రొయేషియా

పెనాల్టీ షూటౌట్... అప్పటికే బ్రెజిల్ 2–4తో వెనుకబడి ఉంది. నాలుగు ప్రయత్నాల్లోనూ క్రొయేషియా స్కోరు చేయగా, బ్రెజిల్ రెండు సార్లే సఫలమైంది. ఇలాంటి సమయంలో మార్కినోస్ పెనాల్టీ తీసుకున్నాడు. స్టేడియం మొత్తం ఉత్కంఠ, ఈ షాట్ సరిగా పడకపోతే... ఏం జరుగుతుందో అతనికి బాగా తెలుసు... గోల్ పోస్ట్ కుడి వైపు గురి పెడుతూ మార్కినోస్ కిక్ కొట్టాడు. క్రొయేషియా గోల్ కీపర్ లివకోవిచ్ ఎడమ వైపు దూకాడు... దాంతో బంతి లక్ష్యం చేరినట్లే అనిపించింది. కానీ నేరుగా గోల్ పోస్ట్‌కు తాకి వెనక్కి వచ్చింది! అంతే...మార్కినోస్ కుప్పకూలిపోగా, బ్రెజిల్ ఆటగాళ్లంతా అచేతనంగా ఉండిపోయారు. మరోసారి హీరోగా మారిన లివకోవిచ్‌ను చుట్టుముట్టి క్రొయేషియా సంబరాల్లో మునిగిపోగా, స్టేడియంలో బ్రెజిల్ అభిమానుల గుండె పగిలింది. విషాదంతో నిండిపోయిన 'సాంబా' బృందం కన్నీళ్లపర్యంతమైంది. ఐదుసార్లు విజేత, టైటిల్ ఫేవరెట్ బ్రెజిల్ ప్రస్థానం క్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. వరుసగా ఐదో వరల్డ్ కప్‌లో రిక్త హస్తాలకే పరిమితమైన తమ జట్టు పరిస్థితిపై ఫ్యాన్స్ వేదన చూసి సగటు ఫుట్‌బాల్ అభిమానీ అయ్యో అంటూ బాధపడిపోయాడు!



బ్రెజిల్ ప్లేయర్ రోడ్రిగో తొలిషాట్‌ను నిలువరిస్తున్న క్రొయేషియా గోల్‌కీపర్ లివకోవిచ్



నెమార్ విలాపం

దోహా: వరల్డ్‌కప్ చరిత్రలో అత్యంత విజయవంతమైన జట్టు బ్రెజిల్ మరోసారి టైటిల్‌కు బహుదూరంలో నిలిచిపోయింది. గెలుపు అవకాశాలు సృష్టించుకున్నా, చివర్లో తడబాటుకు లోనై ఆపై షూటౌట్‌లో నిష్క్రమించింది. అవును...ఫిఫా వరల్డ్ కప్‌లో బ్రెజిల్ ఆట క్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. స్ఫూర్తిదాయక ప్రదర్శన కనబర్చిన గత ప్రపంచకప్ రన్నరప్ క్రొయేషియా పెనాల్టీలతో బ్రెజిల్‌ను మట్టి కరిపించింది. నిర్ణీత సమయంతో పాటు అదనపు సమయం కలిపిన తర్వాత ఇరు జట్లు ఒక్కో గోల్ చేసి 1–1తో సమంగా నిలిచాయి. దాంతో షూటౌట్ అనివార్యమైంది. ఇందులో 4–2 తేడాతో నెగ్గిన క్రొయేషియా సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. బ్రెజిల్ తరఫున నెమార్ (105+1వ నిమిషంలో) గోల్ కొట్టగా, క్రొయేషియా ఆటగాడు బ్రూనో పెట్‌కోవిచ్ (117వ నిమిషం)లో స్కోరు సమం చేశాడు.

హోరాహోరీగా...

తొలి అర్ధభాగంలో ఇరు జట్లు బంతిపై పట్టు కోసం తీవ్రంగా ప్రయత్నించాయి. బ్రెజిల్ కొంత దూకుడు కనబర్చినా, క్రొయేషియా పదునైన డిఫెన్స్‌తో నిలువరించగలిగింది. ముఖ్యంగా బ్రెజిల్ ప్లేయర్లు రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా ప్రత్యర్థి తలవంచలేదు. మిడ్‌ఫీల్డర్లు బ్రొజోవిచ్, కొవాసిచ్, మోడ్రిచ్ అద్భుత ఆటతో బ్రెజిల్‌కు అవకాశం ఇవ్వకుండా వ్యూహాన్ని సమర్థంగా అమలు చేశారు. కీపర్ లివకోవిచ్ కూడా కీలక పాత్ర పోషించాడు. వినిసియస్ కొట్టిన షాట్‌ను అతను సమర్థంగా ఆపగలిగాడు. నెమార్ కూడా చురుగ్గా కదల్లేకపోవడం బ్రెజిల్‌కు ప్రతికూలంగా మారింది. రెండో అర్ధభాగంలో మాత్రం పరిస్థితి మారింది. నెమార్ కూడా లయ అందుకోగా రిచార్లీసన్ కూడా జత కలిశాడు. అయితే 55వ నిమిషంలో రిచార్లీసన్ చేసిన ప్రయత్నాన్ని, 66వ నిమిషంలో పక్వెటా సృష్టించిన అవకాశంతో పాటు 76వ నిమిషంలో నెమార్ కొట్టిన కిక్‌ను కూడా లివకోవిచ్ నిర్వీర్యం చేయడం విశేషం. 90 నిమిషాల ఆటలో స్కోరు నమోదు కాకపోగా, ఆట అదనపు సమయానికి చేరింది. ఇందులో నెమార్ అద్భుత గోల్ బ్రెజిల్‌ను ముందంజలో నిలిపింది. క్రొయేషియా డిఫెన్స్‌ను ఛేదించి దూసుకుపోయిన అతను గోల్ కీపర్ తప్పించడంలో సఫలం కావడంతో అభిమానుల సంబరాలు అంబరాన్ని తాకాయి. కెరీర్‌లో 77వ గోల్‌తో అతను పీలే రికార్డును సమం చేయడం విశేషం. అయితే క్రొయేషియా వెంటనే కోలుకుంది. మరో నాలుగు నిమిషాల్లో ఆట ముగుస్తుందనగా మోర్సిచ్ అందించిన పాస్‌ను సూపర్ కిక్‌తో గోల్‌గా మలచడంలో పెట్‌కోవిచ్ విజయం సాధించాడు. ఈ ఆసక్తికర సమరం తుది ఫలితం మాత్రం చివరకు షూటౌట్ తోనే తేలింది. వరుసగా రెండో వరల్డ్‌కప్‌లోనూ బ్రెజిల్ క్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించింది.

షూటౌట్ సాగిందిలా...

క్రొయేషియా		స్కోరు	బ్రెజిల్	
వ్లాసిచ్	✔	1-0	రోడ్రిగో	✘
మాజెర్	✔	2-1	కేసెమిరో	✔
మోడ్రిచ్	✔	3-2	పెడ్రో	✔
ఓర్సిచ్	✔	4-2	మార్కినోస్	✘

నోట్: ఫలితం తేలిపోవడంతో ఐదో షాట్‌ను తీసుకోలేదు

ప్రపంచకప్‌లో నేడు క్వార్టర్ ఫైనల్స్

పోర్చుగల్ x మొరాకో
రాత్రి గం. 8:30 నుంచి

ఫ్రాన్స్ x ఇంగ్లండ్
అర్ధరాత్రి గం. 12:30 నుంచి

స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



క్రొయేషియా జట్టు సంబరం

భారత్ పరాజయం



అంజలికి క్యాప్ అందజేస్తున్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్

ముంబై: భారత మహిళల జట్టుతో శుక్రవారం జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు 9 వికెట్ల తేడాతో గెలిచింది. మొదట భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 172 పరుగులు చేసింది. రిచా ఘోష్ (36; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), దీప్తి శర్మ (36 నాటౌట్; 8 ఫోర్లు) రాణించారు. ఆసీస్ అమ్మాయిలు 18.1 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి 173 పరుగులు చేసి గెలిచారు. ఓపెనర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బెత్ మూనీ (57 బంతుల్లో 89 నాటౌట్; 16 ఫోర్లు) మెరిసింది. ఈ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అంజలి శర్వాణి భారత్ టి20 జట్టు తరఫున అరంగేట్రం చేసిన 72వ ప్లేయర్‌గా గుర్తింపు పొందింది. కర్నూలు జిల్లాలోని ఆదోని పట్టణానికి చెందిన అంజలి 4 ఓవర్లు వేసి 27 పరుగులు ఇచ్చింది.

భారత్ 'ఎ'దే సిరీస్

సిల్హెట్: ఎడంచేతి వాటం స్పిన్నర్ సౌరభ్ కుమార్ (6/74)తోపాటు పేస్ బౌలర్లు ఉమేశ్ యాదవ్ (2/34), నవదీప్ సైని (2/54) రాణించడంతో... బంగ్లాదేశ్ 'ఎ' జట్టుతో జరిగిన రెండో అనధికారిక టెస్టులో భారత్ 'ఎ' ఇన్నింగ్స్ 123 పరుగుల ఆధిక్యంతో ఘనవిజయం సాధించింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 1–0తో సొంతం చేసుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 49/2తో మ్యాచ్ చివరిరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ 'ఎ' 79.5 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌటైంది.

అబ్రార్ అహ్మద్‌కు 7 వికెట్లు

ముల్తాన్: ఆడుతున్న తొలి టెస్టులోనే పాకిస్తాన్ లెగ్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ (7/114) ఏడు వికెట్లతో అదరగొట్టాడు. ఫలితంగా పాకిస్తాన్‌తో శుక్రవారం మొదలైన రెండో టెస్టులో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 51.4 ఓవర్లలో 281 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లండ్ బ్యాటర్లు బెన్ డకెట్ (63; 9 ఫోర్లు, 1 సిక్స్), ఓలీ పోప్ (60; 5 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. ఆట ముగిసే సమయానికి పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్లకు 107 పరుగులు చేసింది.

విండీస్ తడబాటు

అడిలైడ్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్టులో రెండో రోజు ఆట ముగిసే సమయానికి విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 102 పరుగులు చేసింది. తేజ్‌నారాయణ్ చందర్‌పాల్ (47 బ్యాటింగ్; 3 ఫోర్లు, 1 సిక్స్) ఒక్కడే నిలబడ్డాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 330/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 7 వికెట్లకు 511 పరుగులవద్ద డిక్లేర్ చేసింది.

12న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల


వర్షంలో పరుగులు తీస్తున్న భక్తులు

తిరుమల: 2023 జనవరి నెలకు సంబంధించి తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటాను ఈ నెల 12న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అదేవిధంగా 2023 జనవరి నెలకు సంబంధించి మరికొన్ని ఆర్జితసేవా టికెట్లకు ఆన్‌లైన్ లక్కీడిప్ నమోదు ప్రక్రియ 12న ఉదయం 10 నుంచి 14న ఉదయం 10 గంటల వరకు ఉంటుంది. ఆ తర్వాత లక్కీడిప్‌లో టికెట్లు కేటాయిస్తారు. భక్తులు ఈ విషయాలను గుర్తించి శ్రీవారి ఆర్జిత సేవలను బుక్ చేసుకోవాలని టీటీడీ ఒక ప్రకటనలో కోరింది.

శ్రీవారి దర్శనానికి 36 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్లు ఎంబీసీ 26 వద్దకు చేరుకున్నాయి. గురువారం అర్ధరాత్రి వరకు 54,609 మంది స్వామిని దర్శించుకోగా, 26,718 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి హుండీ కానుకల రూపంలో భక్తులు రూ.3.39 కోట్లు సమర్పించారు. శ్రీవారి దర్శన టోకెన్లు లేని భక్తులకు 36 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది. కాగా, తిరుమలలో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో దుకాణాలన్నీ మూతపడ్డాయి. శ్రీవారి దర్శనం ముగించుకుని ఆలయం వెలుపలకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడ్డారు.

ఉత్సవాల్లో ఇక పకడ్బందీ ఏర్పాట్లు

ఆలయ ఈవోలకు ప్రత్యేక ఆదేశాలు జారీ

- పదివేలమంది భక్తులు దాటితే..
- మౌలిక వసతులు, పటిష్ట భద్రత

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఏటా జరిగే తిరునాళ్లు, జాతర్లు, దేవతల పల్లకీ–రథం ఊరేగింపుల సందడి మళ్లీ మొదలు కాబోతుంది. ఈ నేపథ్యంలో.. ఒక రోజున కనీసం పది వేల మంది భక్తులు పాల్గొనే తిరునాళ్లు, జాతర్లకు అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేయాలని దేవదాయ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు తిరునాళ్లు, జాతరలు జరిగే ప్రాంత ఆలయాల ఈవోలకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తూ దేవదాయశాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరునాళ్లు, జాతర్లు, దేవతల పల్లకీ లేదా రథం ఊరేగింపుల వంటివి శాంతియుతంగా, గొప్పగా నిర్వహించడం.. భక్తులకు, సాధారణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా చేయడం దేవదాయ శాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల బాధ్యత అని..ఆయా శాఖల స్థానిక సిబ్బందిని ఆ ప్రక్రియలో భాగం చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఉత్సవాల ప్రారంభానికి ముందే స్థానిక ఆర్డీవోల ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ, పంచాయతీ లేదా మున్సిపల్, అగ్నిమాపక, రవాణ, ఎక్సైజ్ తదితర శాఖల సిబ్బందితో ఉమ్మడి సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ మొత్తం ప్రక్రియకు ఆలయ ఈవో కో–ఆర్డినేటర్‌గా వ్యవహరించాలని ఆదేశించారు.

ఉత్తరాంధ్రలో మొట్టమొదటి మహిళా మార్టు ప్రారంభం

మాడుగుల (అనకాపల్లి జిల్లా): ఉత్తరాంధ్ర జిల్లాల్లోనే మొట్టమొదటిసారిగా అనకాపల్లి జిల్లా మాడుగులలో శుక్రవారం చేయూత మహిళా మార్టును ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రారంభించారు. రూ.35 లక్షలతో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా మాడుగుల పంచాయతీ కార్యాలయం వద్ద దీనిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ బ్రాండెడ్ కంపెనీల నుంచి నాణ్యమైన సరుకులు తెచ్చి సామాన్య ప్రజలకు సరళమైన ధరలకు విక్రయించి మార్టు అభివృద్ధికి ప్రతి డ్వాక్రా మహిళా కృషి చేయాలని కోరారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే వారి కుటుంబాలు ఆర్థిక పరిపుష్టి సాధిస్తాయని గట్టిగా నమ్మిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి.. మహిళల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

‘ఎర్ర’ దొంగల కోసం ముమ్మరంగా కూంబింగ్

- రెండు వేర్వేరు దాడుల్లో 32 దుంగలు స్వాధీనం


తలకోనలో స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం

తిరుపతి అలిపిరి/ఎర్రావారిపాళెం: పోలీసులను చూసి పారిపోయిన ఎర్రచందనం దొంగల కోసం శేషాచలం అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ బలగాలు గురువారం మధ్యాహ్నం నుంచి ముమ్మరంగా కూంబింగ్ చేపట్టాయి. ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం నెరబైలు సెక్షన్ తలకోన సౌత్‌బీట్‌లో 21 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుంది. తిరుమల ఘాట్ రోడ్డు సమీపంలో మరో ఆర్ఎస్ఐ విశ్వనాథ్ బృందం సన్నరాళ్లమిట్ట వద్ద దుంగలను మోసుకొస్తున్న స్మగ్లర్లను గుర్తించడంతో అదుపు చేసేలోపే పరారయ్యారు. ఈ దాడిలో 11 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. రెండు దాడుల్లో 987 కిలోల బరువు కలిగిన 32 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ చక్రపాణి ఓ ప్రకటనలో తెలిపారు. వీటి విలువ రూ.50లక్షలు ఉంటుందని, పారిపోయిన స్మగ్లర్ల కోసం కూంబింగ్ కొనసాగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.